Barcode : 2020050003471
Title - kinnera, sanputam 2, sanchika 7, july 1950
Author - -
Language - Telugu
Pages - 88
Publication Year - 1950
Barcode EAN.UCC-13
2 020050 003471

3610


కన్నెర

# డేగ

మార్కు

## నీలగిరి తైలము

పరిశుద్ధమైనది

★

* అన్ని విధములైన నొప్పులకు
* పై పూతలకు డేగ మార్కు

## నీలగిరి తైలం వాడండి

అది కల్తీలేనిది * నమ్మకమైనది

★

## డేగమార్కు నీలగిరి తైలం

హిందూదేశమంతటా దొరుకును

# కిన్నెర

## విషయసూచిక
(జూలై 50)


ముఖ చిత్రం : నన్నయ

చిత్రకారుడు : శ్రీ పిలకా లక్ష్మీనరసింహమూర్తి

రైల్వే పునర్వ్యవస్థీకరణ 2

సంపాదకీయం

వ్యాఖ్యలు 6

డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ 8

శ్రీరాంపల్లి నరసింహశర్మ ఎం. ఎ.

డాక్టర్ కథ 17

శ్రీ నిడమర్తి ఉమా రాజేశ్వరరావు

స్వప్నము 29

శ్రీ ఎస్. వి. రమణారావు

రామ్మ తలపులు 35

శ్రీ తూలికాభూషణ

విజ్ఞాన పురోగతి : శబ్దవేగంమించి ప్రయాణం 39

శ్రీ వసంతరావు వెంకటరావు

వంటింటి సమావేశం 43

"మూర్తి"

నారాయణభట్టు 50

శ్రీ బులుసు వేంకటరమణయ్య

రాజా-రాణి 54

శ్రీ బుద్దుల వేంకట రమణారెడ్డి

రెండవతరం 57

శ్రీ వాగంటి సోమయాజులు

సాంఘిక వాసన 65

శ్రీ పారనంది జగన్నాథస్వామి

సౌందర్య నిరూపణలో అభిరుచి 69

శ్రీ తుమ్మలపల్లి సీతారామారావు

ఏరిన ముత్యాలు 78

కిన్నెర

ఎడిటర్ : పందిరి మల్లికార్జునరావు

సంపుటము 2 | జూలై 1950 | సంచిక 7

# రైల్వే పునర్వర్గీకరణ

భారత ప్రభుత్వ రైల్వే శాఖవారు ప్రస్తుతం అమలులోనున్న శాఖలను పునర్వర్గీకరణ చేయుటకు ఒక పథకాన్ని తయారు చేశారు. ఈ పథకాన్ని గూర్చి ప్రజాభిప్రాయాన్ని ఆగస్టునెల మూడవ తేదీలోగా తెలియపర్చవలసిందిగా కూడా కోరియున్నారు. కావున, ప్రభుత్వం చేయనున్న ఈ వర్గీకరణం ఆంధ్రులకు, ఆంధ్ర దేశానికి ఎంతవరకు లాభప్రదంగా ఉన్నదీ, లేక నష్టదాయకంగా ఉన్నదీ అను విషయాన్ని గూర్చి ఆంధ్రదేశంలోని ప్రజా సంఘాలు, సంస్థలు తమ తమ అభిప్రాయాలను తెలియజేసి, ప్రభుత్వానికి అందజేయుట చాల అవసరం.

అసమంజస పద్ధతి :

బ్రిటిష్ వరిపాలనా కాలంలో నిర్మింపబడిన ఈ రైల్వేలు సక్రమమైనట్టియు, సహేతుకమైనట్టియు పంథా ననుసరించి ఏర్పడి యుండలేదు. ఆయా సమయాలకు ఉచితమని తోచిన మార్గం అవలంబింపబడుతూ, రైల్వే లైనుల నిర్మాణం జరిగింది.

ఇందు సైనికావసరాలను, బ్రిటిష్ వారి వర్తక వ్యాపారాల సౌలభ్యాన్ని, ప్రయోజనాన్ని మనసునం దుంచుకొనియే ఈ రైల్వేల నిర్మాణం బహుళంగా సాగింది. అంతేకాని, ప్రజావసరాలు కాని, వారి సౌకర్యాలు కాని

ఏమాత్రం గమనింపబడి యుండలేదు. వివిధ ప్రాంతాల అభివృద్ధికి దోహద మివ్వగల సూత్రం అమలు జరుగలేదు. అందుచే దేశంలోని కొన్ని ప్రాంతాలు బాగా దెబ్బతిన్నవి. అందులో మన ఆంధ్ర ప్రాంతం ఒకటి.

ఇప్పటివరకు ఏర్పడియున్న రైల్వే విభజన వలన తెలుగు జిల్లాలు కొన్ని ఎం. ఎస్. ఎం రైల్వే లోను, కొన్ని బి. ఎస్. ఆర్. లోను, మరికొన్ని నైజాం స్టేటు రైల్వేలోను చేర్చబడినవి. అందుచే ఆంధ్ర జిల్లాల అవసరాలు, అభివృద్ధి తగినంత జరుగక పోవుటయే కాక, ఆంధ్ర భూమి చీలికలై రాజకీయంగా ఇంకను పరస్పరం దూరం అగుటకు హేతువైనవి. కాబట్టి, తెలుగు మాగాణి అభివృద్ధి వాంఛించిన యెడల తెలుగు జిల్లాలలోని రైల్వే పరిపాలన అంతయు ఒకే రైల్వే వర్గం యాజమాన్యనకు రావలెను.

## భారతదేశంలోని రైల్వేలు :

అవిభాజ్య భారతదేశంలో (పాకిస్తాన్‌తో సహా) మన దేశంలో ఉండే 61 రైల్వే శాఖలలో 13 ప్రథమశ్రేణికి, 16 ద్వితీయశ్రేణికి, 32 తృతీయశ్రేణికి చెందినవి. ఇవి అన్నీ వేరు వేరు యాజమాన్యాల అధీనంలో ఉండేవి.

అందుచే, రైల్వేల నిర్మాణం, సర్వహణ, వర్గీకరణ సహేతుకమైన పద్ధతులపై జరుపుటకు అవకాశ ముండేది కాదు. కాని, భారతదేశం స్వతంత్రమైన తరువాత, స్వదేశ సంస్థానాలు దేశంలో విలీనమైన పిమ్మట ఈ సంస్కరణలు సాధ్యం కాగల పరిస్థితులు కలిగినవి. కావున, భారత ప్రభుత్వం ఈ తరుణంలో రైల్వేల పునర్వర్గీకరణకు పూనుకొనుట ఎంతయు సమంజసం, సముచితం.

## కొత్త పథకపు సూత్రాలు :

భారత ప్రభుత్వం యాజమాన్యం క్రింద 33 వేల మైళ్ళ పొడవు రైల్వే లైను లున్నవి. ఇవి ఆరు జోనులుగా విభజించుటకు ప్రభుత్వం ఈ నూతన పథకాన్ని తయారు చేసింది.

ఈ వర్గీకరణకు ప్రభుత్వం కొన్ని సూత్రాలను అనుసరించినది. ఒక వర్గం క్రింద వుండే ప్రాంతం అంతయూ సంగతితమైన ఏక గడ్డగా ఉండవలె ననునది ఒక సూత్రం. వర్కుషాపు సదుపాయాలు, శిక్షణ, పరిశోధనా సంస్థలకు అనువు కలిగి ఆధునిక శాస్త్రీయ, సాంకేతిక పద్ధతులకు అనుగుణమైన కేంద్ర కార్యాలయ నిర్మాణాన్ని భరించ

కలిగి ఉండుట రెండవ సూత్రం. రైల్వే నిర్వహణ యొక్క నైపుణ్యానికి, పరిమాణానికి భంగం కలుగకుండా, ప్రస్తుతం అమలులో నున్న ఏర్పాటులు ఎక్కువగా మార్చ నవసరం లేకుండుట మూడవ సూత్రం. ఒక్కొక్క వర్గానికి సంబంధించిన పరిపాలనాది కార్య కలాపాలు డివిజన్ వారీగా గాని, జిల్లావారీగా గాని జరుగవలెనన్న నియమం పాటింప బడకపోయినా, కార్యాచరణ సాధ్య విచారణయే ప్రధానంగా కలిగియుండుట నాల్గవ సూత్రం.

### కొత్త వర్గాల విభజన :

ఉత్తర రైల్వే, పడమట రైల్వే, సెంట్రల్ రైల్వే, దక్షిణ రైల్వే, తూర్పు రైల్వే, ఈశాన్య రైల్వే అని దిక్కుల ననుసరించి ఆరు శాఖలుగ రైల్వేలు పునర్వర్గీకరణం చేయబడ గలవు. అందులోని నాల్గవ జోన్ అయిన దక్షిణ రైల్వేలో సౌత్ ఇండియన్ రైల్వే బ్రాడ్ గేజ్, మీటర్ గేజ్ యావత్తూ, మదరాసు దక్షిణ మహారాష్ట్ర రైల్వేలోని మీటరుగేజ్ అంతయూ, బ్రాడ్ గేజ్ లోని విశేష భాగం, మైసూరుస్టేట్ రైల్వే యావత్తూ చేరగలవు.

అయిదవ జోన్ అయిన తూర్పుప్రాంతపు రైల్వేలో నైజాం స్టేట్ రైల్వే లోనిభాగాలు, ఎం. ఎస్. ఎం. రైల్వే కొన్ని భాగాలు, జి. ఐ. పి. రైల్వే మొదలైనవి చేరగలవు.

భౌగోళికంగాను, రైల్వే పరిపాలనా దక్షత దృష్ట్యా ఈ విభజన సర్వోత్తమమైనదని ప్రభుత్వం అంటున్నది. కాని, ఈ "సర్వోత్తమమైన" పద్ధతి ఆంధ్రులకు, ఆంధ్రదేశానికి ఎంతవరకు క్షేమకరంగా ఉండగలదు?

### తెలుగు మాగాణి చీలికలు :

నూతనంగా ఏర్పడనున్న ఈ పథకం వలన దక్షిణపు జోనులో తమిళ, కేరళ జిల్లాలు అన్నియు ఏక ఖండంగా చేరగలవు. కాని, తెలుగు జిల్లాలు రెండు చీలికలై వేర్వేరు జోనుల యాజమాన్యం క్రిందకు రాగలవు.

ఆంధ్ర ప్రాంతం విభిన్న ఖండాలుగా చీల్పబడి, వేరు వేరు రాష్ట్రాల పరిపాలనలో నున్నది. రాజకీయంగా చీల్పబడిన ఆంధ్ర జిల్లాలు ఇతర భాషా ప్రాంతాలవారి పాలనలో బడి అనేక నష్టాలకు గురియైనవి. కావుననే, ఆంధ్రుల పురోభివృద్ధికి సమైక్య ఆంధ్ర రాష్ట్రం

వరకు గల నైజాం [illegible] భాగాన్ని చేర్చి సమగ్ర ఆంధ్ర భూభాగానికి ఒకే జోనను ఏర్పాటు చేయవలెను.

అట్లు జరుగని పక్షమున తెలుగు గడ్డ ఇంకను చీలికలై విశాలాంధ్ర రాష్ట్రానికి పెద్ద దెబ్బ పెట్టు కాగలదు. ఆంధ్రైక్యతకు శాశ్వతమైన అవరోధం కలుగ గలదు. కావున, ఆంధ్రులు దీనిపట్ల తమ తీవ్రమైన అసమ్మతిని తెలియ చేయవలెను.

# వ్యాఖ్యలు

<u>నాగార్జునుని కొండ :</u>

క్రీస్తుశకం తొలి శతాబ్దాలలో బౌద్ధ మతం ఆంధ్రదేశంలో విరివిగా వ్యాపించి యుండెను. ఆ కాలమున ఆంధ్ర దేశంలో పలుతావుల యందు సంఘారామాలు, స్తూపాలు, చైత్యాలయాలు నిర్మించ బడినవి. కాని, నేడవి పలు చోట్ల శిథిలములై కాలగర్భమున కలిసి పోయినవి.

ప్రభుత్వ పురాతత్వ శాఖ అన్వేషణ ఫలితంగా కొన్ని ప్రాచీన బౌద్ధ క్షేత్రాలు బయలు పడినవి. కృష్ణానదీ పరీవాహక ప్రదేశమందలి అమరావతి, జగ్గయ్యపేట, ఘంటసాల, గుమ్మడిదుర్రు, భట్టిప్రోలు మొదలైనవి ప్రాచీన కాలంలో సుప్రసిద్ధ బౌద్ధ క్షేత్రములని ఋజువయ్యెను.

పరాకాష్ఠనందిన అమరావతీ శిల్ప ప్రౌఢిమ ఆంధ్రుల కళాపాటవమునకు నీరాజనం ఎత్తినది. తెలుగు జాతి అపూర్వ శిల్ప సంపద కళారంగంలో ఆంధ్రులకు విశిష్ట స్థానాన్ని చేకూర్చింది. నాగార్జునుని కొండయందలి శిల్ప విధానం కూడ అట్టి ఉచ్చశ్రేణికి చెందినది.

గుంటూరు జిల్లా పల్నాడు తాలూకాలో కృష్ణానదికి దక్షిణ తీరాన ఈ నాగార్జునుని కొండ ఉన్నది. ఇచ్చట 1925 లో ప్రాచీన బ్రాహ్మీ శాసనములు గల కొన్ని స్తంభాలు కనబడినవి. తత్ఫలితముగ సాగించిన అన్వేషణలవలన ఇది ప్రాచీన బౌద్ధ క్షేత్రమని తెలియ వచ్చినది.

ప్రభుత్వపు పురాతత్వ శాఖవారు పరిశోధనలు సలిపి, భూగర్భంలో దాగి యున్న అనేక విగ్రహాలు, శిల్ప ఫలకాలు, శిలా శాసనాలు, శిల్ప చిత్రాలు బయటకు తీసినారు. అక్కడ ఒక మ్యూజియమును ఏర్పాటుచేసి, అందు

వీని నన్నిటిని పదిలపరచినారు. ఆంధ్రుల శిల్ప నైపుణ్యాన్ని ఎలుగెత్తి చాటే ఇట్టి కళా క్షేత్రానికి తగిన రాకపోకల ఏర్పాట్లు లేవు.

నాగార్జునుని కొండకు వెళ్ళవలయు నన్న మాచెర్ల మార్గం మీదుగా వెళ్ళవలసి ఉంటుంది. అది మాచెర్ల రైల్వే స్టేషనుకు 14 మైళ్ళ దూరంలో ఉన్నది. మాచెర్లకు తొమ్మిది మైళ్ళ దూరాన ఉన్న నాగులవరం గ్రామం వరకు రోడ్డు కలదు కానిచో, నాగార్జునుని కొండ వరకు బస్సులు పోవుటకు ఏ ఆటంకమును ఉండజాలదు.

ఆ మార్గాన బస్సులు నడుచుటకు ప్రభుత్వం తగిన అవకాశాన్ని కల్పించవలసి ఉంటుంది. ప్రస్తుతం నాగార్జునుని కొండకు ఈ పదహేను మైళ్ళ దూరం బండ్ల మీద వెళ్ళవలసి వస్తున్నది. విశేష వ్యయ ప్రయాసలకు లోనై, తుదకు అక్కడకు వెళ్ళినను, అచ్చట ఉండుటకు సరియైన వసతులు గాని, రహదారీ బంగళా కాని లేవు.

కావున ప్రభుత్వం వెంటనే తగు శ్రద్ధ వహించి ప్రయాణీకులు సుకరంగా ఆ స్థలాన్ని చేరుకొనుటకును, విశ్రాంతిగా అచ్చట కొద్ది రోజులు గడుపుటకును వలయు ఏర్పాటులు సత్వరమే చేయవలెను. చారిత్రక పరిశోధకులు, శిల్ప శాస్త్ర ప్రావీణ్యులు మొదలుగా గల వారు ఎందరో మంది అక్కడకు వెళ్ళి తమ తమ పరిశోధనలు సాగించుటకు అనుకూలాలను వెంటనే చేయవలెను.

పురాతత్వ శాఖవారి సిబ్బంది అక్కడ కొంతవరకు ఉన్ననూ, ఏ తత్సంబంధమైన గ్రంథాలయం కాని, సూచీ గ్రంథాలు కాని లేవు. కావున, ప్రభుత్వం శ్రద్ధవహించి, ఈ కళాక్షేత్రాన్ని సందర్శించ నభిలషించువారికి వలయు సౌకర్యాలను కల్పింపవలెను

---

సుప్రసిద్ధ సినిమా తార టి. ఆర్. రజని
తన విశాలమైన కురుల సౌందర్యానికి
కారణం
ప్రెసిడెంట్ వెజిటబుల్
హేరాయిల్ అని చెప్పుచున్నది.



# డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్

శ్రీ రాంపల్లి నరసింహ శర్మ, బి. ఏ.

భారతదేశ హృదయమును పాశ్చాత్యులకు వ్యక్తపరచిన విజ్ఞాన రాయబారులలో స్వామి వివేకానంద, రవీంద్రనాథ టాగూరు గార్ల పిమ్మట డాక్టర్ రాధాకృష్ణ గారినే పేర్కొనవలయును. ఐతే వారివాలె ఆధ్యాత్మిక వైజ్ఞానిక రాయబారిగనే గాక ప్రభుత్వ రాజకీయ రాయబారిగాకూడా భారతావనిని సేవించు గౌరవ మీయనకు లభించినది. అంతేగాక ఐక్యరాజ్య విజ్ఞానమండలి అగ్రాసనాధిపత్యము, స్వతంత్ర భారతావని ఆవశ్యకముల కనుగుణ్యముగ విద్యావిధానము సంస్కరించుటకు నియామకమైన సంఘముయొక్క అధ్యక్ష పీఠము యీయనకు లభించుటవలన ఆంధ్ర జాతి గౌరవింపబడి, సంతోష పులకితమైనది.

డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ ఒక సాధారణ మధ్యతరగతి కుటుంబమునందు తిరుత్తణిలో 1888 వ సంవత్సరమున సెప్టెంబరు 5 వ తేదీని జన్మించెను. విద్యాభ్యాసము మొదట రుత్తణిలోను, పిదప హిందువుల పుణ్యక్షేత్రములలో నగ్రశ్రేణికి చెందిన తిరుపతిలోను, ఆపిదప చెన్నపురి క్రైస్తవ కళాశాలలోను జరిగినది. మదరాసు విశ్వవిద్యాలయమువారి ఎం. ఎ. పట్టము గైకొన్న పిదప సర్కారు విద్యాశాఖలో చేరెను. ఇంతలో మైసూరు విశ్వవిద్యాలయము స్థాపింపబడినది. ఆ నూతనసంస్థకు యీయన సేవలు తాత్కాలికముగ బదులొనంగబడెను. మరి కొంతకాలమునకు కలకత్తా విశ్వవిద్యాలయమున తత్వశాస్త్రాచార్య పదవి ఖాళీ అయ్యెను. భారతదేశ ఉన్నతవిద్య చరిత్రలో నూతన శకము నారంభించినవాడును, రామన్ మున్నగు అనేకమంది దాక్షిణాత్య ప్రతిభాశాలురను ప్రోత్సహించినవాడును అగు సర్ ఆశుతోష్ ముఖర్జీ, సర్ బ్రజేంద్రనాథసీలు స్థాన మాక్రమింప గల ప్రజ్ఞాశాలి యితడే యని గుర్తించి కలకత్తా విశ్వవిద్యాలయమున కింగ్ జార్జి ది ఫిఫ్త్ అధ్యాపకునిగా నియమించెను. 1921 లో ఈ నూతన పదవి నాక్రమించుటకు ఉత్తరదేశము వెడలిన పిదప యీయన ప్రతిభ లోకమునకు మరింత వెల్లడైనది. మరి అయిదు సంవత్సరములకు కలకత్తా విశ్వవిద్యాలయమువారి ప్రతినిధిగా నీయన 1926 లో కేంబ్రిడ్జిలో జరిగిన సామ్రాజ్య విశ్వవిద్యాలయ సమ్మేళనమున కేగినాడు. ఇంతవరకును కేవలము గ్రంథముల ద్వారానే ఈ ప్రజ్ఞాశాలి ప్రతిభను తెలుసుకొనజాలిన పాశ్చాత్య లోకము ప్రత్యక్షముగ నీతని ఘనతను తెలుసుకొని అనేకవిధముల సన్మానించు నవకాశము గల్గినది. అట్టి సన్మానములలో ప్రథమము ఆక్స్‌ఫర్డ్ విశ్వవిద్యాలయమునందలి మాంచెష్టరు కళాశాలయందు "అప్‌టాన్" ప్రసంగములు గావిం

చుట కాహ్వానింపబడుట. అట్టి గౌరవము నొందిన ప్రథమ భారతీయు డీతడే.

ఆపిమ్మట కొంత కాలమునకు ఆయన హిబ్బర్టు ఉపన్యాసముల నొసంగుటకు ఆంగ్ల దేశమున కేగెను. ఈ గౌరవము భారతీయునకు లభించుటకును యిదియే ప్రథమ పర్యాయము. ఆ ప్రసంగములే తర్వాత "An Idealist View of Life" అను పేరిట గ్రంథరూపమున వెలువడినవి. అప్పుడు ఆంగ్లదేశమున యున్న రైటానరబిల్ వి. యస్. శ్రీనివాసశాస్త్రిగారు భారతదేశము నందలి ఒక మిత్రునకు లేఖ వ్రాయుచు, "ఆచార్య రాధాకృష్ణన్‌గారు ప్రశంసనీయముగ తమ కార్యక్రమము నిర్వహించుచున్నారు. మనము వారిని చూచి గర్వపడవలసియున్నది" —అని వాకొనిరి.

ఆంగ్ల విజ్ఞాన సర్వస్వ సంపాదకవర్గము వారి ఆహ్వానముపై ఆ గ్రంథరాజమునకు భారతీయ తత్వశాస్త్రముపై నొక అధ్యాయ మును రచించిరి.

1936 వ సంవత్సరమున ఆక్స్‌ఫర్డ్ విశ్వ విద్యాలయము వారీ పండితుని Spalding Professor of Eastern Religions and Ethics అను ఉన్నత పదవి కాహ్వానించిరి. ఆసియాఖండవాసి కిట్టి గౌరవ మొసంగబడుట కిదియే ప్రథమ పర్యాయము. 1938 లో నీయనకు బ్రిటిష్ అకాడమీ యను ఉన్నత శ్రేణి విజ్ఞాన సంస్థలో సభ్యత్వ మొసంగబడుటయే గాక, ఆ సంస్థకు వార్షిక ప్రసంగము గావింప నాహ్వానము లభించినది. రాధాకృష్ణ పండితు లా సందర్భమున గౌతమ బుద్ధునిగూర్చి ప్రసంగించిరి.

1940 వ సంవత్సరమున ఆక్స్‌ఫర్డ్ విశ్వ విద్యాలయము టాగూరు మహాకవికి డాక్టర్ బిరుద మొసంగుటకు శాంతినికేతనము పంపిన ప్రతినిధివర్గమున రాధాకృష్ణన్ ఒకరు. 1945 లో చైనా ప్రభుత్వమువారి ఆహ్వానముపై అనేక విద్యాలయములందు ప్రసంగించి యీ రెండు దేశముల మధ్య సుహృద్భావము పెంపొందించుటకు తోడ్పడిరి.

అమెరికా ఖండమునను యీయన ఖ్యాతి వ్యాపించినది. ఒక అమెరికన్ తత్వవేత్త యీయన మీద తనకు గల గౌరవము ప్రకటించుటకై ఒక తత్వశాస్త్ర మహాసభలో తన అధ్యక్షోపన్యాసమునకు "Radha-Krishnan as a Representative Idealist" అను శీర్షికను గైకొనెను. ఆయన 1946 లో అమెరికాలో గావించిన పర్యటనమును గూర్చి యిల్లీస్‌వాట్‌మల్ యిట్లు నుడివినది: "ఇటీవలి అమెరికన్ సతి దేశపు పర్యటనమున రాధాకృష్ణ పండితుడు సుహృద్భావాభిలాషియగు రాయబారియై భారత దేశపు ఆధ్యాత్మిక సంపదయొక్క ఉన్న తాశయము లిచటికి కొనితెచ్చి అమెరికన్ ప్రజల ఆమోదమునకై వానిని తన అమృతోపమానములగు వాక్కు లనురత్నకంబళిపై ప్రవర్శించిరి." కొన్నిచోట్ల ఆయన ఉపన్యాసముల నేర్పాటుచేసిన సభానిర్వాహకులు తాము సభకు రానున్న ప్రేక్షకుల సంఖ్యను గూర్చి తప్పు అంచనా వేయుటవలన సభా మందిరము చాలకపోయెనని విచారించిరి.

జోడ్, వెల్సు, లిం యు టాంగ్ మున్నగు ప్రముఖ విజ్ఞానవేత్తల కీయన ఎడగల గౌరవ ప్రపత్తు లపారమైనవి. డాక్టర్ లిం యు

టాంగ్ భారతదేశము వచ్చినపు డీయనను కలుసుకొని సంభాషించెను. ఆపిదప అమెరికా ఖండమున తన్ను కలుసుకొన్న ఒక భారతీయా ధ్యాపకునితో "ఆచార్య రాధాకృష్ణగారు భారత దేశమునందెల్ల మేటి మేధావియని నా భావము. మే మిరువురము అనేక విషయములు చర్చించితిమి. వారు వాక్కొనినవాటితోనెల్ల నే నేకీభవించితిని. శక్తియుతమైన ఆయన మేధాశక్తి వినిర్మలమును, స్వతంత్రశక్తి గలదియునై నన్నాకర్షించినది." అని పలికెను.

సి. ఇ. యం. 'జోద్' Counter attack from the east అను గ్రంథరాజమున రాధాకృష్ణపండితుని తత్వశాస్త్ర ప్రబోధమును మిగుల సానుభూతితోను, గౌరవముతోను చర్చించి ఆయనను "The Liason Officer between the East and West" అని వర్ణించినాడు. రాధాకృష్ణగారు ప్రాక్పశ్చిమ దేశములందలి తత్వశాస్త్రములందలి ఉత్తమగుణముల కలయికవలన ఉద్భవించెడు ఆదర్శప్రాయమైన తత్వశాస్త్రమే ప్రపంచముయొక్క భక్తికి, ఆదరణకు పాత్రమై నూతన ప్రపంచ నిర్మాణమునకు దారిచూపునని హెచ్చరించి నందులకు మిగుల అభినందించినాడు.

తూర్పు పశ్చిమదేశములమధ్య సంధాన కర్తగనేగాక మరి వేరువిధములగూడ యీ విజ్ఞానవేత్త అంతర్జాతీయ సుహృద్భావము పెంపొందించుటకు తోడ్పడినాడు. నానాజాతిసమితి విజ్ఞానముద్వారా ప్రపంచశాంతి నెలకొల్పుటకు ఏర్పరచిన Committee of Intellectual Co-operation వందీయన బహుకాలము సభ్యుడు. ద్వితీయ ప్రపంచ సంగ్రామానంతర మదే ఆశయములు నెరవేర్చుట కేర్పరుపబడిన UNESCO అను సంస్థయొక్క కార్యనిర్వాహకవర్గమునకు మొదట ఉపాధ్యక్షుడుగనుండి తదాశయములు నెరవేరుటకు ప్రశంసనీయమగు కృషి సల్పినాడు. ఇటీవల ఆ సంస్థయొక్క అధ్యక్షపదవి యీయనను వరించినది. 1946 లో పారిస్ పట్టణమున జరిగిన ఆ సమితి ప్రారంభ సమావేశములో భారతీయప్రతినిధివర్గ నాయకుడుగ నీయన పల్కిన పలుకులకు సభ్యులెల్లరు ముగ్ధులైరి.

"మన పెదవులనుండి అసత్యము మాటేదియు రానీయరాదు. మన మనోవీథిలోనికి యే చెడ్డభావమును ప్రవేశింపనీయరాదు. ఈ సంస్థకుచెందిన మనము రాజకీయముల కతీతులమై విశ్వజనీన భావములను బలపరచుటకు కృషిచేయవలయునని నా అభిలాష" అని సభాసదులను ఆయన హెచ్చరించాడు.

అంతేగాక గత ప్రపంచ సంగ్రామ కాలమున జరిగిన మారణహోమము చూచి షా, వెల్సు, రోలాండ్, టాగూర్ మున్నగు ఇతర విజ్ఞానవేత్తలతోపాటు చింతాక్రాంతుడైన రాధాకృష్ణన్ ఆవేదనతో నీ సంగ్రామానంతరమైనను మానవజాతి గుణపాఠము నేర్చుకొని ప్రపంచము తిరిగి సంగ్రామాగ్నిలోపడి దగ్ధము కాకుండ చర్యలు గైకొనవలయుననియు— ఏదో ఒక నానాజాతి సమితివంటి సంస్థను స్థాపించి తృప్తిపడిన ప్రయోజన ముండదనియు పదేపదే హెచ్చరించినాడు.

## జాతీయ స్వాతంత్ర్యాభిలాష

డాక్టర్ రాధాకృష్ణన్ అనేకమంది యితర విజ్ఞానవేత్తలవలె ఎన్నడును "నన్ను ముట్టు

కోకు నామాలకాకి" యను దృక్పథమును స్వాతంత్ర్య సంగ్రామముయెడ నవలంబించిన వాడుగాదు. భారతదేశమందలి రాజకీయ ప్రతిష్టంభన మంతమొందించుటకు సర్ తేజ్ బహదుర్ సప్రూ యేర్పరచిన పక్షాతీతులగు రాజకీయవేత్తల సమావేశమునం దాయన పాల్గొనినాడు. నేడు ప్రజాపరిషత్తు ఎన్నిక సభ్యులం దొకడు. ప్రజాపరిషత్తువారి ఆశయముల ననుసరించి సర్ బిరుదమును పరిత్యజించినాడు.

నిర్బంధ విధానమునకు తీవ్ర వ్యతిరేకి యగు యీయన 1931 లో ప్రభుత్వ నిర్బంధ విధానమును ఖండించుచు హింసాత్మకచర్యలు ఉద్యమము నెట్లు ముందుకు గొంపోవజాలవో అట్లే నిర్బంధచర్యలును దాని నణచజాలవు అని ప్రకటించినాడు. 1942 వ సంవత్సరము ఆగష్టు ఉద్యమ సందర్భమున చర్చిల్ పార్లమెంటులో నొక ప్రకటనచేయుచు యిదివర కెన్నడు లేనంత శ్వేతజాతిసైన్యములు భారతదేశములో నుండుటచే భారతదేశ పరిస్థితులను గూర్చి సభ్యులు ఆందోళనపడ నవసరములేదని చెప్పెను. భారతీయుల ఆగ్రహమును ప్రజ్వలింపచేసి వారిహృదయములను క్రోధముతోను, చిరాకుతోను నింపగల యిట్టి ప్రకటనలు దేశశాంతికి సహకారులు గాజాలవని చెప్పుచు రాధాకృష్ణ పండితుడు పై ప్రకటనను తీవ్రముగ ఖండించినాడు. దేశ స్వాతంత్ర్యము వలెనే దేశైక్యతను గూడ అభిలషించు నీతడు పాకిస్తాన్ ఉద్యమమును, స్వాతంత్ర్య ప్రదానానంతరము తమకును స్వతంత్ర రాజ్యములు కాగల హక్కుగలదని కొన్ని సంస్థానములు చేసిన ప్రకటనలను తీవ్రముగా ఖండించుచు ప్రచారము గావించినాడు.

డాక్టర్ రాధాకృష్ణన్ కాంగ్రెస్ ఆదర్శములయెడ ఎంతటి సానుభూతి కల్గియున్నను, కాంగ్రెస్‌నాయకుల యెడ ఎంతటి గౌరవమున్నను వారికి సలహా నొసగుటకుగాని, అవసర మగుచో వారియందలి లోపముల నెత్తిచూపుటకుగాని సందేహించలేదు. 1947 ఆగస్టు 15 వ తేదీని స్వాతంత్ర్యోదయ సమయమున ఆయన చేసిన గంభీరోపన్యాసమున—స్వాతంత్ర్యము కేవలము గమ్యస్థానమునకు మార్గము మాత్రమేననియు మనకు నూతనముగ లభించిన అవకాశములను, మన జాతిప్రతిష్ఠను దిగనార్చిన చీకటిబజారు, లంచగొండితనము మున్నగు దురాచారములను నశింపజేయుటకు ఉపయోగించుకొనవలయుననియు హెచ్చరించినాడు. తదుపరి మదరాసులో గావించిన ఒక ప్రసంగములో "నేడు ప్రజాస్వామ్య ప్రభుత్వములు నడపుచున్నవారు తమ ఎన్నికల ప్రణాళికలలో సామాన్యపౌరుని వాంఛలను గూర్చి ఎంత అనురాగమును చూపినను అధికారములోనికి వచ్చినపిదప వానిని నెరవేర్పజాలక పోయిరి" అని నిష్కర్షగ తన అభిప్రాయమును ప్రకటించినాడు.

మన జాతిలోని లోపములు నివారించుటకు మార్గము ప్రజాస్వామ్యము యొక్కయు, సామ్యవాదము యొక్కయు సమ్మేళనమే యని సూచించినాడు. ఏలనన "వ్యక్తి అణచివైచే సమిష్టిత్వం పెంపొందడంవల్లా లాభం లేదు, కోట్లకొలది జనుల్ని ఆకలి జ్వాలలకు ఆహుతి చేసే ప్రజాస్వామికము వల్లా ఉపయోగముండదు."

## భారతి విజ్ఞానపు రాయబారి

భారతదేశపు ప్రాచీన విజ్ఞానపు రాయబారిగ నీయన చేసిన సేవయే ఈయన యొక్క

సర్వతోముఖ ప్రతిభలో ప్రధానాంశముగ పరిగణింపబడుచున్నది. కావుననే 1946 లో జరిగిన అఖిల భారత తత్వ శాస్త్ర మహాసభ కధ్యక్షత వహించుచు సర్ సి. పి. రామస్వామయ్యర్ రాధాకృష్ణ పండితుని "An Ambassador of Hindu culture whose merits in vindicating India's cultural status in the world are immense, whose qualities of mental apostilite are unique in our time" అని వర్ణించియున్నారు. ఆయన పశ్చిమదేశములలో ప్రాచీన భారత విజ్ఞానమును గూర్చి చేసిన ప్రసంగములలో నొకదానిని విని ఒక వృద్ధాంగన మనము మన మిషనరీలను భారత దేశమునకు పంప నక్కరలేదు అనెనట: హిందూ మతమునకు యిట్టి మహోన్నత సేవ చేసిన వారిలో వివేకానందుని తర్వాత నీయననే పేర్కొనవలసియుండును. దాదాపు ఒక సంవత్సరము క్రిందట యీయన చెన్నపురి నేషనల్ బాలికోన్నత పాఠశాలలో హిందూ మతమును గూర్చి గావించిన ప్రసంగము సంగ్రహముగను—కాని ఉజ్వలముగను—హిందూమతముయొక్క ఉత్తమ లక్షణములన్నిటిని పేర్కొను పసిడి తునకయై యున్నది.

## పురోగమన దృష్టి

డాక్టర్ రాధాకృష్ణన్ హిందూమతము యొక్క ధారావాహికమగు చరిత్రమును, అందలి సహనభావమును సమన్వయ దృష్టిని ఎంత ప్రశంశించినను అందలి లోపములను విస్మరించి యుండలేదు. కాలానుగుణ్యముగ మార్పులకు సమ్మతించిన సనాతనత్వమును కర్మసిద్ధాంతమువంటి యధార్థముగ మన అభ్యుదయమునకు తోడ్పడగల సిద్ధాంతములను పిరికితనము, సోమరితనమును మాత్రమే పెంపొందించుటకుపయోగపడుటను రినైజన్సు వంటి పెద్ద పేర్లతో ప్రాచీన విజ్ఞానమును యధాతథముగా పునరుజ్జీవము గావించుకొనవలెనని కోరు మన స్తత్వమును తీవ్రముగ విరసించినాడు. Religion and Ethics, Indian Philosophy, Kalki మున్నగు గ్రంథములు చదివిన వారు ఆయన పురోగమన దృష్టిని గుర్తింపక పోరు. 1933 లో కలకత్తాయందు జరిగిన అఖిలభారత మహిళాసభయం దాయన గావించిన ప్రసంగము స్త్రీ మండలికి చక్కని సందేశ మొసగుచున్నది. ప్రాక్పశ్చిమ విజ్ఞానములును, ప్రజాస్వామ్య సామ్యవాదములు సమ్మిశ్రితము కావలయునని ఆత డభిలషించునట్లే పాత, క్రొత్తల మేలు కలయికను ఆయన వాంఛించును. "Indian Philosophy" అను గ్రంథములోని ఈ క్రింది వాక్యములు ఆయన పురోగమన దృష్టికి చక్కని నిదర్శనములుగ నున్నవి:

"ఇప్పటివారికంటె తక్కువ పాండిత్య ప్రకర్ష కల్గియున్నను యెక్కువ తేజోశాలురైన ప్రాచీన హిందూ మత నాయకులు యీ భూమిమీద తిరిగి అవతరించిన యెడల తమ ఉపదేశములను తూ. చా. తప్పక అనుసరింపని వారిని తమయొక్క యధార్థ శిష్యవర్గముగ పరిగణింపరు....మన ప్రాచీన విజ్ఞానులు కోరినది మనము నూతన సృష్టి కారకులము కావలయునని కాని కేవలము అనుకరించు

వారలము కావలయునని కాదు. వారు వారి కాలములో గావించిన కృషిని మనము తిరిగి చేయనక్కరలేదు. మనము తెరువబడిన కండ్లతో మన సమస్యలు యేవో తెలుసుకొని వానిని పరిష్కరించుటకు ప్రాచీన విజ్ఞానము నుండి ఉత్తేజము స్వీకరింపవలయును."

## ప్రముఖ విద్యావేత్త

విద్యారంగమునం దాయన చేసిన సేవయు గణనీయమైనది. ప్రభుత్వోద్యోగిగా నాయన I. E. S. అని పిలువబడు ప్రభుత్వ ఉన్నత విద్యాశాఖకు చెందినవాడు. భారత దేశమునందలి పలు విశ్వవిద్యాలయము లతో సంబంధము కల్గియుండుటయే గాక కాశీ, ఆంధ్ర విశ్వవిద్యాలయముల అభ్యుదయమునకు ప్రధాన కారకులలో నొకడు. వివిధ విశ్వవిద్యాలయములం దాయన గావించిన స్నాతకోపన్యాసములే విద్యావిషయములలో నీ విజ్ఞానవేత్తకుగల ఉదాత్త భావములను వెల్లడించగలవు. వేవెల్ రాజప్రతినిధిగా నున్న కాలమున ఆర్థికసమస్యలు సాంఘిక సమస్యలకన్న ప్రధానమైనవి అను వైఖరి నవలంబించిన భారత ప్రభుత్వ రాజనీతి యీయన తీవ్రవిమర్శకు పాత్రమైనది.

డాక్టర్ రాధాకృష్ణన్ మూడుతడవలు అఖిలభారత విద్యాసభ కధ్యక్షత వహించెను. ఆఖరితడవ అనగా 1947 లో జబల్పూరులో జరిగిన మహాసభయం దీయన గావించిన అధ్యక్షోపన్యాసము పెక్కు అమూల్య సూచనలతో నిండియున్నది. అం దీతడు తొందరపడి ఆంగ్లభాషను విసర్జించరాదని హెచ్చరించినాడు. ముఖ్యముగా కాశీ విశ్వవిద్యాలయమువంటి అఖిలభారత ప్రాముఖ్యత గల సంస్థలలో మరికొంతకాలము ఆంగ్లభాష యందే విద్యాభ్యాసము గావించుట ఉచితమని సూచించినాడు. మనము విద్యాభివృద్ధి చేయవలయునను తొందరలో కేవలము పరిమాణమును మాత్రమే దృష్టిలోనుంచుకొని చౌకబారు విద్యను మన యువకుల కొసంగుటవలని అనర్థములు పేర్కొనినాడు. ప్రముఖ పాశ్చాత్యనిపుణుల నీదేశము రావించి వారి తోడ్పాటుతో ఉన్నతవిద్యను, పరిశోధనను పెంపొందించు సంస్థలు నెలకొల్పవలయునని వక్కాణించినాడు.

విద్యారంగములో రాధాకృష్ణ పండితుని ప్రతిభనుగూర్చి వ్రాయునపుడు పేర్కొనవలసిన విశేషమొకటి యున్నది. ఆయన హ్యూమానిటీ అని పిల్వబడు విజ్ఞానవర్గమునకు చెందినవాడయ్యు శాస్త్రవిషయములపై విశేష ఆదరణ కలవాడు. ఆయన కలకత్తా విశ్వవిద్యాలయాచార్యుడుగ నుండగ (King George v Professor of Mental and Moral Sciences) ఒక ప్రఖ్యాత శాస్త్రవేత్తను యిన్‌స్టన్‌యొక్క శాస్త్ర పరిశోధనలగురించి తన యొక్క తత్వశాస్త్ర విద్యార్థులకు బోధించుట కాహ్వానించెనట. ఒకసారి డాక్టర్ రాధాకృష్ణన్ "విజ్ఞానప్రశస్తి "అర్ట్సు" అనబడు శాస్త్రేతర విద్యాశాఖలవలెగాదు. ఒకశాఖ యొక్క విజ్ఞానప్రశస్తి అది బోధింపబడినవిధానముపై నాధారపడియుండును. ఎడ్డింగ్టన్ జీన్సు మున్నగువారి యిటీవలి రచనలు మానసిక వినమ్ర పూరితములై యున్నవి. యధార్థ విజ్ఞానము పొందవలయునను కుతూహలము, మానసిక సత్యసంధత మున్నగు విజ్ఞాన

పరమావధు లనదగు విషయములకు శాస్త్రవతన దోహదమొసగుచున్నది అని" హెచ్చరించియుండెను.

ఈయనను విశ్వవిద్యాలయ విచారణ సంఘపు అధ్యక్షునిగ నియమించిన భారత ప్రభుత్వము వా రభివందనీయులు. ఇటీవల విద్యార్థి లీ సంఘమువారిని కలుసుకొన్నపుడు పేద విద్యార్థులకుగూడ విద్యా సౌకర్యము లుండవలెనని సూచించిన అభిప్రాయమునెడ అధ్యక్షులు తమ సానుభూతిని ప్రకటించిరి. కులములవారీగా కళాశాలలలో ప్రవేశమొసగుట అను విషయముపై యీ సంఘమువారి సూచనలకు భారతప్రభుత్వ మెదురుచూచుచున్నట్లు భారతప్రభుత్వ కార్యదర్శి ప్రకటించిరి. వివిధ ఉన్నత విద్యా సమస్యలపై యీ సంఘమువారి నుండి ఆదర్శప్రాయమైన నివేదిక వెలువడునని విద్యాభిమానులు ఆశించుచున్నారన్న అతిశయోక్తి లేదు.

## లలిత కళాభిరుచి

తత్వశాస్త్రమునను, విద్యా విషయముల లోనే గాక లలిత కళలందు గూడ రాధాకృష్ణ పండితుని అభిరుచి అపారమైనది. ఇటీవల అమెరికా ఖండమున పర్యటించుచు లాసేంజిల్సు పట్టణమునకేగి "సింద్‌బాద్ ది సైలర్", "మెక్సికన్ హనీమూన్" మున్నగు చిత్రములు తీయబడుట గమనించి, డగ్లస్ ఫెయిర్‌బాంక్సు మున్నగు నటులతో సంభాషించెనని వాట్‌మల్ సతి ప్రకటించినది. ప్రత్యేకముగ గానకళలో నితనికి గల అభిలాషను పేర్కొనుటకు ఆయన కావించిన రెండు ప్రసంగములను పేర్కొన్న చాలును. అందు మొదటిది 1931 సెప్టెంబరులో విశాఖపట్నమున శ్రీ ద్వారం వెంకటస్వామి నాయుడుగారికి జరిగిన సన్మాన సభ కధ్యక్షత వహించుచు గావించిన ప్రసంగము. ఆ సభలో గానకళకు ప్రభుత్వము సరియైన సత్కారము చేయకుండుటను నిరసించుచు "యూరపు ఖండములో ప్రభుత్వమే సంగీత కచ్చేరీలను ఏర్పరచుచుండును. 1926 వ సం॥లో ఫ్రెంచి ప్రభుత్వపు అతిథిగా పారిస్ ఒక అపరా ప్రదర్శనమున కేగిన సందర్భమున నాకు ప్రభుత్వమున కచ్చట గల గానకళాభిరుచి స్పష్టమైనది. ఈ దేశమున గానకళాకోవిదులు సరియగు ఆదరణము లేక అల్లాడుచుండుట మనకు కాననగును." సంగీత పరిషత్తు సమావేశమును 1944 లో ప్రారంభించుచు గావించిన గంభీర ప్రసంగమును అమూల్యమైనది.

సాహిత్య రంగమున నేడు నిర్దుష్టమైన ఆంగ్ల వచన రచన చేయగల భారతీయ ప్రముఖులం దీయన యొకడు. ఈయన ప్రప్రథమమున వ్రాసిన గ్రంథములలో టాగూరు మహాకవి తత్వ సందేశమును గూర్చిన దొకటి. ఆ గ్రంథమును విశ్వకవియే ప్రశంసించెనట. టాగూరు మహాకవి హృదయమును గ్రహించిన ప్రముఖులం దీయన యొకడు కావుననే టాగూరు మహాకవి డెబ్బదవ జన్మదినోత్సవము కలకత్తాలో జరుపబడినపుడు ఈయనను అగ్రాసనాధిపతిగ నియమించిరి. రాధాకృష్ణ పండితులు ఉపాధ్యక్షులుగనున్న కాలముననే విశ్వకవి ఆంధ్ర విశ్వకళాపరిషత్తునకరుదెంచి ఉపన్యాసముల నొసంగిరి. 1940 లో టాగూరు మహాకవికి ఆక్స్‌ఫర్డ్ విశ్వవిద్యాలయమువారు డాక్టర్ బిరుదము నొసంగు

టకు శాంతినికేతనమునకు పంపిన దళములో రాధాకృష్ణన్‌గారొకరని యిదివరకే పేర్కొన బడినది. అట్లే గాంధిమహాత్ముని డెబ్బదవ జన్మదినోత్సవ సందర్భమున నీయన ప్రపంచ ప్రముఖులొసంగిన ప్రశంసలను సంపుటీక రించి ప్రకటించిన గ్రంథరాజము కూడ ఎల్లర మన్ననకు పాత్రమైనది. ఈయనకు P.E.N. అను సారస్వత సమితియొక్క భారత శాఖతోగల సంబంధమును సన్నిహిత మైనది. ఆ సంఘముయొక్క జైపూర్ సమా వేశమునందు "Moral Values in Literature" అను శీర్షికపై చేసిన ఉపన్యాసమును గూర్చి ప్రసిద్ధ రచయితలగు కె. యస్. వెంకటరమణిగారు "మాడరెన్ రెవ్యూ" పత్రికలో నిట్లు వ్రాసిరి:

"నాడు రాధాకృష్ణన్‌గారి ప్రసంగమే అత్యుత్తమమైనది. అది సాహిత్యమున నైతి కాదర్శములు అను చేతికి చిక్కని చిక్కు విషయము. కాని నేర్పరియగు జాలరివలె నాయన ఆధ్యాత్మికతత్వమను త్రాళ్ళతో చేయ బడిన వల పరచి దానిని బంధింపజాలినాడు. ఆయన వక్తృత్వ ప్రతిభ యింద్రజాలమే. అందు విషయము, శైలి ఒకదానితో నొకటి మనోహరముగ ఈడు జోడు అయినవి."

## వక్తృత్వ ప్రతిభ

వక్తగా రాధాకృష్ణ పండితుని ప్రతిభను గూర్చి ఆచార్య వెంకటరమణిగారు పేర్కొన్న దానికి ఒకటిరెండు విషయములు చేర్పనగును. రాజాజీ ప్రసంగములలోవలె తర్కముగాని, శ్రీమతి సరోజినీదేవి ప్రసంగములలోవలె హాస్యముగాని యీయన ఉపన్యాసములలో మనకు గానరావు. ఇందు 'ప్రబోధమే' అధికముగ నుండును. ఆయన కంఠధ్వని, శైలి అందుకు చక్కగా కుదిరి ఆ ప్రసంగ ములకొక చక్కని విశిష్టత కల్గించుచుండును. మధ్యమధ్య చక్కని సంస్కృత శ్లోకములను చిల్కరించుట మరొక ప్రత్యేకముగ పేర్కొన దగ్గ విశేషము. ఎంత క్లిష్టవిషయమునైన వేగముగను కాని విపులముగను వివరింపగల సామర్థ్యము, అమూల్య విషయములను సంగ్రహ వాక్యములలో (Epigrims) నిమడ్చగల నేర్పుగూడ యీయనకు వక్తగా గల ప్రతిభలో అంతర్భాగములు.

"ఈనాడు మనము దైనందిన కార్యక్రమ ములో మనువుయొక్క సహాయము వాంఛిస్తే మనువు యీ దేశములో పుట్టనియెడలనే ప్రయోజనకారిగా నుండేదని చెప్పవచ్చును."

"నేడు మనము జీవితార్పణము చేయుటకు సిద్ధపడునది ఉత్తమాదర్శములకొరకు గాదు; ఉన్నత వేతనముల కొరకు." ఇటువంటి వాక్యముగాని తొందరగ మనోవీధిని విడనాడ జాలవు.

వక్తృత్వ విషయము చైనాదేశపు తత్వ వేత్తయగు డాక్టర్ లిం యు టాంగు సభావేది కపై రక్తిగట్టడని చెప్పుదురు. కాని రాధాకృష్ణ పండితుడు గావించిన ప్రసంగములు ప్రపంచ ములో ప్రసిద్ధ ప్రసంగముల సంపుటి దేనిలో నైన స్థానము పొందగల అర్హతగలవై, వక్తృత్వ కళ నభ్యసించ గోరువారు కంఠ స్థము చేయదగినవై యున్నవి. 1947 ఆగ స్టులో స్వాతంత్ర్యోదయ సమయముననూ, 1946 లో కరాచీలో గాంధిమహాత్ముని విగ్ర హము నావిష్కరించుచును గావించిన ఉప న్యాసము లమూల్యములైనవి. 1948 లో

అమెరికాలో పర్యటించునపుడు కూల్రిడ్జి ఆడిటోరియంలో American University and Library Congress వారి యాజమాన్యమున గావించిన ఉపన్యాసమును రికార్డు చేసుకొని కాంగ్రెసువారు భద్రపర్చుకొనిరి. ఇట్టి ఉత్తమ ఉపన్యాసముల పట్టికను యెంత దూరమైనను పొడిగించ వచ్చును.

## ఆంధ్రోద్యమాభిమానము

డాక్టర్ రాధాకృష్ణన్ తమ స్వరాష్ట్రమైన తెనుగుసీమ ప్రత్యేక రాష్ట్రముకై చేసిన ప్రయత్నములలో కూడ పాల్గొనిరి. 1928 లో నంద్యాలలోను, 1938 లో చెన్నపురిలోను గావింపబడిన ఆంధ్రమహాసభా సమావేశముల కధ్యక్షులు. 1938 లో జరిగిన సమావేశములో ఉన్నత పదవులలోనికి రాకపూర్వము ఆంధ్ర రాష్ట్రమునకై పరితపించిన ఆంధ్రనాయకులు పదవులలోనికి రాగానే శ్రద్ధ వహింపనందులకు విచారము వెలిబుచ్చిరి. అప్పటి ప్రధానియగు రాజాజీ ఆంధ్రదేశమున పర్యటించుచుండ జరుపబడిన ప్రదర్శనములను ఖండించిరి. ఆ తర్వాత ఆంధ్రమహాసభాధ్యక్షులుగా అప్పటి ఇండియా కార్యదర్శియగు జట్లండు ప్రభువును కలుసుకొని ఆంధ్రరాష్ట్రావశ్యకతను గూర్చి అతనికి నచ్చచెప్పచూచిరి.

రాధాకృష్ణన్‌గారు ఒక ఉపన్యాసములో "మనము యేదేశపు నాగరికతనైనా ఎప్పుడూ సజీవమని పరిగణిస్తాము? ఎప్పుడూ అది సుచేతనమని పిలుస్తాము. దివ్యానుభవముల మూలమున ప్రాచీన విజ్ఞానమును పెంపొందించి అవసరమగుచో సంస్కరించి అభివృద్ధి పరుపగల దివ్యవ్యక్తుల్ని సృష్టింపగల్గినపుడే అది సజీవముగ పరిగణింపబడగలదు." అని నుడివియున్నారు. ఒకే తరములో తన కనక గర్భమున గాంధీ, టాగూర్, అరవిందుడు, రాధాకృష్ణన్ మున్నగు సుపుత్రులను కన్న భారత నాగరికత సజీవముగాదని ఎవరు చెప్ప గలరు? ఇట్టి మహనీయులు జన్మించిన భారతావనిలో నేపుట్టిన మనము

లేదురా యిటువంటి భూదేవి యెందు
లేరురా మనవంటి ధీరులింకెందు!

అని పాడుకోదానికి సందేహించ నక్కరలేదు.





రవి టాయలెట్సువారి

రవి గ్లిసరిన్ సోపు

అందమునకు, వర్ఛస్సునకు రవి గ్లిసరిన్ సబ్బు
అన్ని కాలములలోను వాడతగినది.
వ్యాపార వివరములకై వ్రాయవచ్చును.

డిస్ట్రిబ్యూటర్సు :-

**THE NEW STAR & CO.,**
(No 6, Bus Terminus), Tondiarpet, Madras.

# డాక్టర్ కథ

రచన :
ఇవాన్ టర్జెనీవ్

అనువాదం :
శ్రీ నిడమర్తి ఉమారాజేశ్వరరావు

ఒక్రకు రాలు కాలంలో ఒక మారుమూల కుగ్రామంనుండి తిరిగి వస్తూ జ్వరపడ్డాను. జ్వరానికి రొంపభారం, తల దిమ్ము కూడ తోడయ్యాయి. వైద్య సదుపాయం లేని యే పల్లెటూళ్ళోనో కాక జిల్లా పట్నం వచ్చాక జ్వరం రావటం కీడులో మేలుగా యెంచి, హోటల్లో బసచేసి జిల్లా డాక్టరుకు కబురు చేశాను. కబురంపిన అరగంటలో డాక్టరు వచ్చి పరీక్షచేసి మామూలు కార్పనేటివ్ మిక్స్చర్ తీసుకోమని, దానికి తోడు శాంతి గంధం పట్టు వేసుకోమన్నాడు. డాక్టర్ అంత పొడుగూ, పొట్టీకాకుండా రివటలా గున్నాడు. నల్లని ఆయన జుట్టు నిగనిగలాడుతూంది. అటుచూస్తూ పొడిదగ్గు దగ్గుతూ విజిటింగు ఫీజుగా నే నిచ్చిన ఐదు రూపాయల నోటును బహునేర్పుగా జేబులో భద్రపరచి లేచి వెళ్ళబోయి, యెందుకనో అంతటితోనే ఆగి, కబుర్లు ప్రారంభించాడు. జ్వరంతో నాకు బహు నీరసంగా వుంది. నిద్రవచ్చే సూచనలు కూడ యేమీ కనిపించడం లేదు. తులాసాగా కబుర్లుచెప్పే డాక్టరు దొరికాడు కదా అని సంతోషించాను. టీ తయారైంది. డాక్టరు యెరమరిక లేకుండా కబుర్లు ప్రారంభించాడు. ఆయన తెలివైనవాడు. ఆయన మాటల్లో హాస్యం తొంగిచూస్తూంటుంది. కబుర్లలో అందెవేసిన చెయ్యిలా కనిపించాడు. ప్రపంచం బహు చిత్రమైనది. అందులో అనేక చిత్ర విచిత్ర విషయాలు జరుగుతూ వుంటాయి. ఒక్కొక్క విషయానికి తలా తోకా వుండవు. ఒక్కొక్కళ్ళతో జీవితమంతా స్నేహంగా గడిపినా వాళ్ళతో నీ హృదయం విప్పి ఒక్కమారూ మాట్లాడవు. ఒక్కొక్కళ్ళ ముక్కూ ముఖమే యింకా తెలియకపోయినా వాళ్ళతో నీ హృదయపు లోతుల్లో నిక్షేపింపబడిన నిగూఢ విషయాలనుకూడ భగవత్సాన్నిధ్యంలో వలె ఏకరువు పెడతావు. ఎదటివాడి విషయం కూడ అంతే. అట్లాంటిదే నా కానాడు సంభవించింది. నేను డాక్టరు మనస్సు నెట్లా చూరగొన్నానో నాకే తెలియదు. ఏదేమైనప్పటికీ, ఆయన ఒక చిత్రమైన విషయాన్ని నా కానాడు చెప్పాడు. దయాంతరంగులు, కుతూహలపరులు అయిన పాఠక మహాశయులకు ఆ కథను నివేదిస్తున్నాను. స్వారస్యం చెడకుండేందుకుగాను డాక్టరు మాటల్లోనే ఆ కథ నిక్కడ పొందుపరుస్తున్నాను.

" మీకు పరిచయం లేదనుకుంటాను '' (ఘాటైన ముక్కుపొడి పీల్చడంవల్ల) బలహీనమై కంపిస్తూన్న స్వరంతో ఆయన ప్రారంభించాడు. "ఇక్కడ జడ్జి పావెల్ లుకిచ్ మిలోవ్‌ని మీ రెరుగుదురా ?.... ఎరగరూ ?.... సరే, సరే'' ఆయన గొంతు సవరించుకుని, కండ్లు నులుముకున్నాడు.

సరిగ్గా చెప్పాలంటే, యిప్పుడు నే చెప్పబోయే విషయం మంచుకరిగే రోజుల్లో లెంట్‌లో జరిగింది. ఆ రోజున—నే నిప్పుడు చెప్ప లేదూ, ఆ బడ్డిగా రింట్లో కూర్చుని పేకాడు తున్నాను. అకస్మాత్తుగా (ఈ అకస్మాత్తుగా అన్న పదాన్ని డాక్టరు తరచుగా వాడుతూం టాడు) "మీకోసం యెవరో మనిషి వచ్చాడు" అని చెప్పారు వాళ్ళు.

"ఎందుకు?" అన్నా న్నేను.

"వాడేదో చీటీ తెచ్చాడు—బహుశా యెవరైనా రోగి వద్దనుండి అయ్యుంటుంది" అన్నారు.

"ఏదీ, చీటీ ఇట్లా యివ్వండి'' అన్నాను. రోగి వద్దనుండే వచ్చిందది —శుభవార్తే! —తెలుసుగా—యిట్లాంటి చీటీలే మా క్షూడు గుడ్డలు పెట్టేది ....కాని, ఆ చీటీని ఒక విధ వామె రాసింది: "నా కూతురు చావు బ్రతుకుల మధ్య వుంది. బండి పంపాను. మీకు దేవుడు మేలు చేస్తాడు; దయవుంచి తప్పక రావల సింది''....ఆఁ అదీ అందులో వున్న సంగతి. బాగానే వుంది. కాస్తాకూస్తా కాదు, పట్నానికి ఆ ఊరు యిరవై మైళ్ళుంది. అవతల ప్రకృతి చూస్తేనా కాటుక పేరుకున్నట్లుగా వుంది. అర్ధరాత్రి. రోడ్డు పోనీ బాగున్నదా అంటే అదీలేదు. ఆవిడ చూస్తే బీదదానిలాగుంది. తీరా శ్రమ అనక అక్కడికి వెళ్ళినా యే రెండు రూపాయలకన్న యెక్కువ గిట్టుబా టవుతుందనే ఆశ లేదు. అదైనా సందేహమే. ఒకపూట పడక, సాదా భోజనంతో సరిపెట్ట వచ్చు. కాని అవతల ఒక తోటి ప్రాణి చని పోతూ వుండొచ్చు. అన్నింటికన్న ముఖ్యం నా విధి. నా విధి నేను నెరవేర్చాలిగా. నా పేక ముక్కలు పక్కవాడి కప్పగించి యింటికి చేరుకున్నాను. చూస్తేనికదా, గుమ్మంముందు పాత డొక్కు బండీ ఒకటి నిలబడిఉంది. దానికి ముందు దుండుల్లా బలిసిన గుర్రాలు నెమరువేస్తూ నిలబడి వున్నాయి. బండివాడు నా గౌరవార్థమై టోపీతీసి నిలబడియున్నాడు. "సరే, యింకేం బండారం కాస్తా బయట పడింది. ఈ రోగులెవరో గాని పెద్ద భాగ్య వంతులు కారురా అబ్బీ'' నాలో నే వను కున్నాను ...మీరు నవ్వవచ్చు; కాని నాలాంటి బీదవాడు ప్రతి చిన్న విషయాన్నీ చూసు కోవాలి మరి....బండివాడు టోపీ తియ్యకుండా పిల్లజమీందారులా దర్జాగా నిగడతన్ని కూర్చో డమేగాక, హేళనగా ముసిముసి నవ్వులు నవ్వుతూ కమిచీని ఝళ్ళుమనిపించాడంటే కనీసం ఆరు రూపాయలైనా ఘల్లుమన్నాయన్న మాటే. కాని యీ కేసు అల్లాంటిది కాదని ముందే తెలుస్తోంది.

"అయినా సరే, యేం చేస్తాం. ముందు విధి నిర్వర్తించక తప్పదుగా మరి.'' అదరా బాదరా అత్యవసరమైన సరుకులు సర్దుకుని బయల్దేరాను. ఎట్లాగో ప్రాణాలతో అక్కడికి చేరుకున్నానంటే నమ్మండి. మంచుతో, నీళ్ళ మడుగులతో రోడ్డు నరకప్రాయంగా వుంది. అవి చాలవన్నట్లు కాలవగట్టుకి గండిపడి యేళ్ళూపూళ్ళూ యేకమౌతున్నాయి. ఎట్లాగైతే నేం గమ్యస్థానం చేరుకున్నాను. అదొక చిన్న పూరికొంప. కిటికీలో దీపం మినుకు మినుకు మంటూ వెలగడాన్నిబట్టి వాళ్లు నా రాకకై యెదురుచూస్తున్నారన్న సంగతి గ్రహించాను. గుమ్మంలోనే యెదురువచ్చి ఒక ముసలియామె నన్ను లోనికి తోడ్కొనిపోయింది. "కుర్రది

చచ్చిపోతూంది. దాన్ని రక్షించి పుణ్యం కట్టుకోండి బాబూ!'' అందామె.

"మరేం ఫరవాలేదు. కంగారు పడకండి!— రోగి యెక్కడుంది?'' అని అడిగాను. "ఇటురండి" అందామె.

అదొక పరిశుభ్రమైన గది. మూలనొక దీపం వెలుగుతూంది. పక్కమీద ఒక యిరువదేండ్ల యువతి ఒళ్ళెరుగని స్థితిలో పడుకుని వుంది. ఆమె ఒళ్లు సలసల కాగిపోతోంది. ఊపిరి భారంగా వస్తోంది—జ్వరం అన్నమాట. ఆమె చెల్లెళ్లిద్దరూ గాబరాగా యేడుస్తూ పక్కనే కూర్చున్నారు.

"నిన్న మామూలుగానే తిరిగింది. తిండి కూడ బాగానే సయించింది. ఈ ప్రొద్దుటి కల్లా తల నాదుగా వుందంది. సాయంత్రం నుంచి యిట్లా మూసిన కన్ను తెరవకుండా పడివుంది.'' ఆ బాలికలెంతో ఆదుర్దాగా చెప్పారు.

"మరేం ఫరవాలేదు. కంగారు పడకండి'' అన్నాను. తెలుసుగా, ధైర్యం చెప్పటం డాక్టరు విధుల్లో మొదటిది. రోగిని పరీక్షించి, శొంఠి గంధం అరగతీసి తలకు పట్టు వెయ్యమని చెప్పి, లోపలికి వేరే మందు యిచ్చాను. ప్రథమ పర్యాయం అప్పుడే ఆమె వంక పరీక్షగా చూశాను! అంత అందమైన ముఖాన్ని మరెక్కడా చూడలేదు—ఒక్క మాటలో ఆమె అప్సరస అంటే సరిపోతుంది! ఆమె రూపు రేఖ లెంత సున్నితంగా, సుందరంగా వున్నాయి! మరి ఆ కండ్లను చూసి తామర రేకులను వేరే చూడవలసిన అవసరమే లేదంటే నమ్మండి!....ఏమైతేనే. పుండేవి దయవల్ల ఆమె కొద్దిగా తేరుకుంది! ఒళ్ళంతా చెమట పట్టింది. తెలివికూడ వచ్చింది. ఆమె ఒత్తిగిలి, నవ్వింది. ఆమె నవ్వులో పువ్వులు వికసించాయి. చేత్తో ముఖాన్ని తడుముకుంది....ఆమె చెల్లెళ్లు వంగి "ఎట్లాగుందక్కా?" అని అడిగారు. "బాగానే వుంది'' అని, ఆమె పక్కకు ఒత్తిగిలింది. ఆమె వంక చూద్దును కదా, గాఢంగా నిద్రిస్తోంది.

"రోగిని విశ్రాంతి తీసుకోనివ్వండి'' అన్నాను. నిశ్శబ్దంగా మునివ్రేళ్ళమీద మేమంతా బయటకు వచ్చేశాం. ఏమన్నా అవసరమైతే చూడటానికిగాను ఒక్క దాసీది మాత్రం గదిలో వుండిపోయింది. చావడిలో ఒక టేబిలు, దానిమీద ఒక సామోవరు, సారా సీసా ఒకటీ వున్నాయి. తెలుసుగా మా వృత్తిలో వున్నవారికి సారాలేకుండా రోజు గడవదు. టీ యిచ్చి, ఆ రాత్రికి నన్నక్కడే ఆగిపొమ్మని వాళ్ళు కోరారు.. నే నంగీకరించాను. ఒకవేళ వెళ్ళాలనుకున్నా అంత రాత్రివేళ యెక్కడికి వెళ్ళగలనులెండి? ముసలామె దుఃఖంతో మూలగ నారంభించింది. "ఏమిటది? మరేం ప్రమాదం లేదు. ఆమె బ్రతుకుతుంది. అప్పుడే రెండు గంటలైంది. మీరు కొంచెం విశ్రాంతి తీసుకోండి"అన్నాను.

"ఏమన్నా ప్రమాదం వస్తే నన్ను వెంటనే లేపుతారు కదూ?" అన్నదామె. "సరే" అని అంగీకరించాను. నాకు సావిట్లో పక్కవేసి ముసలామె, బాలికలు తమ తమ గదుల్లోకి వెళ్లిపోయారు. పక్కమీద శరీరాన్ని వాల్చాన్న మాటే గాని కంటిమీద రెప్ప వాలలేదు. ఇంత బడలిపోయినా నిద్ర రాదేమి చెప్మా

అని ఆశ్చర్యపోయాను! రోగి ముఖభంగిమలు నా మనస్సులో కొట్టు మిట్టాడ నారంభించాయి. మనస్సు నెంత మరల్చుకుందామన్నా లాభం లేకపోయింది. అకస్మాత్తుగా లేచాను. "రోగి కెట్లాగుందో చూసివద్దాం" అనుకున్నాను. ఆమె పడకగది నేను పడుకున్న చావడి పక్కనే వుంది. సరే, లేచి వెళ్ళి నెమ్మదిగా తలుపు తెరిచాను—అప్పుడు నా గుండె యెంత వేగంగా కొట్టుకుంది! లోపలికి తొంగి చూశాను. దాసీది నోరు తెరచుకొని నిద్ర పోతూంది. దరిద్రపు పీనుగు గుర్రుకూడా పెడుతోంది! రోగి ముఖం నావంకకే తిరిగి వుంది. ఆమె చేతులు పారజాపి వున్నాయి. పాపం, పిచ్చిపిల్ల! అడుగుల్లో అడుగులు వేసుకుంటూ ఆమెను సమీపించాను.... ... ఇంతలో అకస్మాత్తుగా ఆమె మేల్కొని నా వంక తేరిపారచూసింది! "ఎవరు? ఎవరది?" అన్నది. నేను కంగారుపడిపోయాను. "భయం లేదమ్మా" అన్నాను. "నేను డాక్టరుని. మీ వంట్లో యెట్లాగుందో చూద్దామని వచ్చాను."

"మీరు డాక్టరా?"

"అవునమ్మా. నేనే డాక్టరుని. మీ అమ్మ కబురంపితే పట్నంనుండి వచ్చాను. పరీక్షచేసి మందిచ్చాను. నిద్రపో అమ్మా భగవంతుని దయవల్ల రెండు మూడు రోజుల్లో నయమై పోతుంది. ఎప్పటిలాగ తిరుగుతావు" అన్నాను.

"ఆఁ ఆఁ డాక్టర్! నన్ను చనిపోనివ్వ కండి డాక్టర్!"

"ఎందుకమ్మా అట్లా అశుభాలు పలుకు తావు. దేవునిదయవల్ల తప్పక నయమవు తుంది!" ఆమెకు మళ్ళీ జ్వరం వచ్చిందను కుంటాను. చెయ్యితీసుకుని నాడి పరీక్షించాను. జ్వరం బాగా వచ్చింది. ఆమె నావంక చూసి నా చేతిలోకి తీసుకుంది. "ఎందుకు చనిపోరా దనుకుంటున్నానో మీకు చెప్తాను. ఇప్పుడు మనం ఒంటరిగాకూడ వున్నాం....ఎవరికీ— ఎవ్వరికీ చెప్పరాదు సుమా....వినండి...." నేను వంగాను. ఆమె యేదో చెప్పుకు పోతూంది. ఆమె పెదవులు నా చెవులను తాకుతున్నాయి. ఆమె శిరోజాలు నా ముఖాన్ని ముసురుకుంటున్నాయి. ఆమె రహస్యం విజా నికి నాకేమీ బోధపడనేలేదు—నిజానికి నా బుర్ర గిర్రున తిరిగిపోతూంది—ఆమెకు సంధించింది! ...ఆమె గుసగుసలాడుతూనే వుంది. అంతకంతకు తొందర తొందరగా మాట్లాడ నారంభించింది. అదేమన్నా విదేశ భాషేమో ననిపించింది. ఆఖరి కామె తన రహ స్యాన్ని ముగించేసి తలగడమీద తలను వాల్చే సింది. తన చూపుద్రేలును నావంక ఊపుతూ "జ్ఞాపకముంచుకోండి డాక్టర్, యెవ్వరికీ చెప్ప బోకండి" అంది. ఆమె నెట్లాగో శాంతపరచి, త్రాగడాని కేదో ఇంత యిచ్చి, దాసీదాన్ని లేపి పోయి పడుకున్నాను."

ఉద్రేకంగా పొదుం మళ్ళీ పీల్చి, దాని ప్రభావంచేతనా అన్నట్లు డాక్టరు కొంతసేపు విమూఢత్వంలో ఆగిపోయాడు.

"ఏమైనా" ఆయన తిరిగి ప్రారంభించాడు "నే నాశించినట్లుగా రోగికి మరునటిరోజుకు స్వస్థత కలుగలేదు. నేను దీర్ఘంగా ఆలో చించి, యితర రోగులు నాకోసం యెదురు చూస్తూ వుంటారని తెలిసినప్పటికీ ఆరోజుకు అక్కడే ఆగిపోవాలని అకస్మాత్తుగా నిశ్చ

చెలరేగుతాయో ఆ భగవంతుడికే యెరుక. ఇంతకాలం నీలో నీకున్న గాఢవిశ్వాసం విశ్ళపెట్టుగా నేలకూలిపోతుంది. నీలో పిరికితనం అకస్మాత్తుగా పుట్టి, పెరిగి, ఊడలు దింపుతుంది. నీ బుర్రలోవిదంతా యిగిరిపోయిందనీ, రోగికి నీపట్ల నమ్మకం నశించిపోయిందనీ ఊహించుకుంటావు. దాంతో నీలో దిగులు ప్రవేశిస్తుంది. ఇతరులా విషయాన్ని చూచాయగా గ్రహించి రోగలక్షణాలను అవిష్టంగా చెప్తారు. అంతేకాదు, నీవంక అపనమ్మకంగా చూస్తారు. చాటునా మాటునా గుసగుసలు ప్రారంభమవుతాయి ...అబ్బ, యెంత దారుణం! ఈ రోగానికసలు ఏదో సరైన మందంటూ ఒకటి వుండాలి కదా అనుకుంటావు. ఇదేమో, అదేమో అని తలపట్లు పడతావు. ఒక మందు వేసి చూస్తావు—అబ్బే అది కాదనుకుంటావు! ఆ మందు సరిగ్గా పట్టిచ్చేందుకు వ్యవధి నివ్వవు ....ఇదికా దది, అదికా దిది యని అనేక మందులు పోస్తావు. మధ్యమధ్య వైద్యగ్రంథాలు తిరగేస్తావు. ఆ( దొరికింది అనుకుంటావు! ఒక్కొక్కసారి భగవంతునిమీద భారం వేసి చేతికొచ్చిన మందు వేస్తావు. ఫలితాన్ని విధికి వదిలేస్తావు....ఈలోగా తోటి మానవుడొకడు చనిపోతూంటాడు. ఆ జీవిప్రాణాన్ని వేరొక డాక్టరు రక్షించేవాడేమో. "ఈ కేసు నొకసారి పరీక్షించాలండీ. బాధ్యతంతా నాపైనే వేసుకోవటం యిష్టంలేకుండా వుంది" అంటావు. అప్పుడు నీముఖంచూస్తే ప్రపంచంలోని మూర్ఖత్వమంతా నీ ముఖంలోనే తాండవిస్తూన్నట్లుంటుంది! సరే, యిదంతా కొన్నాళ్ళకి అలవాటైపోతుంది లెండి. ఏరోగి అయినా చనిపోతే శాస్త్రప్రకారం చికిత్స చేశాను. ఇంక నా లోటేమీ లేదనుకుంటావు. కొందరికి నీయందు గ్రుడ్డినమ్మక ముంటుంది. కానీ వారికి నువ్వేమీ సహాయం చెయ్యలేవు. అదే అన్నింటికన్న యెక్కువ బాధను కలిగించే విషయం. ఆలెగ్జాండ్రా ఆండ్రియేవ్నా కుటుంబం వారికి నాపట్ల సరిగ్గా యిల్లాంటి గ్రుడ్డినమ్మకమే వుంది. నన్నుచూసి వారి అమ్మాయి ప్రమాదావస్థలో వుందనే విషయమే వారు మరచిపోయారు. ఒకవంక వారికి నేను ధైర్యం నూరిపోస్తూనే వున్నాను. కాని వేరొక వంక నాకే ధైర్యం సడలిపోసాగింది. ఈ యిబ్బందులన్నింటికీ తోడు రోడ్లు మరింత పాడైపోయాయి. మందుకోసం పట్నం పంపిన మనిషి రోజులతరబడి తిరిగేవచ్చేవాడు కాదు. నేను క్షణమైనా విడువకుండా రోగి గదిలోనే వుండేవాడిని. ఆమెను విడచియుండలేకపోయేవాడిని. కులాసాగా ఆమెకు కథలు చెప్పేవాడిని. కాలక్షేపానికిగాను ఆమెతో చీట్లపేక ఆడేవాడిని. రాత్రిళ్లుకూడ ఆమె మంచంవద్దనే జాగారం చేసేవాడిని. ఇవన్నీచూసి ఆమె ముసలితల్లి కన్నీటితో నాకు కృతజ్ఞత వెల్లడించేది. "నీ కృతజ్ఞతకు పాత్రుడను కానమ్మా" అని మనస్సులో అనుకునేవాడిని. ఏమీ దాచకుండా మనస్సువిప్పి మీకు చెప్తున్నాను—దాచవలసినపని యిప్పుడింకేమీ లేదు—నా రోగిని నేను ప్రేమించాను. నాపట్ల అలెగ్జాండ్రా ఆండ్రియేవ్నాకు కూడ అనురాగం అధికమైంది. వొక్కొక్కమారు నేను తప్ప మరెవ్వరూ తన గదిలో వుండటానికే అంగీకరించేదికాదు. గంటలతరబడి ఆమె నాతో కబుర్లుచెప్పేది. ఎక్కడ చదివారనీ, కాలం యెట్లా గడుపుతారనీ, చుట్టపక్కా లెవరనీ, ప్రాణస్నేహితు లెవరెవరనీ ప్రశ్నలు కురిపించేది. ఆమె మాట్లాడకూడదనీ, మాట్లాడితే

ప్రమాదమనీ నాకు తెలుసు. కాని ఆమె నాపు చెయ్యటం—మాట్లాడవద్దని కఠినంగా చెప్పటం—మాత్రం నాకు చేతనయ్యేదికాదు. వొక్కొక్కమారు తలను చేతుల్తో పట్టుకుని "ఓరి రాక్షసీ! నువ్వు చేస్తున్నదేమిటి?" అని నన్ను నేనే ప్రశ్నించుకునేవాడిని....ఆమె తన చేతుల్లోనికి నా చేతిని తీసుకుని, నా కండ్లలోనికి దీర్ఘంగాచూసి, ప్రక్కకు ఒత్తిగిలి, నిట్టూర్చి "మీరెంత మంచివారు!" అనేది. ఆమె చేతులు సలసల కాలిపోతూండేవి. విశాలమైన ఆమె కండ్లు అరమోడ్పుకునేవి.... "నిజమే, మీరు చాల మంచివారు, దయాళువులు—మా పొరుగువారిలాగ కాదు........ మిమ్మల్నింతకు పూర్వమే యెరిగుంటే యెంత బాగుండును!"

"అలెగ్జాండ్రా ఆండ్రియేవ్నా! శాంతించు" అన్నాను...."నాపట్ల నీకింతసదభిప్రాయం యే విధంగా కలిగిందో గాని ...నిజంగా నాకూ వుందనుకో....కాని, సరే....ఉద్రేక పడబోకు ....ఫరవాలేదు. నీకు నయమై పోతుంది." ఈలోగా మరొక విషయం చెప్పాలి. డాక్టరు ముందుకు వంగి, కనుబొమ్మలెత్తి చెప్ప నారంభించాడు: "ఇరుగుపొరుగువారితో వారంత కలసిగొట్టుగా వుండేవారు కాదు. తమకన్న తక్కువ వారితో వారికి విజ్ఞానం లేకపోవడంచేత జోస్తీగా వుండేవారు కాదు. ధనికులతో కొంగు తగిలితేనే కోటి వేలన్నట్లు రాసుకు పూసుకు తిరగడానికి గర్వం అడ్డు వచ్చేది. వారు బాగా విజ్ఞానవంతులని, సంస్కృతి కలవారనీ చెప్పానుగా. ఆ విషయం నా మనస్సుకు చాల సంతృప్తి నిచ్చేది. నా చేతుల్తో యిస్తేనే ఆమె మందు పుచ్చుకునేది....పాపం పిచ్చిపిల్ల. నా ఆసరాతో లేచి, మందు త్రాగి నా కండ్లలోనికి తేరి పార చూసేది....విచారంతో నా గుండె పగిలి పోతుందా అనిపించేది. ఈలోగా ఆమె ఆరోగ్యం అంతకంతకు క్షీణించ నారంభించింది. ఆమె చనిపోతుందని తెలుసుకున్నాను; చనిపోక తప్పదు. ఆమె తోబుట్టువులు, కన్నతల్లి నా కండ్లలోనికి ప్రశ్నార్థకంగా చూస్తున్నారు. అప్పుడు భగవంతు డామెను వదలి నన్ను తీసుకుపోయినా బాగుండు ననిపించిందంటే నమ్మండి....నాలో వారికి గల నమ్మకం క్రమంగా సడలిపోతోంది.

"ఏమండి, ఎట్లాగుంది?"

"ఆఁ ఫరవాలేదు! బాగానేవుంది!" బాగానే వుందట! నాకే ధైర్యం లేకుండా పోయింది. సరే, ఒకరోజు రాత్రి మామూలుగానే రోగి మంచంవద్ద ఒంటరిగా కూర్చున్నాను. దాసీది ఒక మూల కూర్చుని దిట్టంగా గుర్రుపెట్టి నిద్రపోతోంది. దాన్నికూడ యేమనటానికి నా మనసొప్పలేదు. అదికూడ పాపం సరిగా నిద్రాహారాలు లేక అలసిపోయింది. ఆ సాయంత్రమంతా జ్వర తీవ్రతతో అలెగ్జాండ్రా ఆండ్రియేవ్నా చాల బాధపడింది. అర్థరాత్రివరకు పక్కపై అటుయిటు కొట్టుకుంది. చివరికి నిద్ర పట్టిందేమో, కదలకుండా పడుకుంది. క్రీస్తుదేవుని పటం క్రింద దీపం వెలుగుతోంది. తల వంచుకుని నే నక్కడ కూర్చున్నాను. కొద్దిగా కునుకు పట్టినట్లుంది. అకస్మాత్తుగా న న్నెవరో తాకినట్లనిపించి, పక్కకు తిరిగి చూశాను....ఎవరనుకున్నారు! అలెగ్జాండ్రా ఆండ్రియేవ్నా నా కండ్లలోనికి గుచ్చి చూస్తోంది....ఆమె పెదవులు కంపిస్తున్నాయి; ఆమె చెక్కిళ్ళు మండుతున్నట్లున్నాయి.


## ది మెడ్రాస్ బాటిల్ & గ్లాస్‌వేర్ మార్టు

**57, చిన్నతంబి స్ట్రీటు, జి. టి. మద్రాసు.**

మాదగ్గర ఖాళీసీసాలు, కార్కులు, కేప్‌సిల్స్,
బేక్‌లైట్ కేప్స్ మొదలైనవి
టోకుగాను చిల్లరగాను దొరుకును.
ఫార్మస్యూటికల్స్, కెమిస్ట్స్, డ్రగ్గిస్టు, పెర్‌ఫ్యూమర్స్,
మాన్యుఫ్యాక్చరర్స్‌కు కావలసిన వివిధములైన
సీసాలు కూడా దొరుకును.

వివరములకు పై చిరునామాకు వ్రాయండి.






సుప్రసిద్ధ బలవర్ధ కౌషధము. సర్వవిధ బహిష్ట చిక్కులను పూర్తిగా పోగొట్టి సత్సంతానమును కలుగజేయుటలో మా వైబ్రో మిక్కిలి ఘనత వహించినది. అన్ని షాపులలో దొరకును.

స్టాకిస్టులు: అప్పా & కో. మద్రాసు.

**కృష్ణా లేబరేటరీ, బెజవాడ.**

"ఏమిటి?" అన్నాను.

"డాక్టర్, నేను చచ్చిపోతానా?"

"ఓరి భగవంతుడా!"

"లేదు డాక్టర్. నేను బ్రతుకుతానని మభ్య పెట్టబోకండి....మీకు తెలిస్తే....అట్లా చెప్ప కండి ...

"ఇదుగో! దేవునిసాక్షిగా చెప్తున్నాను. నా పరిస్థితిని దాచబోకండి—" ఆమె ఉచ్ఛ్వాస నిశ్వాసాలు అతివేగంగా వస్తున్నాయి. "నేను చచ్చిపోతానని తెలుసుకోగలిగితే....మీకంతా చెప్పేస్తాను....అంతా!"

"అలెగ్జాండ్రా ఆంద్రియేవ్నా, నిన్ను వేడు కుంటున్నాను!"

"చూడండీ, ఇంత సేపూ నే నసలు నిద్ర పోనేలేదు .... చాలసేపటినుండి మిమ్మల్నే చూస్తున్నాను. దేవుని సాక్షిగా....మీయందు నాకు విశ్వాసముంది. మీరు మంచివారు; గౌరవనీయులు; పవిత్రుడైన భగవంతుని సాక్షిగా మిమ్మల్ని వేడుకుంటున్నాను—నిజం చెప్పండి! అబ్బ. మీరు చెప్పబోయేవిషయం నా కెంత ముఖ్యమైనదో మీకు తెలిస్తే యెంత బాగుండును!....డాక్టర్, భగవంతుని సాక్షిగా చెప్పండి....నేను చనిపోతానా ?"

"అలెగ్జాండ్రా ఆంద్రియేవ్నా. నన్నేం చెప్పమంటావో చెప్పు?"

"దైవసాక్షిగా మిమ్మల్ని వేదుకుంటు న్నాను!"

"నీకు చెప్పకుండావుండలేకపోతున్నాను" అన్నాను. "అలెగ్జాండ్రా ఆంద్రియేవ్నా. నీ పరిస్థితి చాల ప్రమాదంగానే వుంది. కాని భగవంతుడు దయామయుడు."

"నేను చనిపోతాను! నేను చనిపోతాను!!

ఆమాటకి ఆమె చాల ఆనందించినట్లుగా కని పించింది. ఆమె ముఖంలో సంతోషం చిందు లాడింది. నేను చాల కంగారుపడ్డాను. "భయ పడకండి ! చావంటే నాకేమీ భయంలేదు." అకస్మాత్తుగా ఆమె లేచి మోచేతులమీద ఆను కుని కూర్చుంది. "ఇంక....అవును....యింక మీ కిప్పుడు నా మనఃపూర్వక కృతజ్ఞత తెలుప గలను....మీరు చాల మంచివారనీ, దయా మయులనీ, మిమ్మల్ని ప్రేమిస్తున్నాననీ కూడ చెప్పెయ్యగలను!" పిశాచావిష్టునివలె ఆమె వంక గ్రుడ్లువప్పగించి చూశాను; నా కదంతా యెంత భయకరంగా కనుపించిందో తెలు సాండి.

"ఇదుగో విన్నారా, మిమ్మల్ని ప్రేమి స్తున్నాను !"

"అలెగ్జాండ్రా ఆంద్రియేవ్నా, నేను నీ మనస్సుకెట్లా నచ్చానో—"

"అబ్బే, మీరు—మీరు న న్నర్థం చేసుకో లేదు"....అకస్మాత్తుగా ఆమె తన చేతులతో నా తలను పొదువుకొని ముద్దుపెట్టుకుంది.... నాకు తెలియకుండానే బిగ్గరగా అరిచానంటే నమ్మండి....తలగడలో నా ముఖాన్ని దాచేసు కున్నాను. ఆమె మాట్లాడలేదు. ఆమె చేతి వ్రేళ్లు నా జుట్టులో కంపిస్తున్నాయి. ఆమె చిన్నగా రోదించడం విన్నాను. ఆమెను అనునయించాను, సముదాయించాను.... ఏమో నిజానికి అప్పుడేమేమి మాట్లాడానో నాకే గుర్తులేదు.

"దాసి లేస్తుంది" అన్నాను. "అలెగ్జాండ్రా ఆంద్రియేవ్నా, నీకు చాల కృతజ్ఞుణ్ణి... నా మాట నమ్ము. నిజంగానే ...శాంతించు."

"చాలు, యింక చాలు!" ఆమె వాదించింది: "వాళ్ళందర్నీ లెక్క-చెయ్యకండి: లేస్తే లేవనియ్యండి—లోపలికివస్తే రానియ్యండి—మరేం ఫరవాలేదు: నే నెల్లాగా చచ్చిపోతున్నానుగా....ఇంక మీకు భయమేమిటి? ఎందుకు? ఏది, మీ తలయెత్తండి....లేకపోతే, మీకు నేనంటే ప్రేమలేదా? నేను పొరపడలేదుకదా? ....అట్లాఅయితే, నన్ను క్షమించండి."

"ఏమన్నావు!....నిన్ను మనస్పూర్తిగా ప్రేమిస్తున్నాను అలెగ్జాండ్రా ఆంద్రియేవ్నా."

సూటిగా నా కండ్లలోకిచూసి తన చేతులను జాపి "అయితే నన్ను పొదువుకోండి'' అంది.

ఆరాత్రి నాకు పిచ్చి యెందుకెత్తలేదో నాకే అర్థంకాలేదంటే నమ్మండి. ఈవిధమైన ఉద్రేకం ఆమెకు చాల ప్రమాదకారియని నాకు తెలుసు. ఆమెకు సరిగా స్మృతిలేదనీ తెలుసు. కానింకెట్లాగా బ్రతకనని గుర్తించియుండక పోయినట్లయితే ఆమె నన్ను ప్రేమించియుం దేదికాదని కూడ తెలుసు. అయినా మీ ఉద్దేశం యేమోగాని యిరవైయేళ్ళ యౌవనవతి ప్రేమంటే యేమిటో ఒక్కమారైనా రుచి చూడకుండా చనిపోవటం చాల కష్టమని నా ఉద్దేశం. ఈ విషయమే ఆమెను పీడిస్తోంది; అంచేతనే తన నిరాశా నిస్పృహల్లో తన ప్రేమకు నన్నాలంబనం చేసుకుంది—ఇప్పుడు మీకు బాగా అర్థమయిందనుకుంటాను ?—కాని ఆమె నన్ను చాలసేపు పొదివిపట్టుకుని వదలలేదు.

"నన్నింక వదులు అలెగ్జాండ్రా ఆంద్రియేవ్నా. నీకెంత ప్రమాదమో ఆలోచించు." అన్నాను.

"ఏమిటి?" అన్నదామె. "ఆలోచించటానికేముంది? నేనెట్లాగా బ్రతకనని మీకుతెలుసుగా ....'' ఈ మాటల నామె యెన్నిమార్లందో లెక్కలేదు.... "నేను బ్రతికి మళ్ళీ మామూలుగా తిరిగినప్పుడుకదా నేను సిగ్గుపడవలసింది....అప్పుడు సిగ్గు కలిగేమాట నిజమే ననుకోండి....కాని యిప్పుడెందుకు?''

"అసలు, నువ్వు చచ్చిపోతావని యెవరన్నారు?''

"అబ్బ పోండీ దొంగమాటలుచెప్పి నన్ను మోసగించా లనుకుంటున్నారా: పాపం మీకు అబద్ధమాట్టంకూడ తెలియదండీ—మీ ముఖం చూస్తేనే తెలుస్తుం దావిషయం...."

"నువ్వు తప్పక బ్రతుకుతావు అలెగ్జాండ్రా ఆంద్రియేవ్నా! నీ జబ్బు నయమవుతుంది: మీ తల్లి ఆశీర్వాదం పొందుదాం....పెండ్లి చేసుకొని సుఖంగా జీవిద్దాం ."

"అబ్బే మీరు చెప్పారు; నేనింక చనిపోవాలి ....మీరు వాగ్దానం చేశారు,..నాకు మాట యిచ్చారు...."

ఎన్నో కారణాలవల్ల—అదంతా నావల్ల క్రూరంగా పరిణమించింది. ఒకొక్కమారు అతి సామాన్యమైన విషయాలే యెంతెంత సమస్యలు తెచ్చిపెడతాయో చూడండి. అవేమీ గొప్పవిషయాలు కానట్లుగానే వుంటాయి. కాని కొన్నాళ్ళపాటు, కొన్నేళ్ళపాటు మన

స్సును రాచి రంపానపెడతాయి. ఆమె ఒక రోజున నాపేరేమిటని అడిగింది. దురదృష్ట వశాత్తూ నాపేరు ట్రిఫాన్ ఇవానిచ్ అయినా యింట్లో అంతా నన్ను డాక్టరనే పిలుస్తారు. వేరే గత్యంతర మేముంది? "ట్రిఫాన్" అన్నాను. వెంటనే ఆమె కనుబొమలు ముడి వడ్డాయి. ముఖాన్ని పక్కకు త్రిప్పేసుకుని ఫ్రెంచిభాషలో యేమేమో అనిష్టంగా గొణు క్కుంది! కొంతసేపటికి నవ్వింది. కాని ఆ నవ్వుకూడ యెంత వెగటుగావుంది! నరే రాత్రంతా ఆమెతో ఆవిధంగా కాలక్షేపం చేశాను. తెల్లవారేముందు పిచ్చివానిలా లేచి వెళ్ళిపోయాను. మళ్ళీ టీ త్రాగాకగాని ఆమె గదిలోకి వెళ్ళలేదు. చూస్తినికదా! ఆమెముఖం గుర్తుపట్టరానంతగా మారిపోయింది. ఆమె కన్న శవమైనా కొంత కళకాంతులు కలిగి వుంటుందేమో! ఆరోజు లెట్లా గడిచాయో నాకే తెలియలేదంటే నమ్మండి! నిజంగా ఒట్టేసుకుని చెప్తున్నాను. మూడు రాత్రింబవళ్లు నారోగి ఆవిధంగా చావుబ్రతుకులమధ్య ఊగు లాడింది. అబ్బ, యేమిరాత్రులు! ఆమెయెన్ని విషయాలు చెప్పిందని! ఆఖరురాత్రి—మీరే ఊహించుకోండి—ఆమెవద్ద కూర్చుని "ఓయి భగవంతుడా, ఆమెను త్వరగా స్వీకరించు; ఆమెతోబాటు నన్నుకూడ కొనిపోతండ్రీ!" అని మాత్రమే భగవంతుని ప్రార్థిస్తూ కూర్చు న్నాను. అకస్మాత్తుగా ముసలితల్లి గదిలోనికి వచ్చింది. అంత క్రితంరోజునే—యింక ఆట్టే ఆశలేదనీ, పురోహితునికి కబురంపించడం మంచిదనీ—తల్లితో చెప్పేశాను. రోగి తన తల్లిని చూడగానే యిట్లాఅంది: "అమ్మా నువ్వువచ్చావా, మంచిపని చేశావు. ఇదుగో మా యిద్దర్నీ చూశావా, మే మిద్దరం ఒకళ్ళ నొకళ్ళం ప్రేమించుకుంటున్నాం—పెళ్ళి చేసుకోవాలని నిశ్చయించుకున్నాం."

"డాక్టర్, అమ్మాయి యేమిటంటుంది?" నా ముఖం వివర్ణమైపోయింది.

"సంధి—జ్వరతీవ్రత" అన్నాను.

కాని ఆమె అడ్డువచ్చి "ఊరుకోండి! యిప్పుడేకదా యేమేమోచెప్పి నా ఉంగరం కూడ తీసుకున్నారు. ఎందుకల్లా నటిస్తారు? మా అమ్మ చాల మంచిది—ఏమీ అనదు—అర్థంచేసుకుంటుంది—నే నెల్లాగూ చచ్చిపో తున్నాను....అబద్ధాలు చెప్పవలసిన అవసరం నాకేమిటి? ఏది మీ చేతి నిట్లా యివ్వండి."

నేను లేచి గదినుండి వెళ్లిపోయాను. ముసలామె సంగతంతా గ్రహించింది.

"మిమ్మల్నింక ఆట్టేసేపు విసిగించను. ఈ విషయాలన్నీ జ్ఞాపకం చేసుకోవడం నా మన స్సుకు కూడ బహు బాధాకరంగానే వుంది. నారోగి మరుసటి రోజునే యీ లోకాన్ని విడిచి పెట్టేసింది. ఆమె ఆత్మకు భగవంతుడు శాంతి ప్రసాదించు గాక!" డాక్టరు నిట్టూరుస్తూ తొందరగా యింకా యిట్లా అన్నాడు: "చని పోయే ముందు ఆమె తన కుటుంబీకులందరినీ నన్ను దిగవిడచి బయటకు వెళ్లిపొమ్మంది."

"క్షమించండి" అన్న దామె. "మీవల్ల నేను అపచారం చేశానేమో... నారోగం.... కాని, నన్ను నమ్మండి. మిమ్మల్ని ప్రేమించి నంతగా నేను మరెవ్వరినీ ప్రేమించలేదు. నన్ను మరచిపోకండి....ఈ ఉంగరాన్ని నా జ్ఞాపకార్థమై మీవద్ద ఉంచండి."

డాక్టర్ తన ముఖాన్ని పక్కకు తిప్పేసుకున్నాడు. బరువెక్కిన గుండెతో నే నాయన హస్తాన్ని స్పృశించాను.

“ఆఁ, సరే!” అన్నాడాయన. “ఇంకేదైనా చెప్పుకుందాం. లేక డబ్బుపెట్టి పేకాడదామంటారా? ఏమో, యింతటి మహోన్నత భావాలు వెల్లడించడానికి నాలాంటి వాళ్ళం తగమేమో. ఇప్పుడు నా ఆలోచన అల్లా పిల్లలను యేడవకుండా చూడటం యెట్లాగ? పెళ్లాం తిట్టకుండా తిమ్మకుండా వుండాలంటే యేంచెయ్యాలి? అన్నది మాత్రమే. ఆ ఘటన తర్వాత దైవసాక్షిగా వివాహం చేసుకోదమంటారే—దానికి అవకాశం చిక్కింది.... అబ్బ....ఏడువేల రూపాయలు కట్నమిచ్చిన ఒక షాహుకారుగారి కూతుర్ని పెండ్లిచేసుకున్నాను. ఆవిడ పేరు అకులీనా. త్రిఫాన్‌తో జేరుస్తే ఆ పేరు బాగానే వుంటుంది. కానైతే ఆమెకు చిరాకు యెక్కువ. ఆమె నా అదృష్టం కొద్దీ రోజల్లా నిద్రపోతుంది. సరే. బ్రిడ్జి ఆడదామంటారా?”

పట్టుకు అర్ధణా పెట్టుకుని బ్రిడ్జి ప్రారంభించాం. త్రిఫాన్ ఇవానిచ్ నావద్ద రెండు రూపాయలు గెలిచాడు. తన గెలుపుకు విశేషంగా సంతృప్తిచెంది అర్ధరాత్రివేళ యింటికి వెళ్లిపోయాడు.


మా వద్ద అన్ని రకాల

కాళీసీసాలు, కార్కులు,

కేప్‌సిల్స్, బేక్‌లైట్ కేప్సు

గ్లాస్‌వేర్, చిమ్నీలు, సబ్బులు

టోకుగా దొరుకును.

వివరాలకు వ్రాయండి:

మహేంద్రబాటిల్ స్టోర్,

351, మింటు స్ట్రీట్, మద్రాసు 1.

# నృత్యము

శ్రీ ఎస్. వి. రమణారావు



ఈనాడు నాట్యప్రదర్శనములను అనేక మంది ప్రజలు చూస్తున్నారు. నాటకప్రదర్శనము, సంగీత ప్రదర్శనము వలెనే నాట్య ప్రదర్శనము కూడా ప్రజలను నేడు ఆకర్షిస్తూ యున్నది. ఇప్పుడు ప్రదర్శింపబడే సినిమాలలో నాట్యములేని సినిమా లేనేలేదని చెప్పవచ్చునుకూడా. పూర్వము బాలికలకు సంగీతము. వీణ మొదలయినవి నేర్పించినట్లే యిప్పుడు అనేకమంది తలిదండ్రులు తమ బాలికలకు నాట్యాన్ని నేర్పిస్తున్నారు. పది సంవత్సరాల క్రితంకంటె యీనాడు నాట్యంమీద ప్రజలకు అభిరుచి అభివృద్ధి పొందిందని చెప్పవచ్చును. ఒకప్పుడు యీ నాట్యాన్ని వేశ్యలు ప్రదర్శిస్తూ వుండేవారు. నాట్యము చేయడమంటేనే ఒకవిధమైన అగౌరవముగా భావింపబడేది. సంఘంలో ఏ విధమైన గౌరవమూలేని స్త్రీలు యీ నాట్యాన్ని తమకు తోచినట్లు ప్రదర్శించడముచేత వారు ప్రదర్శించే ఉ!త్తమమైన యీ నాట్యకళకూడా గౌరవాన్ని గోల్పోయింది. కాని, యీ నాటి పరిస్థితులువేరు. పెద్దకుటుంబాలలోని బాలికలు, విద్యావంతులు యిప్పుడు నాట్యాన్నిఅభ్యసించి ప్రదర్శించడంచేత నాట్యకళ నేడు తన స్థానాన్ని చేరుకోగలుగుతోంది. నాట్యకళఇంత వరకు యింత నీచమైనదిగా పరిగణించబడడానికి కారణం కేవలం వేశ్యలుమాత్రమే దీనిని ప్రదర్శించడమే. పురాణాలలో, శుభకార్యములలో, ఉత్సవాలలో, వ్రతములలో నృత్యగీతాదులచేత భగవంతుని పూజించాలని వ్రాయబడివుంది. దీనినిబట్టి సంగీతానికి ఎటువంటి ప్రాముఖ్యత, గౌరవం ఉందో నృత్యానికికూడా అంత ప్రాముఖ్యత, గౌరవం ఉండేదని మనం ఊహించుకో వచ్చును. నేడు సంగీతానికి ఉన్నంత ప్రచారం నాట్యానికిలేదు. సంగీతం చాలమంది అభ్యసించారు. సంగీతాన్ని విని ఆనందించగలిగినట్లు ప్రజలు నేడు నృత్యాన్ని చూచి ఆనందించటంలేదు. దీనికి కారణమేమంటే సంగీతాన్నిగురించి తెలిసినంత నాట్యాన్ని గురించి ప్ర జ ల కు తెలియదు. ఎవరయినా అందమయిన స్త్రీ

నాట్యంచేస్తే ఏకాంతమందో చూడడము. ఆ స్త్రీ నాట్యంకంటే ఆమె అందమేచూచి బాగో గులు నిర్ణయించడం. లేదా ఇదివరలో ఎవరో పెద్దలు ఈ నాట్యాన్ని చూచి అద్భుతంగా ఉందని ప్రశంసించారు, కాబట్టి చాలా బాగుం దనేవాళ్లు. యూరపు, అమెరికా మొదలయిన పశ్చిమదేశాలలో పర్యటనచేసి ప్రశంసలను పొందారు కాబట్టి బాగుందని. ఏ సినిమాలో చూచినా వీళ్ళ నాట్యాలేకాబట్టి చాలా బాగున్నా యని అనుకునేవారే కాని, నాట్యంయొక్క విషయం తెలుసుకొని దాని బాగోగులు నిర్ణ యించే శక్తి ఎంతోమందికి లేదు.

సినిమాలలోగాని, రంగస్థలంమీదగాని యిప్పుడు నాట్యప్రదర్శనలిచ్చే స్త్రీలు,పురుషులు ఉన్నారు, కొన్ని బృందములు ఉన్నాయి. వీరు, వీరి బృందములు ఎక్కువ ప్రచారాన్ని ఏవిధంగా పొందారు? ముఖ్యమైనది పత్రిక లలో ప్రచురణ. బజారులో విక్రయింపబడే అన్ని సామానులవలెనే పత్రికలలో ఎక్కు వగా ప్రచురణచేస్తూ ఉండాలి, లేదా అనేక సినిమాలలో నాట్యంచేస్తూ ఉండాలి. మంత్రుల చేతనో, గవర్నర్లచేతనో, ఉద్యోగులచేతనో, ధనవంతులచేతనో ప్రశంసింపబడాలి. లేదా యూరపు, అమెరికా దేశములలో పర్యటనచేసి అక్కడ అద్భుతమైన ప్రశంసలనుపొందామని పత్రికలలో ప్రచురించాలి. అప్పుడే జనసామా న్యం విరగబడి ఈ ప్రదర్శనలను చూస్తారు. ఏ కళకయినా యీ పై విధానాలన్నీ వర్తి స్తాయి. ఒక్క నాట్యకళకే గాదు. అన్ని కళ లకూ గూడా. నాట్యకళకు ముఖ్యంగా, ఎందు చేతనంటే నాట్యాన్నిగురించి ఎక్కువమందికి తెలియకపోవడమే కారణం. ఈ పై కారణా లలో కొన్నిగాని, అన్నీగాని నేడు ఎక్కువ ప్రచారంలో ఉన్న నర్తకీనర్తకులకు సహాయం చేశాయి, చేస్తున్నాయి.

సంగీతము నేడు యింత ప్రచారంలో ఉన్నదిగదా, ఎవరయినా పాడుతోంటే, ఆ పాట శృతిలో ఉన్నదో లేక అపశృతిలో ఉన్నదో ధైర్యంగా చెప్పగలిగిన వా రెంత మంది? పెద్ద సంగీత విద్వాంసులని నేడు ప్రఖ్యాతిజెందిన పండితులలో అపశృతిలోపాడే గాత్రపాటకులు లేకపోలేదు. రాజపాత్ర ధరించి చాకలివానివలె మూతిముక్కులు విరిచి,చేతులు కాళ్లు విదిలించి అభినయించే నీచపాత్రాభి నయముకూడా ఉత్తమకళగా చలామణీ అవు తూన్నది. నృత్యాన్ని గురించికంటె నాటకాభి నయాన్నిగురించి,సంగీతాన్నిగురించి ఎక్కువ మంది ప్రజలకి తెలుసు. నాటకాభినయం, సంగీతంలో ఉన్న మంచిచెడుగులను గుర్తించ లేని ప్రజాసామాన్యానికి నృత్యంగురించి ఎలా తెలుస్తుంది. అందుచేతనే నృత్యానికీ, నర్తకీనర్తకులకీ, సంగీతానికీ, సంగీత విద్వాం సులకీ ఉన్న ప్రచారం కూడా లేకపోవడానికి కారణం. పైన ఉదహరింపబడిన అవకాశాల వలన ఎంతమంది సంగీత విద్వాంసులు, నర్తకీ నర్తకులు గుర్తింపబడ్డారో అంతకంటె ఎన్నో రెట్లు కళారాధకులు అటువంటి అవకాశాలు లేక గుర్తింపబడక అంధకారంలో ఉన్నారు.

ఏ కళలయినా అభివృద్ధిచెందాలన్నా, ఎక్కువ ప్రచారం పొందాలన్నా ముఖ్యంగా ఆ కళ లను అభ్యసించి ప్రచారంచేసే కళారాధకులు ఎక్కువమంది కావాలి. అంతకంటే ముఖ్యం యీ కళలను కూలంకషముగా అభ్యసించి ఈ కళలలో సంపూర్ణ పాండిత్యము గల నిష్పక్ష

పాతమైన విమర్శకులు కావాలి. వీరు యీ కళోపాసకులలోని మంచి చెడుగులను గుర్తించి. ఏది ఎందుకు మంచో చెడో విశదంగా వివరాలతో, నిర్భయంగా, నిష్పక్షపాతంగా, విమర్శించి కళోపాసకులకు, ప్రజలకు చెప్పగలిగిననాడు ఈ కళలు సర్వతోముఖాభివృద్ధి చెందుతాయి. ఉత్తమ విమర్శకులు లేకపోతే ఏ కళలుకూడా రాణించవు, అభివృద్ధిచెందవు. ఉత్తమ విమర్శకులు లేకపోవడమే కళలు అభివృద్ధి చెందవలసినంతగా చెందకపోవడానికి, ఉత్తమ కళోపాసకు లందరూ గుర్తింపబడకుండా ఉండడానికి ముఖ్యకారణం.

కళలను ఎక్కువమంది అభ్యసించడం ఆనందించవలసిన విషయం, ముఖ్యంకూడాను. లేకపోతే యీ కళలు నామరూపాలు లేకుండా నశించిపోతాయి. కళలను అభ్యసించి అవి నశించిపోకుండా, ఏదో ఒక రూపంతోనయినా నిలువబెట్టాలి. కళలను అభ్యసించే కళోపాసకులను ప్రజలే పోషించాలి. పూర్వం యీ కళలను రాజులు, జమీందార్లు పోషిస్తూండేవారు.ఇకముందు రాజులు,జమీందార్లు ఉండరు. కనుక ప్రజలే యీ బాధ్యత వహించాలి. ఉత్తమము, మధ్యమము, అధమము అనేవిచక్షణ లేకుండా అధమం యింకా కొంతకాలంవరకూ నైనా యీ కళలను, కళోపాసకులను ప్రజలు ఆదరించి పోషించాలి. నృత్యకళ అభ్యసించడానికి సాహసించేవాళ్లే చాలా తక్కువ. ఎందుచేతనంటే యిది అందరికీ జీవనోపాధి కల్పించదు.

అభ్యసించిన వా రందరిలోనూ నూటికి ఏ ఒక్కరో ఇద్దరో గుర్తింపబడడం జరుగుతూంది. నృత్యకళ నభ్యసించి ప్రచారం చేయాలంటే, మంచి ఆరోగ్యం, అంగసౌష్ఠవం కావాలి. మంచి ముక్కూ, కళ్లు, ముఖమూ యివన్నీ భగవంతు డివ్వవలసినవి. భగవంతుడిచ్చిన యీ అంగసౌష్ఠవం గల యువతీయువకులు దేహపరిశ్రమకు భయపడకుండా, ఉత్సాహంతో ముందుకు రావాలి. అందరికీ జీవనోపాధి కల్పించని, పేరు ప్రఖ్యాతులనివ్వని నృత్యాన్ని అభ్యసించడానికి,జీవితాంతంవరకూ నృత్యకళనే ఉపాసించడానికి ఎంతో పట్టుదల అవసరం. సంగీతానికి చక్కటి శృతి లీనమైన గాత్రం ఏలా అవసరమో అలాగే నృత్యానికి చక్కటి దేహసౌష్ఠవం, ఆరోగ్యం,లయజ్ఞానం పుట్టుకతో ఉన్నవాళ్ళకే నృత్యం అబ్బుతుంది. అందరికీ యీ కళ అబ్బదు. ఈ పై గుణాలు గలవారికే నాట్యం వస్తుంది. వారే నాట్యంలో రాణిస్తారు. ఈ గుణాలు పుట్టుకతో ఉండవలసినవి. అందుచేత భగవంతు డివ్వవలసినవి. ఆపైన మానవప్రయత్నం కావాలి. ఎడతెగని పరిశ్రమచేత, సాధనచేత కళలో సంపూర్ణ పాండిత్యాన్ని సంపాదించాలి. ఇంత శ్రమపడి విద్య సంపాదించినవారందరికీ పేరు ప్రఖ్యాతులు, జీవనోపాధి లభించదు. అదీగాక సంగీతము నేర్చుకున్నట్లయితే శృతికూడా అవసరం లేకుండా ఎక్కడయినా పాడవచ్చు. స్నేహితులను, చిన్నచిన్న బృందాలను రంజింపజెయ్యవచ్చు, ఓ మాదిరి పేరు సంపాదించుకోవచ్చు. నృత్యం అలాకాదు. నృత్యానికి వెనుక హంగులు కావాలి. సంగీతము, తాళము నృత్యానికి చాలా ముఖ్యం. ఏ సముద్రపుటొడ్డునైనా ఎక్కడబడితే అక్కడ సంగీతము పాడవచ్చు, వెనుక శృతి కూడా అక్కరలేదు. నాట్యమయితే విశాలమయిన ప్రదేశము, రంగస్థలము,

రంగురంగుల దుస్తులు, విద్యుద్దీపాలు మొదలయిన హంగులు కావాలి. అర్థములేని నాట్యము రక్తికట్టదు. ఏ పాటకయినా నృత్యం చెయ్యాలి. ఇన్ని సాధకబాధకాలతో కూడుకున్న ఈ నృత్యకళ అపూర్వమైనది. ఈ కళ తన పూర్వపు ఔన్నత్యం పొందాలంటే యువతీ యువకులు అభ్యసించి కళకోసమే కళను నిష్ఠామంగా ఉపాసించి కళకు సేవచెయ్యాలి.

ఈనాడు మనము సినీమాలలో చూచే నాట్యం నాట్యమని చెప్పడానికి వీలులేదు. అర్థంలేని అవయవాల కదుపులతో ఔచిత్య హీనమైన నేటి సినీమా నాట్యాలు నాట్యకళకు ఏవిధంగానూ ఉపకరించకపోగా తీరని అపకారం చేస్తున్నాయని చెప్పవచ్చు. ఈ మధ్య కొంచెం గౌరవంపొందుతూ ఉన్న నాట్యకళను వెనుకటికంటేకూడా నీచంగా చేసివేస్తున్నాయి నేటి సినీమా నాట్యాలు.

నేతిబీరకాయవలె నేటి సినీమాలలో చూపింపబడే నాట్యాలలో నాట్యమే లేదు. నగ్నంగానో, అర్థనగ్నంగానో ఉన్న ఒక స్త్రీ గాని, కొంతమంది స్త్రీలుగాని ప్రజల హృదయాలలో నీచమయిన భావాలను రేకెత్తించేటట్లు చేయబడుతూన్న ఈ నాట్యాలు నాయిక మొదలు నీచపాత్రవరకు ఒకేరకం ఊపులు, కుదుపులు గల యీ సినీమా నాట్యాలు నాట్యకళకే కాకుండా సంఘానికి కూడా తీరని కళంకాన్ని ఆపాదిస్తున్నాయి. ఈ సినీమా నాట్యాలు వచ్చిన తరువాత గౌరవమైన కుటుంబాలలోని వారు, విద్యావంతులు నాట్యమంటే యింతే కాబోలు ననుకొని నాట్యమంటేనే అసహ్యించుకునే పరిస్థితులు వస్తున్నాయి. నేటి సినీమాలలో చేయబడే నాట్యాలవంటి నాట్యాలు ఎవరూ కూడా తమ కుమార్తెలు, చెల్లెళ్ల చేయగా చూచి సహించగలరా?

లక్షలరూపాయలు వెచ్చించి తయారుచేసే సినీమాలలో శాస్త్రయుక్తమయిన నృత్యాన్ని ప్రదర్శించడానికి ఎంతో అవకాశం ఉంది. నృత్యకళకు సినీమా నిర్మాతలు, దర్శకులు ఎంతయినా సహాయం చేయగలరు కాని సినీమాలలో కథకళీ, భరతనాట్యాలు అక్కరలేదు. ప్రజలు కోరుకుంటూన్నది ఆ ఊపులు, కుదుపుల నాట్యాలేనని పేరున్న దర్శకులు అభిప్రాయపడడం చాలా విచారకరమైన విషయం. ప్రజలు శాస్త్రయుక్తమైన నాట్యాలు మాకక్కరలేదనలేదే; మానవునిలోని పశుత్వాన్ని రేకెత్తించే నగ్న, అర్థ నగ్న, ఊపుల నాట్యాలను కావాలని ప్రజలు కోరలేదే. సినీమాలలో శాస్త్రయుక్తమయిన నృత్యాలను ప్రదర్శించినపుడు తన్మయులై చూచినదే పదిసార్లు చూచిన ఉదాహరణలు ఉన్నాయి. శాస్త్రయుక్తమైనదా కాదా అన్న మీమాంస ప్రజానీకానికక్కరలేనిమాట సత్యమే. ఏ నృత్యాలనైనా కళ్ళకింపుగా ఉండేటట్లు తీసి ప్రదర్శించిననాడు ప్రజలు తప్పకుండా చూచి అభిమానించి ఆదరించారు. ఇకముందు కూడా అంతకంటే ఎక్కువగా అభిమానించి ఆదరిస్తారు.

రాజులు, జమీందార్లు లేని మన సంఘంలో కళలకు, ముఖ్యంగా నృత్యకళకు ప్రోత్సాహమిచ్చి అభివృద్ధిలోనికి తీసుకురావడానికి సినీమా నిర్మాతలకు, దర్శకులకు ఎన్నో అవకాశాలున్నాయి. ఈ అవకాశాన్ని వినియోగించుకొని ఉత్తమమయిన, శాస్త్రయుక్తమైన నృత్యకళకు దోహదంచేసే తమ విధిని నిర్మాతలు, దర్శకులు గుర్తించే అదృష్టదినాలు

రావాలి. వీరు వ్యాపారదృష్టితోనే తమ లాభాలను సంపాదించుకుంటూ కళాసేవ చేయవచ్చును.

నృత్యగీతాదులు భగవంతుని పూజలో నుపయోగింపబడునని పురాణాలలోను, శాస్త్రాలలోను చెప్పబడింది. భగవంతుని పూజలో ఉపయోగింపబడే నృత్యం మానవునిలోని పశుత్వాన్ని రేకెత్తించకూడదు. రసోత్పత్తి కళయొక్క ఔచిత్యాన్ని తెలియపరుస్తుంది. రసోత్పత్తి అంటే సంగీతాన్ని విన్నప్పుడుగాని, నృత్యాన్నీ చూచినప్పుడుగాని ప్రేక్షకులలో కలిగే భావమే రసోత్పత్తి. నృత్యములో నవరసములనుప్రదర్శింపవచ్చును. నృత్యముఅన్ని దేశాలలోను, అన్ని కాలాలలోను విజ్ఞానదాయకమైన కళగా దేశౌన్నత్యాన్ని, ప్రజాభిరుచిని తెలియజేసే చిహ్నంగా తరతరాలనుండి అభ్యసింపబడి ప్రచారం చేయబడుతూవచ్చింది. అది శాస్త్రయుక్తమయినదే కావచ్చు. జానపదమై అక్షరజ్ఞానంలేని పల్లె కార్మిక కర్షకులచేత పర్వదినాలలో, ఉత్సవాలలో ప్రదర్శింపబడేదే కావచ్చు. జానపద నాట్యాలు గ్రంథస్థం కాకపోయినప్పటికీ తండ్రి తాతలనుంచి వంశక్రమంగా వచ్చే విద్య. విజ్ఞానానికి, కాలక్షేపానికి, ఆనందానికి, ఆరోగ్యానికి ఉపకరించే లలితకళ.

హిందూదేశంలో ప్రదర్శింపబడే శాస్త్రయుక్తమయిన నృత్యములన్నింటికీ కూడా మూలం భరతనాట్య శాస్త్రము. దక్షిణ హిందూదేశంలో కథకళీ, భరతనాట్యం అని ప్రచారంలో ఉన్నాయి. ఉత్తర హిందూదేశంలో కథక్ అని, అస్సాందేశంలో మణిపురీ అని ప్రసిద్ధి చెందినాయి. ఈ నాలుగు నాట్యరీతులలోను కూడా శాస్త్రయుక్తమైన పద్ధతిలో నేటికి కూడా ప్రదర్శింపబడి తమ పూర్వపు ఔన్నత్యాన్ని నిలబెట్టుకొన్నవి కథకళీ, భరత నాట్యాలు.

వేదములు, పురాణములు, ఇతిహాసములు మనకెలా లభించాయో అలాగే నాట్యశాస్త్రము కూడా మనకు లభించింది. ఈ నాట్యశాస్త్రం భరతమునిచేత వ్రాయబడినది. కనుక భరత నాట్యశాస్త్రం పేరు దీనికి వచ్చియుండవచ్చు. భావ రాగ తాళ యుక్తమైనది కనుక భరతనాట్యమని కొందరంటారు. ఈ నాట్యశాస్త్రంలో నృత్యమునుగురించి ఆమూలాగ్రంగా వ్రాయబడింది. ఈ నాట్యశాస్త్రానికి అభినవ గుప్తాచార్యుడను కాశ్మీరదేశపు బ్రాహ్మణుడు విపులంగా వ్యాఖ్యానం వ్రాశాడు. నందికేశ్వరునిచే వ్రాయబడిన అభినయదర్పణములో కూడా నృత్యమునుగురించి ఎంతో వివరంగా వ్రాయబడింది. దేవతలయొక్క కాలక్షేపంకోసం ఇంద్రుని కోరికపై బ్రహ్మ చతుర్వేదముల సారమును గ్రహించి పంచమవేదమగు నాట్యశాస్త్రాన్ని రచించి భరతమునికియిచ్చినట్లును, భరతముని దేవాంగనలైన అప్సరసలకు, తన నూర్గురు కొడుకులకు ఈ నాట్యశాస్త్రాన్ని నేర్పి ప్రదర్శించి ప్రచారం చేసినట్లును నాట్యశాస్త్రంలో వ్రాయబడియున్నది. భరతముని ప్రచారంచేయడంచేత భరతనాట్యమని పేరు వచ్చినదని కూడా కొందరంటారు.

నృత్యము మూడు భాగములు—నృత్తము, నాట్యము, నృత్యము అని—నృత్తమంటే భావరాగములు లేని లయానుగుణ్యమైనదని, నాట్యమనగా నాటకములో నుపయోగించున

దని, నృత్యము భావ రాగ తాళయుక్తమైనదని అర్థము. ఈ నృత్యము తిరిగి తాండవము, లాస్యము అని రెండు విధములు. ఉద్ధృతమై పురుషులు చేయునది తాండవము. లలితమై స్త్రీలచే చేయబడునది లాస్యము. నృత్యమును శివుడు పరీక్షించి దానిలో ఉద్ధృతమైన నృత్యమును తాను చేసి తండుమునికి చెప్పి నృత్యములో చేర్చెను. తండుముని ద్వారా చేర్చబడుటచే తాండవమను పేరు వచ్చినట్లు కూడా అంటారు. నృత్యానికి ఆదిదేవుడు ప్రథమంగా ప్రదర్శించి ఎక్కువ వ్యాప్తం చేయుటచేత శివునకు నటరాజు అని పేరు వచ్చినది. చిదంబరములోని మూలవిరాట్ నటరాజు. చిదంబరము నటరాజ దేవాలయము పైన లోపల చెక్కబడిన 108 భంగిమలు నాట్యశాస్త్రములో చెప్పబడినవి. తాండవ లక్షణమను భాగములో వివిధములైన రసములను అభినయించుటలో ఆయా అభినయమునకు, రసమునకు అనుకూలమైన భంగిమలనే కారణములంటారు. ఈ 108 భంగిమలు కారణములు. కొన్ని కారణములు కలిసి ఒక అంగహార మవుతుంది. ఒక భావాన్ని ప్రదర్శించడానికి కొన్ని కారణములను వరుసగా ప్రదర్శించాలి.

నృత్యానికి అభినయం జీవం లాంటిది. అభినయము లేనిది నృత్యమే కాదు. ఈ అభినయము నాల్గు విధములు: 1. ఆంగికము, 2. వాచికము, 3. ఆహార్యము, 4. సాత్వికము. ఆంగికమనగా అంగములచేత ఉపాంగ ప్రత్యంగములచేత భావాన్ని ప్రదర్శించడం; కారణము లనబడే దేహ భంగిమలచేత ముద్రలనబడే వివిధములయిన చేతులతో చూపబడు హస్త భేదములచేత శిరోభేదములచేత భ్రూ భేదములచేత గ్రీవా భేదములచేత దృష్టి భేదములచేత భావమును ప్రదర్శించుట. ఇది ఆంగికాభినయము. దేహములోని అవయవములు, అంగములు, ప్రత్యంగములు ఉపాంగములుగా భాగింపబడినవి. ఈ అంగముల కదలికచేత, కూర్పుచేత భావమును ప్రదర్శించుట ఆంగికాభినయము. మాటలలో పాటలలో భావమును ప్రదర్శించుట, ఆయా భావము లనుభవించుచు మాట్లాడుట, పాడుట వాచికాభినయము.

తాము ధరించు పాత్రల కనుగుణ్యమైన వేషధారణచేత పాత్రౌచిత్యమును ప్రదర్శించుచు, ఆ వేషములు చూచుటచేతనే ఆ పాత్ర లనుభవించు భావమును వ్యక్తపరచునది ఆహార్యాభినయము.

దేహమును అంగ ప్రత్యంగ ఉపాంగములను కంపింపజేయుటచేత, కన్నీళ్ళు ప్రదర్శించుటచేత, స్వేదమును ప్రదర్శించుట, మొదలగు మనోభావములు ప్రదర్శించుట సాత్వికాభినయము.

అభినయము నృత్యానికి ప్రాణం. పైన వివరించిన భేదములలో ఒక్కొక్క భేదములోను భావమును సంపూర్ణముగా ప్రదర్శింపవచ్చును. ఉదాహరణకు హస్త భేదములు లేక ముద్రలు. ఈ ముద్రల సహాయంతో ఏ భావాన్నయినా సంపూర్ణంగా ప్రదర్శించవచ్చును. హస్తభేదములు ఒక భాష. ఈ ముద్రలు తెలిసినవా రెవరైనా సరే నోరు విప్ప నక్కరలేకనే ఎంత క్లిష్టమైన భావమునైనా ఎదుటివారికి చెప్పవచ్చును. ఈ హస్తాభినయము కథకళీ నృత్య పద్ధతిలో అపూర్వమైన ఉచ్చస్థితిలో నున్నది. ఈ హస్త భేదముల కనుకూలమైన దేహ భంగిమలు, కండ్లు, కనుబొమ్మలు, శిరస్సు, గ్రీవము, కూర్చి ప్రదర్శించినచో ఎటువంటి భావమైనా ప్రేక్షకులకందరికీ అద్దములో చూపినట్లు విశదముగా భావాన్ని ప్రదర్శించవచ్చును. ఈ అభినయ పద్ధతి భరతనాట్య శాస్త్రంలోను, అభినయ దర్పణంలోను ఎంతో విశదంగా వివరింపబడింది. గ్రంథాన్ని చదివి ఈ విద్య నభ్యసించడం అంత సులభం కాదు. ఈ విద్య గురుముఖతా నేర్చుకోవలసినదే.

# బామ్మతపః ఫలం

శ్రీ తూలికా భూషణ

చిట్టి తల్లికి మూడేళ్ళు.

ఆఫీసునుంచి వచ్చిన రామారావుకి చిట్టి తల్లి గుమ్మంలోనే ఎదురయింది. గభీమని ఎత్తుకుని, ముద్దు పెట్టుకున్నాడు రామారావు.

రామారావు జోడు చప్పుడు విని కాఫీ గ్లాసుతో వచ్చింది పార్వతి. కూతుర్ని భార్య కిచ్చి, కాఫీ గ్లాసు తీసుకున్నాడు రామారావు.

"ఏమే, అప్పుడే నాన్నగారి నెక్కడ చూశావే'' అ నడిగింది తల్లి కూతుర్ని.

"కడుపమ్మా. నా తండ్రీ అంతే చిన్నప్పుడు. ఎలా తెలుసుకునేవాడో గాని కనబడక పోతే ఇట్టే ఏడ్చేసేవాడు. ఏదీ, పట్టుమని అప్పటికీ గుడ్లేనా తెరవలేదింకా నా నాయన" అని లక్ష్మమ్మగా ఒన్నారు. లక్ష్మమ్మగారు రామారావు తల్లి. లేకలేక నలభయ్యో పడిలో కలిగాడు రామారా విడకు.

ఇప్పుడు అరవై సంవత్సరాలు దాటాయి లక్ష్మమ్మగారికి. పని చేసే శక్తి ఉడిగింది. ఏదో భగవద్ధ్యానం చేసుకుంటూ కాలక్షేపం చేస్తోంది.

రామారావు ఉద్యోగంలో చేరిన ఏడాదే ఆయనకు కూతురుకూడా కలిగింది. లక్ష్మమ్మ గారి కిప్పుడు మనమరాలి నాడించడం నెత్తి మీద పడింది.

రామారావు తరువాత లక్ష్మమ్మగారి కొక కూతురు కలిగింది. కమల కాపురం చేసు కుంటోంది. కమలకు అయిదేళ్ళ కొడుకు కూడా ఉన్నాడు.

కమల పెళ్ళయిన తరువాత రామారావు తండ్రి శివరావుగారు కాలధర్మం చేశారు.

తల్లి మాటని మరిపిస్తూ రామారావు "నీ కేం కావాలే" అ నడిగాడు చిట్టితల్లిని.

తలాడిస్తూ "జోవు" అంది చిట్టితల్లి.

"నీకు జోడెందుకే? ఎక్కడి కెడతా వేమిటి" అంది పార్వతి.

"ఎక్కడి కేమిటే? స్కూలుకి. అది చదువుకుంటుంది. ఏ డాక్టరీయో ప్యాసై దర్జాగా స్వతంత్రంగా సంపాదించుకుంటుం ద"న్నాడు రామారావు.

"మరి పెళ్ళక్కర్లేదా ఏమిటి? ఏమిటో నమ్మా. ఈ చదువులు, గిదువులు మా కాలం నాడు మే మెరగం. పెళ్ళి చేయకపోతే ఎలాగ" అంది లక్ష్మమ్మగారు.

"పెళ్ళి చేయకూడదు అమ్మా. చదువు చెప్పించాలి. చదువులు చెప్పించక పెళ్ళిళ్ళు చేసి, వాళ్ళని అధోగతిలో పారేస్తున్నాము.

అందుకనే మన సంఘ మిలా ఉంది''అన్నాడు రామారావు.

కొంచెం సందేహంగా అత్తగారి కేసి చూస్తూ " చిట్టితల్లికి చదువేంటత్తయ్యా '' అంది పార్వతి.

బామ్మ సమాధానం చెప్పకుండా ఊరుకుంది.

* * *

ఆనాడు చిట్టితల్లి పుట్టినరోజు పండుగ. చిట్టితల్లికి ఆరో ఏడు ప్రవేశించింది.

పేరంటాండ్రు వెళ్ళిపోయిన తరువాత చిట్టితల్లి తండ్రిదగ్గరకు పరుగెత్తుకొని వెళ్ళింది. రామారావు సిగరెట్టు కాల్చుకుంటూ సావకాశంగా పడుకుని ఉన్నాడు.

చిట్టితల్లి తండ్రి పక్కమీదెక్కి "నాన్నగారూ, మరి నాకేం, జోడు కొనిపెట్టరూ?" అ నడిగింది.

కూతురు వెనుకనే వచ్చిన పార్వతి "బళ్లో వేసేటప్పుడు కొంటారు లేవే. ఇప్పు డేం కంగారు" అంది.

"నా కిప్పుడే కావాలి'' అని మారాం చేసింది చిట్టితల్లి.

"కొనిస్తాన్లే" అన్నాడు రామారావు చిరునవ్వుతో.

"బళ్ళో ఎప్పుడు వేస్తారు" అ నడిగింది పార్వతి భర్తని.

"ఈ వేసవికాలపు సెలవలు పూర్తయ్యాక ఆడపిల్లల స్కూల్లో చేర్పిస్తాను" అని సమాధాన మిచ్చాడు రామారావు.

"పోనీ ప్రైవేటు మాస్టర్ని పెట్టరాదుటండీ" అంది పార్వతి.

"ఎందుకూ? ఓనమాలే కదా. అయిదో క్లాసు పూర్తయి, హైస్కూల్లో చేరిన తరువాత కావాలంటే ప్రైవేటుకూడా చెప్పించవచ్చున్లే" అన్నాడు రామారావు.

"ఎందుకనేమిటి చదువు?''

"అది చదువుకునేదాకా.''

"మరి పెళ్ళిచేయరా ఏమిటి?"

"నీకూడా చాదస్త మేమిటే? పెళ్ళి మాత్రం చేయను. దానంత ఇది పెళ్ళి చెయ్యి నాన్నా అనేవరకు ఆ విషయం తలపెట్టడానికి కూడా వీల్లేదు'' అన్నాడు రామారావు.

ప్రక్క గదిలోనే పడుకుని ఈ కబుర్లన్నీ వింటూన్న లక్ష్మమ్మగారి దగ్గరకు వెళ్ళి చిట్టితల్లి "మరేం, బామ్మోయ్, నాన్నగారు నాకు జోడు కొంటానన్నారే. నేను జోడు తొడుక్కుని బళ్ళోకి వెడతానేవ్'' అంది.

"అవునమ్మా, నీ కడుపు చల్లగా నువ్వు చదువుకుని, పెద్ద పరీక్షలు ప్యాసవ్వాలి" అంది లక్ష్మమ్మగారు.

"చూడు, అమ్మ కూడా చదువుకోమనే అంటోంది. మనకంటె అమ్మ నయం" అన్నాడు రామారావు పార్వతితో.

బామ్మ విని చిరునవ్వు నవ్వింది.

* * *

చిట్టితల్లి మూడవ తరగతి చదువుతోంది. కొడుకుని తీసుకుని కమల వచ్చింది. కమల కొడుకు సుబ్బారావుకి పదేళ్ళు.

బడినుంచి ఇంటికివచ్చి చిట్టితల్లి బావతో గుజ్జెనగూళ్ళాట ఆడుతోంది.

చిట్టితల్లిని తన కొడుక్కి చేసుకోవాలని కమల ఉద్దేశం. పిల్లల ఆట చూడగానే కమల తల్లినీ, వదిననూ పిలుచుకువచ్చింది.

"ఆఫీసునుంచి వచ్చేటప్పుడు ఏం తీసుకు రమ్మంటావ్" అ నడిగాడు ఆటలభర్త చిట్టి తల్లిని.

"మంచి చీర పట్టుకురండి" అంది సిగ్గుతో ఆ బాలిక.

"ఇదుగో వచ్చాను" అని బావ.

"చీరేదీ?" అని చిట్టితల్లి.

"ఇదుగో" అని కొంచెం పప్పు చేతి కిచ్చాడు సుబ్బారావు.

"బావని పెళ్ళాడకూడదుటే? నిజమైన చీర తెచ్చిపెడతాడు" అంది కమల మేన కోడలితో.

కూతురంటే ఇష్టం లేదు లక్ష్మమ్మగారికి.

"పిల్లలేదో ఆడుకుంటూ ఉంటే పెళ్ళి, పెళ్ళి అంటావేమిటి? ఏడేళ్ళైనా నిండలేదు దానికీ, పదేళ్ళయినా లేవు నీ కొడుక్కీని. బాగానే ఉంది. వాళ్ళ నాడుకోనియ్యక మధ్య మన కెందుకు" అందావిడ.

"వేళాకోళానికంటే అలా అంటావేమిటే అమ్మా. నీ కిష్టం లేకపోతే మానేయొచ్చు నులే. ఇదేమైనా బలవంతమేమిటి? మేనత్తని కనక అన్నాను. నీ ఇష్టం, నీ కొడుకిష్టం?

8 స్నేహ

నీ కోడలి ఇష్టమూను. అయినా నాకెందుకు. అనకూడదులే" అంది కమల.

"పిల్లలదగ్గర పెళ్ళిమాట లెందుకన్నాను కాని నేను మాత్రం ఏమన్నానే" అంది లక్ష్మమ్మగారు.

"అయినా అనడం తప్పు. చూడ్డానికి వచ్చినదాన్ని చూసినట్లే ఉండాలి. ఇలాంటివి తెచ్చిపెట్టుకోకూడదు" అంది కమల.

తనంటే తల్లి కిష్టంలేదన్న సంగతి కమలకు బాగా తెలుసు.

పార్వతి కలగచేసుకుని "పో నీ యం డత్తయ్యా. వదినగా రేదో సరదాకన్నారు. రండి వదినా. మీ అన్నయ్య క్రొత్తగా తీయించుకున్న ఫోటో చూద్దురుగాని" అంటూ కమల చేయిపట్టుకుని తీసుకుపోయింది.

వంట అయిపోయింది. భోజనాలు జరుగు తున్నాయి. సుబ్బారావు కోపా న్న భి న యి స్తున్నాడు. చిట్టితల్లి బ్రతిమాలుకుంటోంది.

బొమ్మ సాలోచనగా తన గదిలోకి వెళ్ళి పోయింది.

* * *

లక్ష్మమ్మగారి ఆరోగ్యం చాలాకాలంగా బాగులేదు. చిట్టితల్లిని హైస్కూల్లో చేర్పించే యేట ఆవిడకు ప్రాణం మీదకు వచ్చింది.

ఒకనాడు రాత్రి గడవడం కష్టమను కున్నారు.

రామారావు తల్లిదగ్గర కూర్చుని విచారంతో "అమ్మా, ఏం కావాలే" అనడిగాడు.

ఆవిడ పక్కమీదే చిట్టితల్లి కూర్చుని ఉంది. పార్వతి కాళ్ళు పిసుకుతోంది.

"నీ కోపం లేకపోతే చెబుతానురా" అందావిడ.

"చెప్పమ్మా, నీమీద కోపమేమిటి" న్నాడు రామారావు.

"చిట్టితల్లి పెళ్ళయితే చూసి చచ్చిపోదామని ఉందిరా, నాయనా. లేకపోతే ప్రాణం కూడా పోవడం లేదురా" అంది ఆవిడ నిట్టూర్పు విడుస్తూ.

"అలాగే నమ్మా. దానికేమిటి? నీకు నింపాదిగా ఉంటే అలాగే చేస్తానులే" అని వాగ్దానం చేశాడు రామారావు.

లక్ష్మమ్మ బామ్మ సంతోషంతో కళ్ళుమూసుకుని పడుకుంది. నిద్ర పట్టింది.

ఆవిడ జీవించదని వైద్యులు చెప్పినా ఆయుర్దాయం ఉండడంచేతనో, కొడుకు వాగ్దానబలంచేతనో లక్ష్మమ్మగారు పది రోజులకల్లా లేచి తిరగడం ప్రారంభించింది.

ఆవిడ తిరిగి ఎప్పుడూ చిట్టితల్లి పెళ్ళి ప్రస్తావన చేయలేదు. రామారావు కూడా ఆ విషయాన్ని తలపెట్టలేదు.

* * *

కొన్ని రోజులకే దూరపు బంధు వొకాయన చిట్టితల్లికి పెళ్ళి సంబంధాన్ని తెచ్చాడు. సంబంధం అన్ని విషయాలా బాగానే ఉంది.

వరుడు బియ్యే చదువుకుంటున్నాడు. అందమైనవాడు. ఒక్కడు పిల్లవాడు. పది ఎకరాల వసతి ఉంది. తండ్రి కలెక్టరాఫీసులో సిరస్తాదారు.

తల్లికి చేసిన వాగ్దానం మనస్సులో మన్న రామారావు వెంటనే వద్దనలేకపోయాడు.

పార్వతి నడిగాడు.

పార్వతికి విషమ పరిస్థితి. రామారావుకు తల్లంటే ఉన్న ప్రేమ, గౌరవము ఆవిడకు బాగా తెలుసును. లక్ష్మమ్మగారి కోరికా తెలుసు. భర్త వాగ్దానమూ తెలుసు.

"మీ రేం చేసినా నా కిష్టమే" అంది పార్వతి పైకి చిరునవ్వుతో.

తల్లి నడిగాడు రామారావు.

"నీ ఇష్టానికి నే నెప్పుడైనా కాదన్నానురా? నాకేమిటి? కాటికి కాళ్ళు చాచుకుని ఉన్న దాన్ని."

"ఈ ఈడులో పెళ్ళి చెయ్యడం మంచిదని చెప్తావా, చూసి సంతోషిస్తాను. లేదా మహా బాగు."

"నువ్వేలా చేసినా సరే, బాబూ, నేనేమీ చెప్పను" అంది లక్ష్మమ్మగారు.

బాగా అన్ని నాలుగుసార్లు ఆలోచించుకుని ఒక నిర్ణయానికి వచ్చాడు రామారావు.

పెళ్ళయితే మాత్ర మేమిటి? చదువు చెప్పించుకో వచ్చును. రామారావు కొంత ఊరటపడ్డాడు.

చిట్టితల్లి పెళ్ళయింది.

బామ్మ తపస్సు ఫలించింది.

* * *

పెళ్ళయిన తరువాత వియ్యంకుడుగారు రామారావుకి వ్రాసిన ఉత్తరంలో "ఎవరి ఇష్టం వాళ్ళది. ఈ కాలపువాళ్ళు మనం చెప్పినట్లు వింటారంటే ఎక్కడిమాట?

"చి॥ సౌ॥ కోడలుకి చదువు తనే చెప్పుకుంటాననీ, స్కూల్లో వద్దనీ అబ్బాయి అంటున్నాడు. మీకు తెలియపరచాను. మీ ఇష్టం" అని ఉంది.

* * *

చిట్టితల్లి హైస్కూల్లో చేరలేదు.

మనమరాలికి పిల్లాడు కలిగేదాకా బామ్మ ఇహలోకాన్ని విడిచిపెట్టలేదు.

# విజ్ఞాన పురోగతి: శబ్దవేగంమించి ప్రయాణం

శ్రీ వసంతరావు వేంకటరావు

ఈనాటి మానవుడు రాకెట్టు విమానం మూలంగా శబ్దవేగాన్ని మించిన వేగంతో ప్రయాణం చేయగలుగుచున్నాడు. శబ్దవేగం మించి ప్రయాణమన్నాం. శబ్దవేగమంటే?

ఊరినుండి ఊరికి మనుష్యులు ప్రయాణం చేసినట్లే, రోడ్లమీద మోటార్లు, బండ్లు పరుగెత్తినట్లే, చప్పుడుకూడా గాలిలో ప్రయాణం చేస్తుంది. గాలిలో శబ్దం వ్యాపించడానికి కొంతకాలం అవసరమన్న విషయాన్ని చాకిరేవుకి కొంత దూరంగా కూర్చొన్న వారెవరైనా సులభంగా కనిపెట్టవచ్చును. బట్టను రాతిమీద కొట్టినప్పుడు శబ్దం జనిస్తుంది. దూరంనుంచి చూస్తూన్నవారికా శబ్దం వెంటనే వినిపించదు. రాతిబండమీద బట్ట పడగానే పుట్టిన శబ్దం చాకలివాడు చేతిని మీదికెత్తినప్పుడు మాత్రమే వారికి వినిపిస్తుంది. బట్టను కొట్టి, మీదికెత్తేలోపుగా రాతిబండనుండి శబ్దం ప్రయాణంచేసి వచ్చినట్లూహించాలి.

సామాన్య పరిస్థితులలో నిమిషానికి 12 మైళ్ళ సుమారు వేగంతో శబ్దం అన్నివైపులా వ్యాపిస్తుంది; అంటే, ప్రతి గంటకి సుమారు 720 మైళ్ళ దూరం ప్రయాణం చేస్తుంది. ఒక చోట పుట్టిన శబ్దం తీక్ష్ణతలో తగ్గిపోకుండా వ్యాపించినట్లయితే మద్రాసులో తుపాకి పేల్చిన తరువాత ఒకటిన్నరగంటలకు కాని కలకత్తాలో వినిపించదు. మద్రాసులో పుట్టిన తుపాకి చప్పుడు ఈ ఒకటిన్నర గంటల కాలంలోను మద్రాసునుండి కలకత్తాకు ప్రయాణంచేస్తూన్నట్లు భావించాలి.

ఒక స్థలంనుండి మరొకస్థలానికి మనం ప్రయాణం చెయ్యడానికి కొంతకాలం పట్టుతుంది. నడిచేవారు గంటకి నాలుగు మైళ్ళు పోతే, సైకిలు గంటకి 12 మైళ్ళు, మోటారు కారు గంటకి 60 మైళ్ళు, విమానం గంటకి 200 మైళ్ళు కష్టంలేకుండా ప్రయాణం చేయగలవు. ఈ విధంగా వేగం హెచ్చినకొద్దీ గంటకు 720 మైళ్ళ వేగమైన శబ్దవేగాన్ని మించి ప్రయాణం చేయవచ్చును. ప్రయాణవేగాన్ని ఎక్కువ చెయ్యడానికి విజ్ఞానులలో అనేకులు అనేకమైన పాట్లు పడ్డారు.

తనతోపాటు భూతలంపై జీవిస్తూన్న మృగాలను తన సహాయానికై మనిషి చాల కాలంనుండి వినియోగిస్తున్నాడు. మానవుని ప్రయాణశ్రమను భరిస్తూన్నవి చాలవరకు పశువులు. యాన వాహన సౌకర్యాలకై ఆదినుండి మానవుడు తాపత్రయపడుతూ వచ్చేడు. మానవ బలంకన్న పశుబలం ఎక్కువ. కాని, దూరప్రయాణానికి గాని, శీఘ్ర ప్రయాణానికి గాని పశుబలమైనా అంతగా ఉపచరించదు. బండ్లు, రథాలు విరివిగా వాడుకలో నుండేవి. కాని, యంత్రాలను తయారుచేయాలన్న వాంఛ ప్రాచీనులకు ఉండేది. గ్రీసు దేశస్థులలో

కొందరు విజ్ఞానులు నీటిఆవిరిచేత నడిచే చిన్నచిన్న యంత్రాలను నిర్మించేరు. అవి ఎక్కువగా విలాసానికేగాని వినియోగానికి కాదు.

ప్రకృతిలోనున్న వస్తువులను సంగ్రహించి, మన పని వాటిచేత చేయించుకోడానికై మానవ హృదయంలో సహజంగా నుంటూన్న కోరిక పదిహేడవ శతాబ్దంలో ఒక రూపం ధరించింది. సేవరే అను విజ్ఞాని ఆవిరియంత్రాన్ని తయారుచేసి యంత్రయుగాన్ని ప్రవేశపెట్టేడు. మరి 70 సంవత్సరాలకి ఆవిరి ఇంజన్‌లో నున్న లోపాలను సవరించి, చక్కగా పని చేసే యంత్రాన్ని జేమ్స్ వాట్ నిర్మించేడు. అదైనా గంటకి 20 మైళ్ళ రేటున నడవడం కష్టమయేది.

ఆవిరియంత్రంయొక్క సామర్థ్యం తక్కువ. పెట్టుబడికి తగిన ప్రతిఫలంలేదు. రద్దు ఎక్కువ. అందుచేత నూనెతో నడిపే యింజన్లను సుమారు అరవైఏండ్ల క్రితం డీసెల్ విజ్ఞాని నిర్మించేడు. అతను నిర్మించిన మొట్టమొదటి ఇంజను పేలిపోయింది; డీసెల్ చచ్చినంత అయింది. అయినప్పటికీ భయపడి తన పని విడిచిపెట్టకుండా, నాలుగైదేండ్లు గట్టిగా కృషిచేసి తుదకు సాధించేడు. "డీసెల్ కార్లు" అను చిన్న రైలుబండ్లు తుని, రాజమహేంద్రవరం మధ్య తిరుగుచుంటాయి. వాటి వేగమైనా ఆవిరిఇంజన్ల వేగంకన్న అట్టే ఎక్కువలేదు.

ఈ శతాబ్దంలో బాగా వాడుకలోనికి వచ్చేయి పెట్రోలు ఇంజన్లు. ఆవిరి ఇంజన్లకన్న పెట్రోలు ఇంజన్లు బాగా పనిచేస్తాయి; ఎక్కువ వేగంతో పోగల సామర్థ్యముంది. మంచి మోటారుకార్లు గంటకి 80, 90 మైళ్ళ వేగాన్ని అందుకోగలవు. అయినప్పటికీ మనిషికి తృప్తి లేకపోయింది. మేఘాలమీద ఇంకా వేగంతో పరుగెత్తాలనిపించింది; పక్షిలాగ తనుమాత్రం ఎగరలేనా అనిపించింది. హనుమంతునివలె సముద్రం దాటాలని, పక్షులను అనుకరిస్తూ రెక్కలు కట్టుకొని ఎగరాలని అనుకొన్నాడు. గాలికన్న బరువైన వస్తువు లెట్లు గాలిలో తేలగలవని ప్రశ్నించుకొన్నాడు. అట్టి ప్రయత్నాల వల్ల నూరేండ్లక్రితమే ఆవిరిబలంతో ఒక విమానాన్ని స్ప్రింగ్ ఫెలో అను విజ్ఞాని ఎగరవేసేడు. అది 40 గజా లెగిరింది. కాని, మనిషి కూర్చున్న మొదటి విమానాన్ని రైటు సోదరులలో ఒకడగు ఆర్విల్లీ రైటు డిసెంబర్ 1903 లో నడిపేడు. ఆ విమానం 12 సెకెండ్లలో 40 గజాల దూరం పోయింది.

నేలమీద ప్రయాణంచేసే మోటారు, రైలు మొదలైన యంత్రాలలో వాటి గమనానికి ఘర్షణచే నిరోధం కలుగుతుంది. గాలిలో ఎగిరే విమానానికి అంతగా నిరోధం లేదు. నీటిలో పడవవలె గాలిలో విమానం ఈదుతుంది. విమానంలో ముందున్న ప్రొపెలర్ తిరుగుతూ చెవులు గింగురుమనిపిస్తుంది. ప్రొపెలర్ ఎంత వేగంగా తిరుగుతూంటే విమానం అంత త్వరగా పోగలదు. కాని, గాలి సముద్రంలో పడవతీరుగా ప్రయాణంచేసే విమానం యొక్క వేగానికికూడ పరిమితిఉంది. సుమారు 600 మైళ్ళ వేగంకంటె ఎక్కువగా అవి పోలేవు.

జెట్ విమానాలు, రాకెట్లు ఈ రకం విమానాలకు శబ్దవేగాన్ని మించిన వేగంతో పోగల

సామర్థ్యముంది. దీపావళినాడు తారాజువ్వలను చూచే ఉంటారు. పేక గొట్టాని కొకవైపు మూసి, మందు దట్టించి, రెండవవైపు సన్నని రంధ్రముంచి, గొట్టాని కొక కొబ్బరిపుల్లను కట్టి, మందు ముట్టించగా, రంధ్రంగుండా మంటతో వాయువులను క్రిందికి చిమ్మి, గొట్టాం మీది కెగిరిపోతుంది. బలంగా క్రిందికి చిమ్మబడిన వేడివాయువులు జువ్వను మీదికి నెట్టడం వల్ల అది ఎగురుతుంది. జెట్ విమానాలలోను, రాకెట్లలోను ఈ సూత్రమే వినియోగమౌతూంది.

రంగురంగుల రబ్బరు బెలూనులను అనేక ఆకారాలలో తయారుచేసి అమ్ముచున్నారు. వాటిలో గాలి ఊదడంచేత ఎక్కువ ఒత్తిడి గల గాలి లోపల బంధింపబడిఉంది. కాని, ఆ రబ్బరు అన్నివైపుల ఒకే పరిమాణం గల ఒత్తిడిని అనుభవిస్తూంది. అట్టి బెలూన్లలో పామువలెసన్నంగా పొడవుగానున్న బెలూన్ని భూమిపైపెట్టి ఒక కొనను చిన్న పిన్నుతో గుచ్చగానే పెద్ద చప్పుడుతో గాలి పైకివచ్చి, రెండవవైపు బెలూను పరుగెత్తుతుంది. ఏమంటే, ఒక వైపునుండి బలంగా పైకి వస్తూన్న గాలి దాని కెదుటి దిక్కున అంత ఒత్తిడి కలిగించి బెలూన్ని తోస్తుంది. ఆ ఒత్తిడికి బెలూను పరుగెత్తక తప్పదు. ఇదే విధంగా రాకెట్లు పనిచేస్తాయి.

రాకెట్ల తోకనుండి వేడివాయువు లెంత వేగంతో నిర్గమిస్తే, రాకెట్టు అంత వేగంతో ముందుకి త్రోసికొనిపోతుంది. కాబట్టి నూనె, పెట్రోలువంటివి రాకెట్లకు పనికిరావు. దట్టంగా వాయువుల నిచ్చే తుపాకిమందువంటి ఘన పదార్థాలను రాకెట్ల కుపయోగించవచ్చును. కాని, ఆ పదార్థం క్రమంగా మండేటట్లు ఏర్పాటు చేయుట కష్టం. ఒక్కసారిగా భగ్గుమని ఊరుకొంటుంది; పదార్థం మండుతూంటేగాని రాకెట్టు నడవదు. అందుచేత ద్రవరూపంలో నున్న ప్రాణవాయువుతో ఆల్కహాలును కలిపి రాకెట్లకు వాడుచున్నారు. ఆ మిశ్రమాన్ని అవసరమైనట్లు మండించవచ్చు. మంటలో విడుదల అయే వాయువుల తోకలోని రంధ్రం గుండా నెట్టబడతాయి.

ఆకాశంలోనున్న గాలితో రాకెట్లకు నిమిత్తంలేదు. వాటి గమనానికి కావలసిన శక్తిని వాటి గర్భంలోనే తయారుచేసికొంటాయి. అందుచేతనే గంటకు 750 మైళ్ళ వేగాన్ని మించిన వేగంతో ఆకాశయానం చేయగలవు. శబ్దవేగానికి మించిన ఈ వేగాన్ని "అతి శబ్ద వేగం" అందాము. శబ్దంకన్న వేగతరంగా అతి శబ్దవేగంతో మొదట విమానయానం చేసిన మహానుభావుడు చార్లెస్ యీగరు 1947 అక్టోబర్ 14 వ తేదీని "బెల్ X S-I" అను రాకెట్ విమానంలో అతి శబ్దవేగాన్ని ప్రప్రథమంగా యీగరు అందుకొన్నాడు.

రాకెట్ల యానానికి సహజమైనవి అనేక ప్రతిబంధకా లున్నాయి. గాలిలో ఎగిరే ఏ విమానమైనా సరే గాలి సముద్రంలో పెద్ద సంచలనం కలిగిస్తుంది. టెలిగ్రా మిచ్చినట్లు దాని రాకను ముందున్న గాలికి ఎరుకపరుస్తూ విమానం పోతుంది. తక్షణం ఆ గాలి ఏం చేస్తుందంటే విమానాన్ని ఆహ్వానిస్తూ, విమాన గమనానికి అనుకూలమైన విధంగా ఏర్పాటై ప్రవహిస్తుంది. విమాన మిచ్చిన టెలిగ్రాము శబ్దవేగంతో ప్రయాణం చేస్తుంది కాబట్టి సామాన్య వేగాలతో పోవు విమానాల విష

యంలో గాలి కొంత సహాయం చేస్తుందనే చెప్పాలి. కాని, శబ్దవేగం మించిన ప్రయాణంలో విమాన మిచ్చిన పెలి గ్రాము ముందున్న గాలి కందదు. అందుచేత విమానానికి ముందున్న గాలి ఎట్టి ఏర్పాటు చేసుకోలేదు. విమాన వేగానికి గాలి పీడింప బడుతుంది. ఆ ఒత్తిడి తగ్గక పూర్వమే విమానం వచ్చేస్తుంది. కాగా, ఈ సంపీడిత వాయువులు సిమెంటు గోడకన్న. యినప గోడకన్న ఎక్కువ బలంతో విమానాన్ని విరోధిస్తాయి. దానితోపాటు బలవత్తరమైన అఘాత తరంగాలు (Shock waves) కూడా జరిపిస్తాయి. ఇట్లేర్పడిన వ్యాఘాతాన్ని ఎదుర్కొనడానికి అపరిమితమైన బలం కావాలి. ఒక్క ఉదాహరణ చూడండి:

ఒక విమానం గంటకు 500 మైళ్ళ వేగంతో ఎగరడానికి కావలసిన శక్తి 5,000 హార్సు పవర్లు;

అట్టి విమానమే 600 మైళ్ళ వేగంతో ఎగరాలంటే 20,000 హార్సుపవర్ల శక్తి కావాలి;

అదే విమానం 1,000 మైళ్ళ వేగంతో ఎగరాలంటే 7,0000 హార్సుపవర్ల శక్తి అవసరం.

దీనినిబట్టి శబ్దవేగం మించిన ప్రయాణానికి ఎంత విపరీతమైన శక్తి అవసరమో బోధపడుతుంది.

ఈగర్ నడిపిన మొదటి రాకెట్టు విమానం యొక్క బరువు 5,000 పౌన్లు; దానిలో నున్న మందుయొక్క బరువు 8,000 పౌన్లు. అంత పదార్థంతోను రెండు మూడు నిమిషాలకంటె ఎక్కువసేపు ఎగరలేకపోయింది.

క్రిందటి యుద్ధమందు 1944 జూన్ నెలలో ఇంగ్లండుపై రాకెట్లను జర్మనులు ప్రయోగించారు. V—2 రాకెట్టు 3,000 మైళ్ల వేగంతో ఆకాశాని కెగురుతుంది. 200 మైళ్ల వర కది ప్రయాణం చేయగలదు; సుమారు 60 మైళ్ళ ఎత్తువరకు పోగలదు.

ఈమధ్య మన దేశంలో సంచారం చేసిన ఆంగ్లేయ విజ్ఞాని విటిల్ (Whittle) జెట్ విమాన నిర్మాణంలో ఎక్కువ పరిశ్రమ చేసిన మహనీయుడు. దైనందిన రాకపోకలకు జెట్ విమానాల నుపయోగించడానికై పరిశోధనలు చేస్తున్నాడు. అవి సిద్ధిస్తే, మన దేశంనుండి లండన్‌కు 10 గంటలలో వెళ్ళ వచ్చును; ఒక్కరోజులో భూదేవికి ప్రదక్షిణం చేసిరావచ్చును.

రాకెట్ల ప్రయోజనం ఎంతైనా ఉంది. రేడియో కంట్రోలువల్ల నడిపిన రాకెట్లలో సున్నితమైన యంత్రాలు పెట్టి, రాకెట్టును ఆకాశగర్భంలోనికి పంపి, ఆ మీది మండలాల లోని పరిస్థితులను కచ్చితంగా తెలిసికొంటున్నారు. 60 మైళ్ళ ఎత్తువరకు ఆకాశాన్ని రాకెట్ల సహాయంతో శోధించగలిగేరు. చంద్రలోకానికి ప్రయాణం గానున్న రాకెట్లు తయారౌతున్నాయి. శబ్దవేగం మించి ప్రయాణం చేయకలిగిన మానవుడు లోకలోకాలు చుట్టి వచ్చేటట్లుంది. *

---

*ఆలిండియా రేడియో మద్రాసు కేంద్రంవారి సౌజన్యంతో.

# కుటుంబ సమావేశం


రచన :
'విముక్త''

అనువాదం :
మూర్తి


హ్యూనాన్ రాష్ట్రంలోని లూటింగ్ జిల్లా లిటియన్‌మా గ్రామ పెద్దైన లీచే మింగ్ ఆందోళన చెందాడు. తన సోదరులలో ఒకడు తప్పక సైన్యంలో చేరతాడని అధికారుల కతను తెలియజేశాడు. కాని ఏ సోదరుడు చేరతాడో నిర్ధారించలేదు. తన పై అధికారులకు మాట యిచ్చిన తర్వాత మాట పోగొట్టుకోడానికి వీల్లేదని అతనికి తెలుసు. అందులోనూ తనను అంత ముఖ్యమైన పనికి నియోగించిన తర్వాత అసలే వీల్లేదు. తన తమ్ములలో ఒకడు తప్పకుండా చేరతాడని ఆతడు ఆశించాడు. తన సోదరుల్ని, వృద్ధులైన మాతా పితలను తల్చుకునే సరికి అతని కనుబొమలు ముడివడ్డాయి. అతనికి స్పష్టమైన ఊహేమీ తోచలేదు. ఇంటికి చేరేసరికి అతని తమ్ములు కట్టెలు తేవడాని కడవికి పోయారు. ముసలి తలిదండ్రులు మాత్ర మున్నారు.

"సీన్ సమావేశంలో మీరు చర్చించిందేమిటి?" తండ్రడిగాడు.

"ఏముంది. జపానువాళ్ళోడింపబడతారనీ, ఇతర దేశాలు గూడా మనతో సహకరించబోతున్నాయనీ, మన నాలుగో సైన్యం ఎదురుదాడి సన్నాహాలు చేస్తోందనీను.''

"విజయ మెప్పుడు లభిస్తుంది?" వృద్ధులిద్దరూ ప్రశ్నించారు.

"ఏరోజునైనా లభించవచ్చు. నాలుగో సైన్యాని కింకా సైనికులు కావాలి.''

"సహజంగాను'' వృద్ధు డేకీభవించాడు.

"మాటలతోటయ్యే పనిగాదు. ప్రజలు సైన్యంలో చేరాలి" అంటూ లీ తన తలిదండ్రుల వైపు చూచాడు.

"ఇంకా చాలామందిని బలవంతంగా సైన్యంలో ఎందుకు చేర్చకూడదు?" అలా చేస్తే సైన్యం బలపడుతుందని వృద్ధుని ఊహ.

"ఇపుడల్లాకాదు. బలవంతంగా చేర్చడమిక లేదు. ప్రజలు వాళ్ళంతట వాళ్ళు స్వయంగా చేరతారు. ఎక్కువమంది పురుషు లున్న కుటుంబాలున్నాయి." లీ ఎప్పుడూ కూడా ఉన్నట్లుండి ఏదో చెప్పేస్తాడు. సమయం మించిపోనివ్వలేదు.

వృద్ధమాతలో సంచలనం గలిగింది.

"నాలుగో సైన్యానికి సైనికులు కావాలీ? ఎక్కువ మంది పురుషులున్న కుటుంబా లున్నాయీ? అయితే మమ్మల్నేమిచెయ్యమంటావ్ నువ్వు? మన వంతుగూడా తీర్చాలంటావా, ఏం?''

"ఎందుకు తీర్చక్కర్లేదు?"

లీ ఇంకా పూర్తి చేయకముందే తల్లి అడ్డు తగిలింది. "నువ్వు చేసేదేమిటి? అది ప్రజా సేవ కాదా? ప్రభుత్వోద్యోగం కాదా?''

"జిల్లా అధికారి సోదరులకు గూడా తప్పదు. ఇప్పుడంతా సమానమే.'' లీ తన కుటుంబ విషయాల్లో లౌక్యంగా వుండలేదు.

తల్లి దవడ కంపిస్తోంది. తన కాకల్లే దన్నాడు తండ్రి. వారిని కష్టపెట్టానని తెలుసు కున్నాడు లీ. "ఏమీ భయపడక్కర్లేదు. చాలామంది చేరుతున్నారు సైన్యంలో. బల వంతంగా సైన్యంలో జేర్చే సమయంలో కుటుంబంలో ఒక్కడే మగవాడున్నవాడు కూడా చేరవలసివచ్చేది. ఇపుడో ఒకవికంటె ఎక్కువుంటేనే ఒకడిని కావాలంటున్నాం. ఇద్దరు ముగ్గు రింకా ఇంటివద్దే వుంటారు.''

ఆ రాత్రి అసెంబ్లీ సమావేశమనే సంగ తతనికి జ్ఞప్తికొచ్చింది. "గడబిడ చెయ్య కండి. మిమ్మల్ని వెళ్ళమని ఎవరూ అడగడం లేదుగా. పిల్లల్నే అడిగి ఎవరు వెళ్ళడాని కంగీకరిస్తారో నిర్ణయించుకో వచ్చు గా. ఇతరులకు మన మాదర్శవంతులుగా వుండాలి. మనం వెనుక బడటం సిగ్గుచేటు.''

లీ అసెంబ్లీసభలో స్వచ్ఛందంగా సైన్యంలో చేరుటకు న్యాయమైన, క్రమమైన పద్ధతులను నివేదించాడు. ముఖ్యంగా శాశ్వతోద్యోగస్థుల కుటుంబాల్లోనివారు మినహాయింపబడటానికి వీల్లేదని ఉద్ఘాటించాడు. ప్రజలకు మార్గదర్శ కంగా వుండటానికి తన సోదరులలో ఒకడు తప్పక చేరతాడని నొక్కిచెప్పాడు. సభలో హర్షధ్వానలు ప్రతిధ్వనించాయి. ఆ సందడికి ఒక మూల గోడ కానుకునివున్న లీ తండ్రి లేచి కూర్చున్నాడు. అతని కిదివరకే చాలా విసుగుపుట్టింది. ఇంతవరకూ తన కొడుకు చెప్పేదంతా అతను నిరాసక్తితోనే విన్నాడు. కొంప మునిగిపోయిందనుకున్నాడు. సభలోని చప్పట్లు అతనికి లెంపకాయలు తగిలిన ట్లని పించాయి. అతనిలో కలిగిన సంచలనం అక్కడున్న వారిలో చాలమంది దృష్టి నాక ర్షించింది. ఆ తండ్రి కొడుకుల పరస్పర వ్యతిరేకత చాలా క్రొత్తగా వుంది. గ్రామ పెద్ద నివేదిక తామందరినీ మోసగించి బుట్టలో పెట్టడానికేమో ననిపించింది వారికి. "సరే! చూద్దాం! గ్రామ పెద్ద తమ్ముడు చేరితే మనమూ చేరదాం" అనుకున్నా రక్కడంతా.

వృద్ధు డింటికి చేరాడు. తన పెద్దరికమంతా మట్టిగలిసిన ట్లనిపించిం దతనికి. అతని భార్య ఆత్రంతో వేసే ప్రశ్నలకు "వా డప్పుడే మా టిచ్చేశా"డని చప్పగా సమాధానం చెప్పాడు.

ఆమె ఏడవడం, గొణగడం మొదలెట్టింది. "న్యాయం ట—న్యాయం—నా కొడుకుల్ని తీసుకుపోవడం న్యాయమా? ఈ న్యాయం పాడుగాను! ఈ సభ పాడుగాను!"

రెండో కొడుక్కి సిపాయిగా చేరడం ఏమాత్రం ఇష్టంలేదు. కాని అతనే వెళ్ళవలసి వస్తుందేమో. అందుకని "అతను మాటయిస్తే అతన్నే వెళ్ళమను. అతని మాటలను పాటిం చక్కర్లేదు" అన్నాడు.

మూడో కొడుకు, నాల్గో కొడుకు ఏమీ మాట్లాడలేదు. వాళ్ళలో ఎవరైనా వెళ్ళవలసి వస్తుందేమో వాళ్ళకు తెలియదు. లీ మీటింగ్ రాత్రి ఇంటికి చేరుకునేసరికి తల్లి "నేనేం

చెయ్యగలమా? నా పెద్దకొడుకును తీసుకుపోయారు. నా చిన్న కొడుకులను కూడా తీసుకెడతారట. ఓ భగవంతుడా! నీకు దయలేదా? నా కుటుంబం విచ్ఛిన్నమౌతోంది" అవి ఏడుస్తోంది.

గడపలో అడుగుపెడుతూనే అతను తల్లితో "మన కుటుంబా న్నెవరు విచ్ఛిన్నం చేస్తున్నారు? వ న్నెవరు తీసుకుపోయారు? నే నీ్న దగ్గరే వున్నాగా...." అన్నాడు. అయినా ఆమె ముఖం చూసేసరికి అతను కొంచెం మెత్తపడ్డాడు. తమ అభిప్రాయాలను మార్చుకోవాలని ఇతరులందరికీ బోధించేవాడు. కాని తన తల్లిని గూర్చిన తన అభిప్రాయా న్నతడు మార్చుకోలేక పోయాడు.

"ఏడుపు మాని నే చెప్పేది వింటావా?" తల్లి చాలాసేపు కళ్లుతిరిగే పర్యంతం ఏడ్చి ఊరుకుంది. లీ కూర్చుని చెప్పాడు: "ఎందుకు నువ్వు బాధపడుతున్నావ్? నాలుగో సైన్యాన్ని చూడు. అందులోని వా ళ్ళందరికీ తలిదండ్రు లున్నారు తెలుసా? వాళ్ళంతా వెళ్ళి యుద్ధం చెయ్యడంలా? మనంమాత్ర మెందుకు చేయకూడదు? యుద్ధం చెయ్యొచ్చేసరి కెవళ్ళో రావాలేం? నాలుగో సైన్యంలోని సైనికుల్లో కొంత మంది వారి కుటుంబాల్లో ఏకైక పుత్రులే కూడా. పూర్వపు రోజులు జ్ఞాపకంలేవు, నీకు? ఎలా బ్రతికేవాళ్ళమో, బందిపోట్లు మన్నెలా హింసించేవారో. ఒకరోజున బందిపోటు దొంగలు మనింటిని తగులబెట్టడానికి వచ్చినపుడు చిన్నతమ్ముడిని దాచేశావ్ కూడా జ్ఞాపకం లేదూ? వా దేడుపు కూడా మాపలేకపోయాడు. నువ్వెంతో భయపడిపోయావప్పుడు. నీ గుండె పగిలిపోతుందేమోనని కూడా అన్నావ్. ఇది వరకు మన శ్రమంతా ఇతరులకోసరం పడేవాళ్ళం, ఇపుడు మనం కష్టపడేది మనకోసరమేగా. మనం ప్రశాంతంగా జీవించడానికే. ఈ మార్పంతకీ కారణ మెవరనుకుంటున్నావ్? ఆ నాలుగో సైన్యమే. అదంతా మర్చిపోయుంటావ్ నువ్వు."

తల్లి నిజంగా మర్చేపోయింది. ఇప్పుడంతా జ్ఞాపకం తెచ్చుకుంది. అయినా తన కొడుకుల్ని యుద్ధంలోకి పంపడాని కామెకి కష్టంగానే వుంది. పసిగ్రుడ్డునుంచి పెంచిందామె. "సరే. ఒకడిని తీసుకెళ్ళండి మరి" అంటూ "అభివృద్ధి విరోధకుల కాలంలో బలవంతంగా సైన్యంలో చేర్చేవారు. అప్పటికి యిప్పటికి తేడా ఏమిటి" అ నడిగింది.

"తేడా ఏమిటా?" లీ తన తల్లియొక్క అజ్ఞానావధి నర్థం చేసుకోలేకపోయాడు. "ఇదివరకుండే ప్రభుత్వకాలంలో సైనికులకోస మెవరైనా గ్రామపెద్దల వద్దకు, భూస్వాముల వద్దకు వచ్చేవారా? ఏ విషయాన్ని చర్చించడానికైనా అసలు సభలే వుండేవికాదు. ఇప్పుడంతా సబబుగాను, న్యాయంగాను జరుగుతోంది. అందరూ సమానమే. పైగా పూర్వపు ప్రభుత్వమైతే నీ నలుగురి కొడుకుల్లోను ముగ్గుర్నీ తీసుకుపోయేది."

ఆ సంగతి నిజమని తల్లికి తెలుసు. కాని అంగీకరించదు. "ఏమో. వాళ్లు నా కొడుకుల్లో ఎవర్నీ తీసుకుపోలేదు." ఆమె నొక్కి చెప్పింది.

"అల్లాగేం? నాలుగో సైన్య మింతలో రాకపోతే నీ కొడుకుల్నందర్నీ వాళ్లు తీసుకుపోయుండేవారు."

"ఐతే నీ తండ్రి సంగతేమిటి? ఆయన అన్నదమ్ముల్లో ఎవరూ సైన్యంలో చేర్చబడ లేదుగా."

"చాలా ప్రయాసపడ్డావ్ లే. వాళ్ళ రోజుల్లో జపానువాళ్లు యుద్ధానికి రాలేదన్న సంగతి మర్చిపోయావ్ పాపం." తల్లి విషయంలో లీ ఇక ఓపికపట్టలేకపోతున్నాడు.

ఆమె చివరంటా దెబ్బలాడటానికే నిశ్చ యించుకుంది. "అభివృద్ధి నిరోధకుల పాల మన్నా ఇంత శాంతంగాను జీవించేవాళ్ళమని నా నమ్మకం."

లీ తన తల్లితో 'పో అవతలకి' అని చెప్పి వుండేవాడే. కాని తండ్రి ఇదంతా వింటూనే వున్నాడు. తన భార్య మితిమీరి ప్రవర్తించిం దని అతడు భావించాడు. "ఇప్పుడా అభివృద్ధి నిరోధకులే పరిపాలిస్తుంటే జీవితం దుర్భ రంగా వుంటుంది. ఆ సంగతి తెల్సుకో. కొన్నా శ్శోపికపట్టి పరిస్థితులు చక్కబడతాయో లేదో చూడాలి" అన్నాడు.

లీ కోర్కె ఆకాశమంటింది. తండ్రి సరైన మార్గంలో మాట్లాడుతున్నాడు. ఇక తను చేయవలసినదల్లా తల్లి నొప్పించడమే.

"ఏమిటి, న్యాయము, ధర్మమూను? నలుగురు కొడుకుల్లోను ఇద్దరు వెళ్ళవలసివస్తే నేను వెళ్ళాలి? ఒక ఆదర్శాన్ని చూపదల్చుకుంటే నువ్వే వెళ్లు. నువ్వు రిపోర్టు చేశేశావ్. నువ్వు వెళ్ళగలవు. గ్రామాధికారిగాగాని, నాలుగో సైన్య సైనికునిగాగాని నువ్వే సేవ చెయ్యి. మాకేమీ సంబంధం లేదు'' రెండో కొడు కందుకున్నాడు.

"నువ్వు చాలా తెలివైనవాడవ్. చాలా చెప్తావ్ లే'' లీ క్రోధోద్రేకంతో కసిరాడు.

"మాకు వెళ్లాలని లేదు. నిర్బంధించి నువ్వు పంపలేవు. సైన్యంలో చేరడం స్వచ్ఛందమని నువ్వే చెప్పావ్‌గా'' తమ్ముడు నొక్కి చెప్పాడు.

"వినవివాళ్ళని బలవంతపెడతాము" లీ నోటంట మాటలు జారిపోయాయ్. కాని అది తప్పు అని అతనికి తెలుసు.

"నిజమే. నేను ఒక కొడుకును మాత్రమే త్యాగం చేయగలను....నిన్నే....నీ కిష్టమైతే నువ్వు సైన్యంలో చేరవచ్చు.'' తల్లంది లీతో.

విషయాన్ని విడమర్చి బోధించాలని లీ అనుకున్నాడు. కాని నిష్ప్రయోజనమౌతుం దని అతనికి తెలుసు.

"నేను సంతోషంగా వెడతాను. కాని నా పైఅధికారి నేను వెళ్లడానికి సమ్మతించడు."

అతనికి నిజంగా వెళ్ళాలనే వుంది. అత నను కున్నాడు "అబ్బ—ఎంత సిగ్గుచేటు—ఒక్క కుటుంబాన్నే ఒప్పించలేకపోయాను. మధ్యతరగతి ప్రజల మనస్తత్వం—అంతే —సరిగ్గా యోచించలేరు.''

"నీ పైఅధికారి సమ్మతించలేదన్న సంగతి మా కనవసరం. న్యాయం, ధర్మం అంటా వుగా. అవే మన్ని బాధిస్తున్నాయ్. నాకేమీ న్యాయం కన్పించడంలేదు.''

"ఏమంటున్నావ్ '' ఇంకా సంభాషణ కొనసాగించడానికి లీ కిష్టంలేదు. ఇంటివద్ద

ఉపయోగకరమైన పనేదీ చేయలేదతను. వాళ్ళంటే అతనికి విసుగుపుట్టింది. అంతా తన ఇష్టమొచ్చినట్లే జరుగుతుందని ఆశించాడు. ఇంట్లోంచి బైటకువచ్చి తన తొందరపాటుకు విచారించాడు. ఓరిమి కోల్పోయి కోపం తెచ్చుకోవడం చిన్నతనంగా వుంది. తను రిపోర్టు చేసేముందే వాళ్ళ అంగీకారాన్ని పొందియుండవలసింది. లేక తనే చేరతానని చెప్పియుండవలసింది. ఇపుడంతా మించిపోయింది. తన సోదరుడు వెళ్ళకపోతే ఏమి కానున్నదో. అసెంబ్లీ సభలోని ప్రేక్షకుల ప్రతిక్రియ నూహించుకున్నాడతను. ఒకవేళ వాళ్ళ నణచివేయగల్గినా దర్మిలా కలిగే రాజకీయ ఫలితాలనుకూడా తల్చుకున్నాడు. అతను గ్రామంలో చేసే పనంతా పాడైపోతుంది. నడుస్తూనే ఆలోచిస్తున్నాడు. అసెంబ్లీ సభాభవనాన్ని చేరేసరికి ఒక ఆలోచన అతనికి తట్టింది.

మూడోరోజున లీ తండ్రికి జిల్లా అధికారియైన వూంగ్ వద్దనుంచి ఒక జాబు వచ్చింది. వూంగ్ చాలా బీదకుటుంబంలోంచి పైకి వచ్చాడు. ఇప్పుడతడు జిల్లా అధికారి. అతనంటే వృద్ధ లీకి అత్యంతమైన గురి. వృద్ధ లీ ఎప్పుడు అసెంబ్లీ సమావేశానికి వెళ్ళినా వూంగ్‌ను కలుసుకోందే రాడు. వూంగ్‌కూడా అతనియెడల చాలా మర్యాదగా వుంటాడు. ఎప్పుడూ అతను లీ పెద్దకొడుకైన లీచేమింగ్‌ను పొగుడుతాడు. ఎప్పుడు వూంగ్ ఇంటికి వెళ్ళివచ్చినా లీ తానేదో అత్యంత గౌరవాన్ని పొందినట్లుగా సంతోషిస్తాడు. అసెంబ్లీ హాల్లో గ్రామస్థుల సమక్షంలో వూంగ్ లీలు ఒకరికొకరెదురెదురుగా కూర్చుని సంభాషించుకునేవారు. అలాచేయడం లీకి మిక్కిలి సంతోషం. భూస్వాములు బానిసలవలె అధికార్లను కొలుస్తూ తన్ను మాత్రం నీచంగా చూస్తుండే పూర్వపు రోజులను స్ఫురణకు తెచ్చుకున్నాడు లీ. నిజంగా రోజులు మారిపోయాయ్.

జిల్లా అధికారి రాజకీయ వాతావరణాన్ని గూర్చి వ్రాశాడు. ప్రజలు సైన్యంలో న్యాయమైన, సక్రమమైన మార్గంలో ఎట్లా జేర్చబడుతున్నారో వివరించాడు. అనువంశిక కుటుంబాలను వినాయించడానికి వీల్లేనందుకు గల కారణాలను చూపాడు. వాటిలోనే లూటంగ్ కుటుంబాలు చాలా వున్నాయి. తన విధిని తాను నిర్వర్తించకుండా ఇతరులను ప్రోత్సహించడం తగనిపనన్నాడు. తన బావమరదికి సైన్యంలో జేరమని సలహా యిచ్చాడు. అలాగే జిల్లా అధికారి సూ కూడా తన తమ్ముని సైన్యంలో జేర్చాడు. 'నాతో ఏకీభవిస్తావని నమ్ముతున్నాను' అంటూ వూంగ్ తన లేఖ ముగించాడు. తన ఆలోచనా వూంగ్ ఆలోచనా ఒకటే అయినందుకు వృద్ధుడు కౌతుకం జెందాడు. "నిజమే. నేను నీతో ఏకీభవిస్తాను. నీ సోదరుని నువ్వు పంపినపుడు నా కొడుకును నేనూ పంపవలసినదే" అతడు నిట్టూర్చి తన కుమారులలో నొకరిని సైన్యంలో జేర్చుటకు నిశ్చయించుకున్నాడు. "నా అంతరాత్మ శాసించిందిగనుక నేనీ పనిచేస్తున్నాను. నాలుగో సైన్యంలో జేరటానికి కాకపోతే నేను పంపుట కిష్టపడేవాడను కాను. వాళ్ళు మాకు చేసిన సహాయానికి కృతజ్ఞతగా అవశ్యము పంపవలసినదే"అని నిశ్చయించుకున్నాడు వృద్ధుడు. ఈ నిశ్చయ మతని మనస్సునుండి పెద్ద బరువును తొలగించింది. పైగా అతను సైన్యంలో

పాల్గొనుటవలన కలిగే కీర్తి గౌరవాలను, పైనిక కుటుంబా లితరులకు చూపగల్గే ఆదర్శా లను ఊహించుకున్నాడు. తన కొడుకొక రోజున విజయంతో తిరిగివస్తాడు. అదికూడా అతను తన మనోనేత్రంముందు చిత్రించు కున్నాడు. అతని కొడుకు వీరుడౌతాడు! వృద్ధుని కుల్లాస మెక్కువైంది.

ఆనాడు వృద్ధమాతకడ కొక అతిథి వచ్చాడు. అతని పేరు చెంగ్ యంగ్ షాన్. అతనంటే ఆమెకు సోదరభావమూ గౌరవ మూను. ఆమె సుహృద్భావంతో నుండగా అతను సైన్యంలోజేపట ఏవిధంగా మంచిదో బోధించుట మొదలుపెట్టాడు. పూర్వపు ప్రభు త్వంలో వుండే పరిస్థితులకుగల భేదాన్ని సోదా హరణంగా కొన్ని ఘట్టాలను చెపుతూ వివ రించాడు. అభివృద్ధి నిరోధకుల పరిపాలనా కాలంలో నలుగురు కొడుకులుంటే ముగ్గుర్ని బలవంతంగా సైన్యంలోకి తీసుకునేవారు. అదైనా ప్రజల లాభంకోసం కాదు. ప్రభుత్వ లాభంకొరకే. ఇప్పుడో నల్గురిలోను ఒకడినే పంపాలి. అదికూడా ప్రజల సౌకర్యార్థమే. అందుకని పంపించు. వాళ్ళెక్కడున్నా ఏమీ ఫరవాలేదు. వాళ్ళక్షేమం నీ కెప్పటికప్పుడు తెల్పుతూవుంటాను. వాళ్ళవద్దనుంచి జాబులు రాగానే నీకు పంపుతుంటాము. నీ పుత్రప్రేమ నాకు తెలుసు. ఎవరిబిడ్డలంటే వారి కల్లాగే వుంటుంది." అని నచ్చజెప్పాడు.

"అన్నా! నువ్వర్థం చేసుకున్నందుకు, నాకు నచ్చచెప్పినందుకు చాలా సంతోషం. కాని నారెండో కొడుకు వెళ్ళనని మొఅపెడు తున్నాడు. వాడినే తీసుకెళ్ళరని వాడికేం తెలుసు? నా కవిష్టుని పంపడానికి నే నొప్పు కోను." అని సమాధానమిచ్చి తల్లి దుఃఖించ టం మొదలుపెట్టింది.

ఆ సమయంలో వూంగ్ వ్రాసిన లేఖ చేత్తో పట్టుకుని తండ్రి వచ్చాడు. చెంగ్‌తోపాటు తనుకూడా ఆమె సోదరుస్తూ వూంగ్ వ్రాసిన దంతా ఆమెకు వివరించి చెప్పాడు.

"నేనేంచేసేది ? నా యిష్టమొచ్చినట్లు నేను చెయ్యలేనుగదా. అసలు ప్రశ్న ఎవరు వెళ్ళాలీ అనేదే. తలిదండ్రులమైన మనం మన నిర్ణయాలను వాళ్ళమీదరుద్దడం మంచిదికాదు. వాళ్ళనే నిర్ణయించుకోనివ్వాలి. నాల్గోకొడుకు నా హృదయంలో హృదయం. అతను పోడా నికి వీల్లేదు. అతనువెడితే నేను బ్రతుకలేను" అని తల్లి ఖచ్చితంగా చెప్పింది.

వృద్ధుడేమీ జవాబివ్వలేదు. పెద్దవాళ్లు ముగ్గురికీ వివాహాలయ్యాయి. వాళ్లపోతే పెద్ద సమస్య బయలుదేరుతుంది. కనుక ఆఖరు వాడినే పంపడం ఉత్తమమని అతడు యోచిం చాడు. పైగా ఆఖరువాడు చురుకైనవాడు. ఎక్కడికైనా పోగలడు. ఏపనైనా చేయ గలడు.

ఆరాత్రి కుటుంబ సమావేశానికి హాజరు కావడానికి లీ టేమింగ్‌ను పిలుచుటకు మూడవ కొడుకును పంపించారు. ఈసమస్య పరిష్కా రం కాబోతుందని లీకి తెలుసు. ఆరాత్రి నిశ్చిత మైనది. తన తండ్రికూడా అట్లా గేభావిస్తాడు. కాని తల్లి అడ్డుచెపుతుందని అతను అను కున్నాడు, రెండోవాడు వెళ్ళడానికి కంగీక రించడని అతనికి పూర్తిగా తెలుసు. అందు కని అతను మూడోవాడితో చర్చించి సమా వేశానికి తగిన వ్యూహాన్ని పన్నాడు. మూడో కొడుకు న్యాయస్థుడు. అతనిష్టపడతాడు. సహకరిస్తాడు. పెద్దకొడు కేది సూచిస్తే అత నది చేస్తాడు.

కుటుంబ సమావేశంలో ఈ విషయాన్నం తనీ విడమర్చి వివరించాడు. తండ్రి కూడా సాయపడ్డాడు. స్వల్ప కాల విశ్రాంత్యనంతరం మూడో కొడుకు "బాబా! నేను వెడతా" నన్నాడు. అతను వెళ్ళడం ఉచితం కాదని తలిదండ్రు లభిప్రాయపడ్డారు. తండ్రి నాల్గో కొడుకు వంక, తల్లి రెండో కొడుకు వంక సాభిప్రాయంగా చూచారు. నాల్గో కొడుక్కి ధైర్య మెక్కువ. "అన్నయ్య లందరికీ పెళ్ళ యింది. భార్య లున్నారు. కాబట్టి నేను వెళ్ళ డం అత్యుత్తమం. ఇతర కుటుంబా లన్నిటి లోను కనిష్ఠులే పోతున్నారు. వాళ్ళందరి తోపాటు వెళ్ళడానికి నే నేనాడో నిశ్చయించు కున్నా" నని తేల్చేశాడు. తల్లి అరిచి బొబ్బలు పెట్టడానికి సిద్ధమయింది. తండ్రి, "నీది రైటు. మా వంశానికి వన్నెదెచ్చావ్ నువ్వు. చాలా సంతోషం" అన్నాడు కనిష్ఠునితో. అదంతా సబబేనని తల్లికి తెలుసు. కాని తన హృదయంలో హృదయమైన ఆఖరు కొడు కుని వదిలి ఆమె మనలేదు. "రెండోవాడిని వెళ్ళమనండి. ఎట్లా తప్పించుకోవాలా అని ఇన్నాళ్ళనుండీ ప్రయత్నిస్తున్నాడు. వాడు మోసకారి. వాడిని పొమ్మనండి. ఆఖరువాడి కింకా పెళ్ళైనా కాలేదు. వాడిని పంపడ మేమిటి?" తనకు తోచినట్లు మాట్టాడింది.

"మాకు మంచి వాళ్లు కావాలి. మోసకారు లక్కర్లేదు." ఈ విషయా న్నింతటితో ముగించే వుద్దేశంతో లీ అన్నాడు.

"మళ్ళీసారి నాకు అవసరమనీ, న్యాయమనీ తోచినపుడు నేనూ వెడతాను" అన్నాడు మెల్లిగా రెండోవాడు.

"ఏమీ ఖంగారు పడకమ్మా! రెండేళ్ళు పోనీ. పెళ్ళి చేసుకోడానికి నాలుగోవాడి నింటికి పంపి వాడి స్థానం నే నాక్రమిస్తాలే" సర్దుబాటు చేశాడు మూడోవాడు.

లక్షడాలర్ల కుటుంబాస్థి పంపకం విషయమై వారంతా చర్చ సాగించారు. వృద్ధుల అంత్య క్రియలకూ నాల్గో కొడుకు వివాహానికి కొంత సొమ్ము ప్రత్యేకించారు. సొమ్మును పంచకుండా నాల్గోకొడుకు స్థానే ఎవరుంటే వారి కాపు దలలో వుంచడానికి నిశ్చయించుకున్నారు.

ఈ ఏర్పాటుకు నాల్గోవాడు చాలా సంత సించాడు. తల్లి దుఃఖంతో ఏమీ మాట్లాడలేక పోయింది. ఆమె ముద్దుకుమారుడు సంతోషం గానే వున్నాడు. పైగా రెండేళ్ళు గడిచాక మూడోకొడుకు పోయి వాడి నింటికి పంప డానికి వాగ్దానం చేశాడు. ఇక సరిపెట్టుకుంది.

లీ చె మింగ్ కు మాత్రం: ఇదేమీ అర్థం కాలేదు. రెండు సంవత్సరాల అనంతరం సుశిక్షితుడైన సైనికునిస్థానం అశిక్షితుడెట్లు నిర్వర్తించగలడు? అయినా ఏమీ తొందర పడవలసిన అవసరంకూడా లేదని అతనికి తెలుసు. సైన్యంలో విద్యాశిక్షణలు పొందిన తర్వాత నాలుగోవాడు తన స్థానంలో అన్న గారి నిమిడ్చి తా నింటికిరావడాని కంగీక రించడు. ఇక శాశ్వతోద్యోగస్థుల కుటుం బాల్లో జరిగినవని నభివృద్ధిచేయడంలో నిమగ్న మవాలని అతను నిశ్చయించుకున్నాడు.

"గ్రామపెద్దయొక్క చిన్న తమ్ముడు సైన్యంలో జేరుతున్నాడు," ప్రతి గ్రామస్థుని నోటినుండి ఇదేమాట. ఆదర్శమూర్తులయూరు టియన్ మా గ్రామస్థులు, సగర్వంగా తమ సైన్యంలో జేరారు.

# ‘నారాయణభట్టు’*

శ్రీ బులుసు వేంకట రమణయ్య

గత శతాబ్ది చివరిపరకును గల గద్య, పద్య కావ్యముల పద్ధతికి విలక్షణముగ కల్పిత కథలగు “నవల”లు వచన రూపమున నేడు మంచి ప్రచారము నొందియున్నవి. ‘నవల’ రచనమునకు బీజము గత శతాబ్ది చివరనే నాటబడినది. ఆంగ్లభాషా కోవిదులగు నాంధ్ర కవుల ప్రయత్నమున నవలలు పరినిష్ఠితరూపము నేర్పరచుకొనినవి. ఈ శతాబ్దిలో తొలిరోజులలో వెలసిన ఆంధ్రప్రవాహిణి, వేగుచుక్క, ఇతిహాస తరంగిణి, కళాభివర్ధని, విజ్ఞానచంద్రిక మున్నగు సంస్థలు నవలా రచనకు తగిన ప్రోత్సాహము నొసగినవి. కాని మొనమొన్నటివరకును వెలువడిన నవలలలో చాలవరకును భాషాంతరీకరణములు, అనుసరణములు మాత్రము కానవచ్చుచున్నవి.

కథా వాఙ్మయమునను, ‘నవల’ రచనమునను సాహితీసమితి సమర్థులగు పండిత కవుల పర్యవేక్షణమున పెక్కు మార్గముల ముందంజ వేసినది.

చక్కని కథలు వ్రాయుటయందును, నవలల రచనమునను సాహితీసమితి సభ్యులు సిద్ధహస్తులు. సభాపతి యగు శ్రీ శివశంకరులు తమ సభ్యుల రచనలను దిద్ది, తీర్చి వన్నెలు చిన్నెలు కూర్చి పేరుప్రతిష్ఠలు కలిగించుట సమితి సభ్యులకున్ను, మిత్రులు కొందఱికిని విదితము. వారు చేసిన యాంధ్రీకరణము లను వాదములవలె గాక స్వతంత్ర రచనల రీతినే హృదయంగమములై యుండును. అట్టి రచయితలలో శ్రీ నోరి నరసింహశాస్త్రిగారు ఎన్నదగినవారు.

కాలక్రమమున మన వాఙ్మయమున అనువాదములయెడ వ్యామోహము తగ్గినది; స్వతంత్రములును, అందును ఆంధ్రదేశ సంబంధములును అగు నవలలకు ఆదరము హెచ్చినది. శ్రీ ‘విశ్వనాథ’ వారి ఏకవీర, వేయి పడగలు, శ్రీ బాపిరాజుగారి ‘నారాయణరావు’, శ్రీ ఉన్నవవారి ‘మాలపల్లె’ మున్నగు నవల లుచిత స్థానము నాక్రమించుకొన్నవి. ఈ “నారాయణభట్టు”ను అట్టి ఉత్తమ తరగతికి చెందినది।

శ్రీ నరసింహశాస్త్రిగారు ఆంధ్రమునను, ఆంగ్లమునను విద్వాంసులు; సంస్కృత పరిజ్ఞానము కలవారు; గ్రంథ రచనముననే కాక, విమర్శనమునను దిట్టలు. వారు పెక్కు విషయములను సంగ్రహించి, శాసనములను

* కర్త: శ్రీ నోరి నరసింహశాస్త్రి, సాహితీసమితి, రేపల్లె, గుంటూరు జిల్లా. ఆంధ్ర వారపత్రికనుండి పునర్ముద్రితము; డెమ్మీ 280 పుటలు. చిన్న అచ్చు. వెల రు 4—0—0. ముద్రణ: ఆంధ్రపత్రికా ముద్రణాలయము, మద్రాసు 1.





"ఎయిరో కార్" ఈ మోటారు కారును విమానంగాకూడ ఉపయోగింపవచ్చును. నేలమీద గంటకు ఏభైమైళ్ళ వేగంతోను, గాలిలో నూరుమైళ్ళ వేగంతోను పోగలదు.

పరిశోధించి, కవుల చరిత్రమును కరతలామలకములుగ నొనర్చుకొని నన్నయనాటి దేశ, కాల, సాంఘిక, ఆర్థిక పరిస్థితులు ప్రతిబింబించున ట్లీ 'నారాయణభట్టు' ను రచించిరి. వీరు విమర్శకు లగుటచే చారిత్రక విషయములు కొన్నింటియెడ వీరికి సంతృప్తి కలుగలేదు. ఈ విషయము వీరు వ్రాసిన—

"నాకు సాధ్యమయినంతవరకు ఆ కాలపు చరిత్ర సంపాదించితిని. అందులో కృషిచేసిన పలువుర వ్యాసములు చదివితిని. ముఖ్యముగా ఆంధ్రుల చరిత్రయు, రాజరాజనరేంద్ర పట్టాభిషేకసంచికయు నామూలాగ్రముగ పఠించితిని. వానిలో నెన్నియో భ్రమలు కలవు. ఆ భ్రమలు కూడ నా కెక్కినవి. అనంతరమున పరిశోధకు లెన్నియో నూతనాంశములు వెలువరించినారు,

అవి యన్నియు నా దృష్టిలోనికి రాలేదు. అందుచే నేటి చరిత్రకారులకే కాక, నాకు గూడ పొరపాటులుగా కనపడు కొన్ని చిన్న విషయము లిందున్నవి. కథలో నివి కలిసి పోయినందున సరిచేయుటకు వీలులేకపోయి నది........ఐతే ఇది చరిత్ర గ్రంథము కాదు" అను పీఠికా భాగమునుబట్టి తెలియుచున్నది.

శ్రీ నరసింహ శాస్త్రిగారు ఈ నవలలో "ఆంధ్రభారత రచననాటి ఉజ్జ్వల చరిత్ర చిత్రింప నెంచి"రి. వారి ప్రయత్నము చక్కగ నిందు కొనసాగిన దనవచ్చును. ఆకాలము నాటి వేంగిదేశ వైభవము, మోటుపల్లి విదేశ వ్యాపారము, తూర్పు, పడమట చాళుక్యుల కుటుంబ పరిస్థితులు, చోళరాజ్య ప్రాభవము, రాజరాజ నరేంద్రుని యౌదార్యము, అమ్మంగ దేవి బుద్ధి ప్రాభవము, వజ్జియ ప్రెగ్గడ మంత్రాంగము, నన్నినారాయణుని ప్రతిభ, నన్నయ వైదుష్యము, బౌద్ధారామముల పరిస్థితులు, మత చర్చలు మున్నగు విషయము లిందు బాగుగ చిత్రింపబడినవి. అధర్వణుని భారతమును గూర్చిన యదార్థ విషయ మెట్లున్నను, ఆ గ్రంథము లభింపకుండుటకు కల్పింపబడిన గాథ మాత్రము యుక్తిసహము; నన్నయ భారత రచనకు నారాయణభట్టు ఎట్లు కారణమైనదియు బాగుగ వివరింపఁబడినది.

గ్రంథకర్త పీఠికలోఁ జెప్పినట్లు ఇందు కొన్ని భ్రమలను పాఠకులు గ్రహింపఁగలుగుదురు. ఇందు వేములవాడ భీమకవి నన్నయ సమకాలికుండైనట్లు తెల్పఁబడినది. శ్రీ గురజాడవారి కవి జీవితముల ననుసరించి భీమకవి నన్నయకు పూర్వుడనియు కొందరు భ్రమపడవచ్చును; మఱియు నన్నయయు, అధర్వణుఁడును సమకాలికు లనుట యుక్తి దూరము. నన్నయకు పూర్వము తెలుగు కవులు "కానట బీసటల్ చదివి గాథల నల్లి" రని చెప్పుట యుచితము కాదు. భారత రచనకు ముందు వాఙ్మయ మనుపలబ్ధమైనంత మాత్రమున అది అనాదరింపదగినది కాదు గదా!

"నారాయణభట్టు"లోని కథన పద్ధతి ఆది నుండి అంతమువఱకు నొక్కరీతిగా జరిగినది. కొంచెము సంస్కారము గల చదువరులకు మతచర్చ మున్నగు విషయములు విసువు కలిగింపవు. కథా ప్రారంభమునను, చక్రకోట్య యుద్ధ వర్ణనమునను కొంత భాగము తగ్గియుండిన మే లనిపించును.

మఱియు రాజరాజు నన్నయకంటె నారాయణభట్టు నెడనే ఎక్కువ ఆదరము చూపినట్లును, దాని కతఁడు యువరాజున కండగా నిలిచి చక్రకోట్యమును జయించుటకు కారణమగుటయే ముఖ్య హేతువైనట్లును, అందుననే నందంపూడిని దానము చేసినట్లును గ్రంథమునుబట్టి తెలియుచున్నది. నారాయణభట్టు యువరాజున కన్నియెడల నండయైయుండెననుటకు సందేహము లేదు; కాని చక్రకోట్య విజయమున నాతఁడు చూపిన సర్వాతిశాయి ప్రతిభ గ్రంథమున గోచరము కాకున్నది.

నందమపూడి శాసనమును బట్టి నారాయణభట్టు గొప్ప కవి యనియు, విద్వాంసుడనియు, సంస్కృత, కర్ణాటక ప్రాకృతాది భాషావేత్త యనియు స్పష్టమగుచున్నది. చూడుడు—

"యః సంస్కృత కర్ణాట
ప్రాకృత పైశాచి కాంధ్రభాషా సు,
కవిరాజ శేఖర ఇతి
ప్రథితః సుకవిత్వ విభవేన.
కవీన్ మనీషాలవ దుర్విదగ్ధాన్
మనోహరాభి ర్నిజసూక్తిభి ర్యః,
కుర్వ న్నగర్వాన్ పటుభి ర్బిభర్తి
కవీభవజ్రాంకుశనామ సార్థమ్.
తస్మై సకల జగదభినుత గుణశాలినే, సరస్వతీ కర్ణావతంసాయ అష్టాదశావధారణ చక్రవర్తినే నన్ని నారాయణాయ"

పయి చోట నారాయణభట్టు రాజనీతిజ్ఞుఁ డని సూచింపనైనను లేదు; అట్టివానికి నందంపూడిని దానమొనర్చుటకుఁ గల్పింపఁబడిన సందర్భము హృదయంగమముగ లేదు; ఒకవేళ నారాయణభట్టు యువరాజునకు బాసటయై నిలిచి, విజయమునకు కారణమైనను అట్టివానికి సోమోపరాగ సమయమున కేవలము ధర్మార్థముగా దానము చేయుట ఉచితముగా కావరాదు.

నన్నయ్యయే మరు జన్మములలో తిక్కన్నగను, ఎఱ్ఱన్నగను జనించి భారత రచన పూర్తి చేసెనని యిందు చమత్కారముగ చిత్రింపబడినది.

కథావస్తు విందు అల్పమైనను కథ మాత్రము విపులముగా సాగినది. కాని చదువరులకు విసుగు అనిపించదు. ఇట్లు రచించిన శ్రీ నరసింహశాస్త్రిగారు ప్రశంసార్హులు.

తెలుగుదేశమున పుట్టినవారిలో చాల మందికి ఆంధ్రదేశ చరిత్రమును గూర్చిన విషయములు తెలియవనుట అందరికిని తెల్లము. విదేశ చరిత్ర పఠనమునకు ప్రాముఖ్యము నొసగిన విద్యాప్రణాళికయే దానికి



రాబర్ట్ మేనార్డ్ హచిన్స్. షికాగో యూనివర్సిటీ ఛాన్సెలర్. "గ్రేట్ బుక్స్ ఆఫ్ ది వరల్డ్"కి ప్రధాన సంపాదకుడు. ఎన్సైక్లోపిడియా బ్రిటానికా వారి సహకారంతో 54 సంపుటాలలో ఈ గ్రంథం ప్రకటింపబడుతూ ఉన్నది.

కారణము. తెలుగు విద్యార్థులయు, పాఠకులయు హృదయసీమలో తెలుగునాటి చరిత్ర విశేషములకు తగిన తావొసగి, యువకుల కుత్సాహము కలిగించి, వారికిని, తన్మూలమున దేశమునకును అభ్యున్నతిని కలిగించుటకు "నారాయణభట్టు" వంటి నవల లెన్నియైనను కావలెను. ఇట్టి పనిని నెఱవేర్పజాలినవారు మన దేశమున మిక్కిలి అల్పసంఖ్యాకులు. అట్టివారిలో శ్రీ నరసింహశాస్త్రిగా రొకరు. కాన శ్రీ శాస్త్రిగారు ఇట్టి నవలలను రచించి, సమర్థులచే రచింపజేసి, దేశాభ్యున్నతియే తమ "సాహితీసమితి" లక్ష్యముగా నుంచుకొని, అన్ని విధముల ఆంధ్ర దేశాభ్యున్నతికి పాటుపడుదురు గాక.

# రాజా - రాణి

రచన :

శ్రీ రవీంద్రనాథ టాగూర్

అనువాదం :

శ్రీ బుద్ధుల వేంకట రమణరెడ్డి

బిపిన్ కిషోర్ బాబు ధనవంతులఇంట్లో జన్మిం చాడు. ధనిక వాతావరణంలో పెరిగాడు. అందుకు అది అతనికి బాగా అలవాటయింది. ఆస్థి తన చేతుల్లోకి వచ్చేసరికి సంపాదించిన దానికంటె రెండింతలు ఎక్కువగ ఖర్చు పెట్టడం అతడికి పరిపాటయిపోయింది. అందుకే కొద్దిదినాల్లో పువ్వులమ్మిన ఊళ్లో కట్టెలమ్మవలసివచ్చింది.

బిపిన్ సుకుమారుడు. సంగీతప్రియుడు. ఇతర జ్ఞానం అతడికి ఓవిధంగా లేదనే చెప్పాలె. అతని జీవితచక్రం కొద్దిదినాలు ధనపు సంచులమీద దొర్లింది. అందుకే ఎన్నో దినాలు పూర్వపు జీవితాన్ని గడుపలేక పోయ్యాడు.

ఇలాటిసమయంలో రాజా చిత్తరంజన్ దాసు అకస్మాత్తుగా బిపిన్‌కు ఆశ్రయమిచ్చాడు. చిత్తరంజన్ ఓ నాటకకంపెనీ స్థాపించాడు. అందులో ప్రధానపాత్ర బిపిన్ కిశోర్.

రాజా చిత్తరంజన్ బి. ఎ. ధనవంతు డయినా అప్పుడప్పుడు గృహస్థి కావడంవల్లా, పోగొట్టుకొన్నా ననుకొన్న ఆస్థి తిరిగిరావడం వల్లా అతడికి ఎక్కడలేని అదృష్టం పట్టింది. ఇతడికి బిపిన్ దొరికాడు. త్రాగేవాడికి త్రాగుడుమీదవలె రాజా చిత్తరంజన్‌దాసుకు బిపిన్‌మీద, అతడి సంగీతంమీద ఎక్కువ అభిమానం, ఇష్టం కల్గింది. బిపిన్ కార్యనిర్వాహకశక్తిని అతడు వేనోళ్ళ అభినందింప సాగాడు. దివాన్ రాజాను అప్పుడప్పు దాక్షేపించేవాడు బిపిన్‌మీద అనురాగం హద్దు మీరిందని.

రాణివసంతకుమారి భర్తని మందలించేది. అదృష్టహీనున్ని ఇంటబెట్టుకొంటే ఉన్న దురదృష్టం తనమీదే పడుతుందని ఆమె భర్తని ఆక్షేపించింది. భార్య అసూయ చూపేసరికి రాజాకు నవ్వువచ్చేది. స్త్రీలు తా మెవ్వర్ని వివాహమాడ్తారో, ఎవర్ని ప్రేమిస్తారో వారే పురుషులు, అందగాండ్లు, రసికులు. తనభర్తే తనకు సర్వేశ్వరుడు. తా మెచ్చినవాడే నల కూబరుడు అనుకుంటూంటారని రాజా చిత్త రంజన్ ఊహించేవాడు. బిపిన్‌మీద రాణికి ఇంత కసి ఎందుకా అని విచారించేవాడు. అప్పుడప్పుడు బిపిన్‌ను రాణిముందు పొగిడి ఆమె అసూయచీత్కారాల్ని వినేసరికి అతనికి నవ్వొచ్చేది. ఆనందించేవాడు.

ఇది బిపిన్‌కు "పిల్లి చెలగాటం ఎలుకకు ప్రాణసంకట" మయింది. సేవకబృందమంతా రాణి చెప్పుచేతల్లో మెలగేవారు. రాణి ఆజ్ఞ సుగ్రీవాజ్ఞ; బిపిన్‌కు భోజన సదుపాయాల్లో ఇసుమంతా అనుకూలం లేకపోయింది. తుదకు తాను తినే అన్నంమీద మూతుడుకూడా

ఉండేది కాదు. సేవకులు అతనిని ఓ రకంగా చూచేవారు.

ఓ దినం రాణి పూచేని ఆక్షేపించింది, ప్రశ్నించింది, "నీ వీ దినమంతా ఏం చేస్తున్నావని?"

"రాజా చెప్పారమ్మా, బిపిన్‌కి భోజన సదుపాయాలు చూడమని" అన్నాడు పూచే.

"బిపిన్ కిషోర్‌బాబు మీకు నవాబు?" అని గద్దించింది. ఆ గంభీరం, ఆమె కోపం చూసే సరికి పూచేకి అర్థమయింది. మరునటి రోజు నుంచీ బిపిన్‌ను బిపిన్‌కే వదిలారు. అతడికి ఏలాటి సదుపాయాలు కల్పించేందుకైనా భయపడేవారు. అందుకు బిపిన్ చాలా బాధ పడేవాడు. ఓదినం భోజనం లేకుండా నే పోయేది. దీనికంతా ఓర్చుకొంటాడు బిపిన్. రాజాకు తన స్థితిగతులు ఎన్నటికీ చెప్పడు. ఈవిధంగా బిపిన్ రాజాకు ఇష్టుడు, రాణికి ప్రబలనిష్టుడు.

నాటకకంపెనీ "సుభద్రాహరణం" లో తర్ఫీదయింది. రాజాగారి అంతఃపురములోని స్టేజిమీద నాటకమాడారు. అందులో రాజా కృష్ణుడు. బిపిన్ అర్జునుడు. ఆనాడు బిపిన్ నటన, గానశక్తి ప్రేక్షకుల్ని తన్మయత్వం చేసింది; ఆనందంలో ముంచింది.

నాటకం ముగిసింది. రాజా రాణీ నడిగాడు తా నెలా నటించానని. రాణి చెప్పింది: "బిపిన్ ఎంత బాగా నటించాడు. అతడు అర్జునుడుగా ఆపాత్రకే వన్నె తెచ్చాడు. ఎంత హాయి గొల్పింది అతడి కంఠం" అని. రాజా మరో సారి రాణీ నడిగాడు తన నటన ఎలావుందని? రాణీ "ఛీ" అంది.

వ్యవహారం తలక్రిందు లయింది. క్రింద మీదు లయింది. రాజా బిపిన్‌కు ఇపుడు దూర మవసాగాడు. రాణి బిపిన్ దగ్గరకు రాసాగింది. ఇద్దరి మనస్సులోని భావాలు ఒకదాని కొకటి ప్రత్యక్ష విరుద్ధంగా పనిచేశాయి. ఒకప్పుడు రాజా బిపిన్ శక్తిని, సంగీతాన్ని పొగిడేవాడు. ఇతరులకు చెప్పి సంతోషించేవాడు. ఇపు డాలోచిస్తాడు. అతడి కంఠంలో ప్రత్యేకత, మాధుర్యం ఏముందనీ, అతని నటన ఇతరులకంటె ఏమంత బాగుందనీ.


## నాయకుల ఫోటోలు

మహాత్మాగాంధి, నెహ్రూ, సుభాష్, పటేల్, రాజేంద్ర ప్రసాద్, ఆజాద్, రాజాజీ, పట్టాభి, ప్రకాశం, రంగా, గోల్‌వాల్కరు, సత్యమూర్తి, బుద్ధుడు, కస్తూరిమాత, సరోజినీదేవి, రామకృష్ణ పరమహంస, వివేకానంద, టాగూరు, భారతి, లక్ష్మి, సరస్వతి, శివ, ఏసుక్రీస్తు, వినాయకుడు, సుబ్రహ్మణ్యస్వామి, మొదలైన లైఫ్ సైజు బస్టులు 20''×14'' సైజు ఆర్టు పేపరుపైని గోల్డు బేక్‌గ్రౌండుతో, ఏవైనా 8 కాపీలు రు. 5-0-0 లు. 25 కాపీలు రు. 10. ఇండియాలో నాయకుల లైఫ్ సైజు బస్టులు ప్రచురణకు యిదే ప్రథమం.

గోల్డన్ పిక్చర్స్ కంపెనీ, చింతాద్రిపేట, మద్రాసు.



మిస్ కేథరిన్ ఎఫ్. లెన్‌రూట్ (అమెరికా)
ఈమె పెక్కు బాలసంఘాలతో సంబంధం కలిగి యున్నది. పిల్లల అభివృద్ధి కార్యక్రమాలలో విశేష మైన కృషి చేస్తున్నది.

పూర్వం రాజా బిపిన్‌మీద కల్గిన భావాలు ఒక్కటొక్కటే అదృశ్యమయాయి.

రాణీ హృదయంలో ఇపుడు బిపిన్ ఉన్నత స్థాన మందాడు. కొండ శిఖరం ఎక్కి కూచున్నాడు. రాజా ఒక్కమారుగా త్రోసి వేశాడు. బిపిన్ భోజనసదుపాయాల్లో గొప్ప మార్పు వచ్చింది. రాజా భోజనం లభించేది. రాణీ చిత్తప్రవృత్తుల్ని చూసి, తనకి ఈ అకారణ సదుపాయాల్ని చూసి బిపిన్ ఆశ్చర్య పడ్డాడు.

ఓదినం రాణి రాజాతో చెప్పింది. "బిపిన్ గొప్పవాడు. ఒకప్పుడు బాగా బ్రతికాడు. అలాంటివాడు మన కచ్చేరిలో నివసిస్తూంటే మీ రెలా చూడగల్గుతున్నారు?'' రాజాకు గొప్ప చిక్కొచ్చింది. ముభావం నటించాడు.

మరోదినం రాణీ ఒకేపట్టు పట్టింది. బిపిన్ చేత ఇంకో నాటకం వేయించమని. రాజాకు కోపమొచ్చింది. ఆమె మాటల్ని విసీ విన నట్టుగా లేచిపోయాడు.

రాజా పూటేమీద ఎగిరిపడ్డాడు. తనకు భోజన సదుపాయాలు సరిగా లేవని పూటే చెప్పాడు.

"రాణీగారు బిపిన్ బాబుని చూడమన్నారు బాబూ" అని. రాజాకు తలప్రాణం తోక కొచ్చింది. పూటేమీద మండిపడ్డాడు.

"బిపిన్‌బాబు నీకు నవాబా?" అన్నాడు కోపంతో. పూటే కర్థమయింది. మరోసారి బిపిన్‌బాబు స్థితి అధోస్థితి అయింది.

రాణి బిపిన్‌బాబు సంగీతమంటే చెవి కోసికుంటుంది. రాజా బిపిన్‌బాబుతో కూర్చొని పాటలు వింటూన్న కాలంలో పర్దా వెనుక నుండి వినేది. రాజా బిపిన్‌తో సంచరించటం, అతడితో పాడించటం ఆపివేయసాగాడు. రాణీ బిపిన్ సంగీతం వినలేకపోయింది.

ఓనాడు రాజా చిత్తరంజన్ జమీందారీ వ్యవహారాల్ని త్వరగా చూసేశాడు. జనానాకు వచ్చాడు. రాణి ఏదో చదువుతూంది "ఏమి టది'' అని ప్రశ్నించాడు. "బిపిన్‌పాటలు" అంది ఆమె. అగ్గిమీద గుగ్గిలం పోసినట్ల యింది.

మరుసటిరోజు బిపిన్ కిషోర్‌బాబు ఉద్యో గం ఊడిపోయింది. బిపిన్ మరోసారి నిరు ద్యోగి, నిస్సహాయుడు, ప్రపంచంలో ఏకాకి.

రాజా ఇచ్చే ధనం అతడికి ప్రధానంకాదు. రాజామీది ప్రేమ. బిపిన్ రాజాని ఎంతో ప్రేమించాడు. స్వలాభాపేక్ష లేకుండా అతడి కోసం పాటుబడ్డాడు. స్నేహాన్ని కోరాడు. డబ్బు తన ప్రాధాన్యాన్ని బిపిన్ విషయంలో ఎప్పుడో కోల్పోయింది. రాజా తనని ఉద్యో గం నుంచి తీసివేసినా డబ్బుటంతోటే అతడి కాశ్చర్యమేసింది. దుఃఖం కల్గింది.

"అంతా ఖర్మ'' అనుకున్నాడు. తన పాత గుడ్డల్ని కట్టిపెట్టెలో మరోసారి సర్దుకున్నాడు. బయలుదేరాడు అనంత విశ్వంలోకి. గమ్య స్థానం ఎక్కడో?

# "రెండవ తరం"

శ్రీ చాగంటి సోమయాజులు

సాయంకాలం పేపర్లో ఏమైనా ఉంటుందేమోనని చూశాం. ఏమీ లేదు. ఇహ. మర్నాడు తప్పకుండా తెలుస్తుంది కదా అని మర్నాడు సాయంకాలంకోసం ఎదురుచూస్తూ బాతాఖానీ కొడుతున్నాము. మర్నాడు సాయంకాలమంటే మాటలా? ఇరవైనాలుగు గంటలూ అరవైయ్యేసి నిముషాల చొప్పునా, నిముషం అరవైయ్యేసి సెకండ్ల చొప్పునా టిక్కుటిక్కు మంటూ నడవాలి. మా కెంత వేగం ఎంత వేగం అని ఉన్నాం. అది వెనక్కి వెనక్కి వెళ్ళుతున్నది. ఇంతల్లోకే పోష్టుమాను ఎర్ర బైసికిలుతో వచ్చి దిగాడు. దిగుతూనే ఊరుకున్నాడా? "అమ్మా మీ యిద్దరూ నాకు బహుమానం ఇవ్వాలి. తమరు పరీక్షలు పేసైనారు" అన్నాడు. ఓ కొండ నందుకున్నాము: నేనూ, అక్కయ్యా! ఇద్దరం స్కూలు ఫైనలు పరీక్ష కెళ్ళాము. మా అక్కయ్య నా కన్నా ఒక సంవత్సరం పెద్దదైనా ఒక సంవత్సరం జబ్బు చెయ్యడాన్ని వెనకబడి నాతో కలిసిపోయింది. కాని తెలివితేటల్లో ఇద్దరం ఒక్కటే. హాయిగా స్కూలు ఫైనలు పేసయాము.

ఇంట్లోకి గబాగబా పరిగెట్టి "అమ్మా! అమ్మా! మే మిద్దరం పరీక్ష పేసైనాము. మామయ్యపట్నమెళ్ళి అక్కడ మా నెంబర్లు చూసి టెలిగ్రామిచ్చాడు. ఇదిగో టెలిగ్రాము" అన్నాము.

"ఏదో పరీక్ష కెళ్ళినందుకు, మీ నాన్న అంత అపురూపంగా మీకు చదువులు చెప్పించినందుకు మర్యాద దక్కించారు. సమయానికి ఆయన కమాను వెళ్ళారు. ఆయనే ఉంటే మీకన్నా సంబరపడిపోదురు" అన్నాది మా అమ్మ.

"అమ్మా! అయితే నీకు సంతోషం లేదా" అన్నాను.

"సంతోషమే. కాని మీరు చదువుకోవడం నాకై ఇష్టం లేదు. మీకు పెళ్ళిళ్ళయి కాపరాల కెళితే నాకు సంబరం" అన్నాది మా అమ్మ.

ఆడవాళ్ళకు చదువు చెప్పించి ముందుకు తీసుకొద్దామని మన తండ్రులు పాటుపడుతున్నారు కాని మనం చదువుకోవడం మన తల్లులకి ఏమాత్రం ఇష్టంలేదు! ఆడవాళ్ళ చదువుకి ఆడవాళ్ళే అభ్యంతర పెడుతున్నారు!

కాని మా అమ్మమీద కోపం రాలేదు. అదెప్పుడూ అలాగే అంటుంది. పట్టించుకోవలసిన అవసరం లేదు. కాని మేము పరీక్ష పేసై సంబరపడుతూ ఉంటే అలాగ మాట అండం పొంగుతున్న పాలలో నీళ్ళు పొయ్యడం కాదూ? మా అక్కయ్యకి కోపం వచ్చింది.

"ఛీ నీతో చెప్పడమే మాది బుద్ధి తక్కువ" అన్నాది అక్క. ,

"మీరు పరీక్ష పేసైపై ఏం చేస్తారు ? ఉద్యోగాలు చేసుకొన్నా పెళ్ళి చేసుకుంటారా?ఆఖరికి పెళ్ళి చేసుకోవడం ఎలాగూ తప్పదు. అందుకు హాయిగా ఈ పాట ఏదో చదువుకున్నారు కదా పెళ్ళి చేస్తే బాగుణ్ణు అనుకొంటున్నాను. మీ నాన్నకి ఇష్టమై మీరు చదువుకొంటే మధ్యని నే నెవర్ని?" అన్నాది.

"అర్థం చెడుతున్నావు కదూ?" అన్నాది అక్క.

"మీ నాన్న వింతం లేదుకదా? మీ కెందుకూ బెంగ?"

"కావలసినన్ని విషయాల్లో నాన్న నువ్వు "కా" అంటే కా "కీ" అంటే కీ అంటాడు. ఎటొచ్చీ మా పుణ్యం కొద్దీ ఈ విషయంలో మాత్రం ఎలాగో నిన్ను కాదని మమ్మల్ని ఈకాడికి చదువు చెప్పించాడు. కాలేజీలో వెయ్యొద్దన్నావా చూడు నీపని ఏమి చేస్తామో? ఆ!" అన్నాది అక్క.

అక్కకి నాకూ కూడా కాలేజీకెళ్ళి హాయిగా చదువుకోవాలని ఉంది. చదువు చేదా? మాకు ఎంతమాత్రం పెళ్ళి చేసుకోవాలని లేదు. ఎవరు పడతారు పెళ్ళి చేసుకుని బాధలు? చూస్తున్నాము కదూ ఆడవాళ్ళంతా ఏమి సుఖ పడుతున్నారు! మగవాళ్ళ కేం. వాళ్లు హాయిగా సినిమాలకి పోతారు. కాఫీ హోటళ్ళలో మేస్తారు. ఇష్టమొచ్చినన్ని ఊళ్లు తిరుగుతారు. క్లబ్బుల కెళతారు. జీవితం స్వేచ్ఛగా గడుపుతారు. ఆడదానికి అంతా అధ్వాన్నమే. ఇంట్లో పడివుండి వంట వండి అడుగులకి మడుగు లొత్తుతూ మొగవాడి ఇష్టప్రకారం ఆహో రించాలి. స్వతంత్రంగా కాశీయాత్రకైనా వెళ్ళ డానికి స్వేచ్ఛ లేదు. డబ్బు స్వతంత్రం బొత్తిగా లేదు. ఛీ పెళ్ళెవడికి కావాలి? హాయిగా ఉద్యోగం చేసుకుంటాము. మా బతుకు మేం బతుకుతాము.

ఈ ధీమా చదువుకొంటున్న వాళ్ళందరికీ ఉంది. ఇప్పుడు కాలేజీల్లో చాలామంది ఆడపిల్లల అభిప్రాయాలు అలాగే ఉంటున్నాయి.

మా అక్కకీ, నాకూ ఏమీ తోచలేదు. పరీక్ష పేసైనాము. ఈ మారుమూల గ్రామంలో ఉన్నాము. తోటిపిల్లలంతా ఆ వూళ్లో ఉన్నారు. ఇక్కడెవరితో చెప్పుకుని సంతోషిద్దామన్నా లేరు. నాకు మా మంచి ఆలోచన తట్టింది.

"అక్కా అక్కా లేడీ డాక్టరుగారిదగ్గర కెడదామా?" అన్నాను.

"ఔను వెడదాము" అన్నాది.

ఇద్దరం అమ్మతో చెప్పి లేడీ డాక్టరుగారి దగ్గరికి బయలుదేరేము. ఇంకా ఆరైనా కాలేదు. ఏడైనా చీకటిపడదు. ఒక గంట డాక్టరుగారి దగ్గరుండి వస్తాము అని బయలు దేరేము.

లేడీ డాక్టరుగారే ఆ వూళ్ళో చదువుకొన్న ఆడవాళ్ళలో పెద్ద చదువు చదువుకొన్నది. తరవాత టీచర్లున్నారు కాని అంతా సెకండరీ గ్రేడువాళ్లు, హైయ్యరుగ్రేడువాళ్లు. వాళ్ళల్లో కొందరు పెళ్ళిళ్ళయి కాపరాలు చేస్తున్న క్రైస్తవులు. మిగతావాళ్లు నానా గోత్రాలవాళ్లూ. ఊళ్లో టీచర్లమీద, మిడ్వైఫులమీద అట్టే గౌరవం లేదు. కాస్త స్టేటసు, గౌరవం ఉన్నది డాక్టరు

గారికే. చదువుకొన్న ఆడది; ఎమ్. బి. ప్యాసై నదీ. పరీక్ష ప్యాసైనామంటే సంతోషించేదీ, గౌరవం చేసేదీ ఆవిడ వొక్కతే!

వెళ్ళాం. డాక్టరుగారికేం. బోలెడంత జీతం. అదికాక ఊళ్ళో ఆడవాళ్ళ కేసులన్నీ ఆవిడే చూడాలికదా! డబ్బున్నవాళ్లు కావలసినంత డబ్బిస్తున్నారు. ఆ ఇవ్వడమైనా సంతోషంగా ఇస్తున్నారు. ఎవర్నీ ఇబ్బంది పెట్టదు. అడగదు. పనిలోనా? బాగా సమర్థురాలు. పురిటి కేసులు ఆపరేషన్లు వస్తే దాంది అందెవేసిన చెయ్యి. మంచిపేరు తెచ్చుకొంది.

ఇంకో విశేషం ఉంది. నాకూ డాక్టర్ని కావాలని ఉంది. కాని మా అక్క కోరిక అది కాదు. కలెక్టరు అయిపోవాలని దాని ఊహ. ఈ మధ్య పటేలుగారు ఉద్యోగాలు ఆడవాళ్ళ క్కూడా మొగాళ్ళతో సమానంగా ఇస్తా రన్నారు కదూ! అంచేత ఆడ కలెక్టరై ఎందుకు మనం పనిచెయ్యకూడదూ అని దాని వాదం. మొగాళ్ళ నెత్తిమీద ఆఫీసరై ఒక జిల్లాకి జిల్లా "నిరంకుశంగా" పరిపాలిం చాలని దాని పట్టుదల. అందుకే ఎక్కళ్ళేని ఉపన్యాసాలు ఇచ్చి మాట్లాడ్డం బాగా నేర్చు కొంటున్నాది.

మేము వెళ్ళేసరికి డాక్టరుగారు ఇంటి ముందు తోటలో హాయిగా నాలుగు కుర్చీ లేసుకుని ఈజీ ఛైర్లో కాళ్లు చాపుకొని మొగాడికి మొగుడులాగ పడుకొని వైద్య విషయిక పత్రిక తిరగవేస్తున్నాది.

"డాక్టరుగారూ" అంటూ గేటులోంచి ఒక్కసారి బావాల్లాగా దూసుకుంటూ పరిగెట్టి వెళ్ళాము.

"ఏమిటర్రా గొడవ?" అన్నారు డాక్టరు గారు. మా నాన్నకి ఆ వూరు బదిలీ అయిన మూడోరోజే మేము డాక్టరుగారితో నేస్తం కట్టాము. రోజూ ఓసారి వెడతాము. బిస్కెట్లు కొడతాము. సరదాగా కబుర్లు చెపుతుంది.

"డాక్టరుగారూ మేం పరీక్ష ప్యాసైనాము" అని బ్రహ్మాండం బ్రద్దలైపోయినంత గొంతు కతో చెప్పాము. డాక్టరుగారు అంతకన్నా సంతోషించారు.

"ఐతే నా కెప్పుడు బాలు చేస్తారు?" అన్నారు.

"రేపు మా నాన్న రానీయండి" అన్నాము.

"పరీక్ష ప్యాసైనారా, ఇవాళ పేపర్లో లేదే?" అన్నారు.

"మాకు టెలిగ్రాము వచ్చింది.''

"ఓహో అలాగా, సరే పరీక్ష ప్యాసైనారు. సంతోషంగా ఉన్నదా! ఇంకేం చేస్తారు?"

"ఏం చేస్తారూ? అమాంతంగా కాలేజీలో చేరతాము" అన్నాను.

"ఈ వూళ్ళో కాలేజీ లేదు?''

"మాకేం మా చిన్నాన్న విజయనగరంలో ఉన్నాడు. అక్కడికి పోతాము" అన్నాను.

డాక్టరు మొహందించి నేల చూస్తున్నారు. ఏదో ఆలోచిస్తున్నారు.

"డాక్టరుగారూ మే మెందుకొచ్చామో తెలుసా?" అన్నాను.

"ఎందుకు తెలియదు?"

"చెప్పండి."

"చెప్పడాని కేముందమ్మా! సంతోషమైన వార్త వచ్చింది. నాతో చెప్పడాని కొచ్చారు!''

"కాదండీ, ఇది మావూరు కాదు. మాతో చదువుకొన్న వాళ్ళెవ్వరూ ఇక్కడ లేరు. చెప్పుకుని సరదాపడదామంటే మా నాన్నయినా లేడు. పైగా అమ్మ ఏవేవో మాటలంది. మాకు చీదరెత్తి మీదగ్గర కొచ్చాము" అన్నాది.

"మీ అమ్మగా రేమన్నారు?"

"దానికి మేము చదువుకోవడం ఇష్టం లేదు. పెళ్ళిళ్ళు చేసెయ్యమంటుంది."

"ఏం?"

"పూర్వకాలం మనిషి."

"మీ నాన్నగా రేమంటారు?''

"ఆయన కిష్టం, బాగా మేము చదువుకో వాలని ఉంది.''

"మీ అమ్మగారి అభిప్రాయమే సరియైన దేమో?"

"మీరూ మా అమ్మమాటా అడతారా?" అని నవ్వేను. డాక్టరు మా అమ్మలాగ అంటుందా? చదువుకున్నది తాను. చదువు వొద్దంటుందా?

"మీ అమ్మగారు ఆడది. ఆడవాళ్ల విషయం ఆడవాళ్ళకి తెలుస్తుందా మొగాళ్ళకి తెలుస్తుందా?" అన్నాది.

"ఆడవాళ్ళకి ప్రత్యేకమైన విషయాలైతే ఆడవాళ్ళకే తెలుస్తాయి. చదువు ఇలాటిది— చదువుకోని మా అమ్మ కేం తెలుస్తుంది? మా నాన్నకే బాగా తెలుసు. లేదా మీలాంటి చదువుకొన్న ఆడవాళ్ళకి తెలుస్తుంది. మీ రేమంటారో చెప్పండి."

"చదువు మాని పెళ్లాడమనే చెపతాను" అన్నారు డాక్టరుగారు.

"చదువుకొని పెళ్ళాడకూడదా?"

"చదువువల్ల పెళ్ళికి ప్రతిబంధకం వస్తే?"

"చదువుకొన్నవాళ్ళని పెళ్ళాడరా?"

"వెర్రివాళ్ళలారా చదువుకొన్న ఆడవాళ్ళని పెళ్లాడే స్తోమత ఉన్న మొగవాళ్ళు చాలా కొద్దిమంది ఉంటున్నారు. వాళ్లకి చదువుకొన్న పెళ్ళాం కావాలి. అందమైన పెళ్ళాం కావాలి. నలుగుర్లో గౌరవం తెచ్చేది కావాలి. ఇవన్నీ కాక అది బాగా పాతిక ముప్పైవేలు కట్నం తెచ్చేది కావాలి తెలిసిందా?"

"పెళ్ళి మానేస్తే ఏం? అప్పుడు పెళ్లే అడము."

"పెళ్ళి మానేస్తే జీవితం సుఖంగా ఉంటుందా ?"

"అమ్మా మమ్మల్ని బాగా ఆడిస్తున్నారే? మీ రెలాగ ఉన్నారు? మీరు చదువుకొన్నారు. పెళ్ళి మానేశారు. హాయిగా ఉద్యోగం చేస్తున్నారు. మీలాగే ఉంటాము."

"నేను సుఖంగా ఉన్నానా?"

"లేకేం?"

"పైకి అలాగ్గా కనబడుతున్నాను" అన్నారు డాక్టరుగారు. ఆవిడ ముఖమంతా మారిపోయింది. దీర్ఘాలోచనలో పడ్డారు. ఆవిడ ముఖం ఎప్పుడూ కలకల్లాడుతూ ఉంటుంది. అలాటిదల్లా వివర్ణమైపోయి పాలి విచారగ్రస్తమైపోయింది. దీర్ఘంగా ఒక్క నిట్టూర్పు విడిచింది. నా కేమిటండానికీ పాలుపోలేదు.

డాక్టరుగారు ఎందుకిలాగ అంటున్నారు? ఆ విడకున్న విచారం ఏమిటి? నాకేమీ అర్థం కాలేదు. ఏమాట అందామనికీ నోరు రాలేదు. ఆవిడ పై విషయమంతా ఊరికే అంటం లేదు. ఆవిడ ముఖమే చెపుతున్నాది.

డాక్టరుగారు కుర్చీలో పడుకునిఉన్నవారు లేచి తల మోకాళ్ళలో పెట్టుకున్నారు. ఆవిడ ఏదో మహా బాధ పడుతున్నారు.

"అమ్మాయీ నేను చెప్పినట్టు చేస్తారా?" అని తలెత్తి ప్రశ్నించింది.

"చెప్పండి."

"చేస్తారా?"

"మీ అమ్మగారు చెప్పిన ప్రకారం మీరు పెళ్ళీ చేసుకోండి. ఈ చదువు, ఈ ఉద్యోగాలూ మీ కొద్దు" అన్నాది.

"ఎంచేతో కారణం చెప్పండి."

"చెప్పమన్నావా? చెపతాను. మనస్సులో పెట్టుకోండి. ఎవ్వరితోటీ అని నన్ను వీధిని పెట్టకండి. నిజం చెపుతున్నాను. నమ్మండి. ఆడదానికి మొగవాడు కావాలి. ఏమంటారూ?"

"అక్కర్లేదు. నాకేం కావాలని తోచడం లేదు" అన్నాను నేను. మా అక్క మాట్లాడనే లేదు.

"అది ఇప్పటి నీ అభిప్రాయం. తరవాత మారిపోతుంది. చదువుకొన్న వాళ్ళకి పెళ్ళిళ్ల కావడం కష్టం. ఆడదానికి పిల్లలు కావాలి. పిల్లలు లేని ఆడది పడే ఆవేదన నీకు ఇప్పు డప్పుడే తెలియదు. ముప్పయ్యేళ్లు దాటి నలభై య్యొయేడు వచ్చిందంటే పిల్లలులేని ఆడదానీ బుద్ధి కిరాతకురాలి బుద్ధి అయిపోతుంది. ఇప్పుడు నాకు మొగుడు ఎలాగు వస్తాడు? ఎవణ్ణి పెళ్ళాడ్దం? నా యీడుకు సరిపడ్డ మొగాళ్ళంతా కాపరాలు చేస్తున్న పెళ్ళాలతో ఉన్నారు. న న్నెవడు పెళ్ళాడుతాడు? నేను చెడ్డదాన్నైతే మొగవాడి మీది అవస్థ తీరుతుంది. కాని అగౌరవం వచ్చి మీద పడుతుంది. ఇన్నాళ్ళయి నేను సంపాదించు కొన్న కీర్తి గంగపాలౌతుంది. ఇహను నాకు పిల్ల లెలాగ? వెర్రితల్లీ నాకు పిల్లలు కావాలి. మొగుడూ కాపరం కావాలి. అదే ఆడదానికి జీవితంలో ఉత్తమ లక్ష్యం. ఇప్పటి చదువు వల్ల, దేశ కాల పరిస్థితులవల్లా చదువుకొన్న ఆడదానికి విఘాతం కలుగుతున్నాది. అంచేత బాగా ఆలోచిస్తే వివాహమార్గమే నయం అనిపిస్తున్నాది. నువ్వు పెళ్లాడు తల్లీ. నీకు తెలిసినవాళ్ళ కందరికీ పెళ్ళిమాట ముఖ్య మని చెప్పు. మొగుడికి బానిసగానైనా కట్టుబడి ఉండడం స్త్రీ జీవితం; ధన్యమౌతుంది కాని స్వతంత్రమైన జీవితంలో ఉద్యోగం చేసుకొని లక్షలు గణించుకొన్నా, పంకాకింద పడుకున్నా, అవివాహిత అయిన, శీలవంతురాలికి సుఖం లేదు. మానసికంగా సంతృప్తిలేక మానవత్వం కోల్పోతుంది," అని డాక్టరుగారు పక్కనున్న కూజాలో నీళ్ల గ్లాసులో పోసుకొని నాలుగు గుక్కలేసి పురిసెడు నీళ్ల తీసి మొహమంతా రాసుకొని రుమాలుతో తుడుచుకుంది.

"మీలాగే నేనూ మా నాన్నతో పోరి ఎమ్. బి. చదువుకొన్నాను. డాక్టరునై బాగానే ఉన్నాను. ఇప్పుడు పొరపాటు చేశానని విచారిస్తున్నాను. కాలం మించిపోయింది. వెళ్ళి పోయిన కాలం రాదుకదా?

చదువుకోవడం మంచిదే! మనకి మొగవాళ్ళతోపాటు హక్కులన్నీ ఉన్నాయి; ఉండాలి కూడా. కాని ఇప్పటి పరిస్థితులు విషమంగా ఉంటున్నాయి.

పైగా మొగవాళ్ళ ప్రవర్తన ఆడవాళ్ళపట్ల ఎలాగున్నదీ పసిపిల్లలు మీకేం తెలుసు? వాళ్ళతో కలిసిమెలిసి తిరిగేవాళ్ళకి తెలుస్తుంది. యీ అనాగరిక దేశంలో చదువుకొన్న ఆడది గౌరవంగా బతకడం చాలా కష్టతరం. ఈ మధ్య యీఊరి బంగాళాలో ప్రభుత్వంలో పెద్ద పదవి నలంకరిస్తూ దేశానికి గౌరవ పాత్రుడైన ఒకానొక ఆసామీ నాకు కబురు పంపించాడు రాత్రికి బంగాళాకి రావలసిందని; నేను తిరస్కరించానని కావేష పెట్టుకుని అతగాడికున్న పలుకుబడి వినియోగించి నాకు ఈమధ్య రావలసిన ప్రమోషను రాకండా చేశాడు. అలాగ్గా ఉన్నాయి పరిస్థితులు.

వివాహానికి అడ్డు లేకపోతే చదువుకోండి. లేదన్నారా మీ అమ్మగారి మాట పాలించండి. ఆవిడ సనాతనంగా వస్తున్న సత్యం చెప్పింది. నేను చదువుకున్నదాన్నైనా అనుభవంమీద చెపుతున్నాను'' అన్నారు. డాక్టరుగారు చెప్పినదంతా యధార్థమే!

సూర్యాస్తమయమైంది. చంద్రకాంత పువ్వులు వికసించాయి. పక్కింటి ఆవిడ నిప్పు రాజేసింది కాబోలు పెణకమీదనుంచి పొగ వస్తున్నాది.

మా అక్క అంతా వింటూ ముంగిలాగ కూచుంది. ఒక్కమాట అడకండా అంతా వింది.

"సరే మీ జీవితం పాడైనాకాని ఆడవాళ్లు సమర్థులు చదువుకొంటే మొగవాళ్ళకి తీసిపోరు అని ఋజువు చేస్తున్నాది. మీ జీవితం పాడైనా స్త్రీ జాతికి మీరు పెద్ద మేలుచేశారు. స్త్రీకి వ్యక్తిత్వం ఉందని విశదపరచారు. మానసికంగా వ్యధ పడుతున్నారు. స్త్రీ జీవితానికి ప్రయోజనం సంసారమూ, పిల్లలనికదా! నిజమే కావొచ్చు. అదే మీరు త్యాగం చెయ్యవలసి వచ్చింది. ప్రారంభంలో స్త్రీలు కొందరైనా యీ త్యాగం చెయ్యక తప్పదు. జీవితం దగ్ధమైనా సరే వ్యక్తిత్వం నిలబెట్టుకోవాలి. నే నేమైనా సరే చదువుతాను. తరవాత మీ విధంగానే నా జీవితమూ వ్యధపడవలసి వచ్చినా వ్యధపడ్డానికి అంగీకరిస్తాను కాని నా అభివృద్ధిని, జ్ఞాన సంపాదనను వొదిలిపెట్టను. ఇది జీవితానికి లక్ష్యమే. మనం ముందువాళ్ళం కాబట్టి ఇన్ని ఇబ్బందులు పడతాము. మన తరవాత తరంవారైనా ఆడదాన్ని గౌరవించి సమానత్వం అంటే ఏమిటో బోధపరుచుకొంటారు. మీరంటూ మొదట చదువుకొని కొత్త మార్గం చూపబట్టి గదా యీనాడు వందలకొద్దీ మేము చదువుకొని ముందుకొస్తున్నాము. మీలాగే మేమూ జీవితాల్ని త్యాగం చేసుకొంటా మనుకోండి. పోనియ్యండి. ఒక మహత్కార్యం కోసం ఒక జీవితం దగ్ధమైపోతే వచ్చిన చిక్కేం లేదు. నేను చదువుతాను. దాని చివర చూస్తాను" అన్నాది మా అక్క. దాని కబ్బో కలెక్టరు కావాలని ఉంది. అది మాత్రం "భార్య"గా జీవించడానికి వొప్పుకోదు. చదువుకొంటున్నది మేము స్కూలుఫైనలే అయినా మేము తిరుగుతున్న మహిళాలోకం సామాన్యమైనది కాదు. మా అభిప్రాయాలు

సామాన్యమైనవి కావు. దేశం నైతికంగా పతనమై ఉంది కాబట్టే మరింత తీవ్రంగా కృషి చేసి, ఎంత త్యాగానికైనా సంసిద్ధం కావాలి. అదీ మా అక్క వాదం.

నేను మాత్రం ఆలోచనలో పడిపోయాను. భవిష్యత్తంతా భయంకరమైపోయింది. డాక్టరుగారి దగ్గర శలవు తీసుకొని ఇంటికి బయలుదేరేము. ఒక యింట్లో కిటికీలోంచి భార్యాభర్తలు కనబడ్డారు. ఇద్దరూ ప్రఫుల్ల వదనాలతో ఉన్నారు. ఆఫీసునుంచి మొగుడు వచ్చినట్టున్నాడు. భార్య అనురాగవతియై ఉన్నాది. అటువంటి దంపతులే అప్పుడు కనబడాలా? పెళ్ళాన్ని బూతులు తిడుతున్న భర్త కనబడకూడదా? నాకు మతంతా పోయింది. ఇంటి కెళ్ళేసరికి నాకు ప్రాణం లేచివచ్చింది. మా నాన్న తిరిగి వచ్చాడు. మా నాన్న ఆనందం పట్టలేకండా ఉన్నాడు. ఇద్దర్నీ దగ్గర కుర్చీల్లో కూచోబెట్టుకుని రాత్రి పన్నెండుదాకా పిచ్చాపాటి సాగించాడు.

కాలేజీలు తెరవగా అక్కా,నేనూ జాయిను అయేము. అది మా నాన్న ఇష్టం. మా అదృష్టం. ఇద్దరం బియ్యేలు పేసైనాము. మాకు పెళ్ళిళ్ల కాకేం హాయిగా అయినాయి. పెళ్ళికి మేము పెద్దయినాక అభ్యంతరం పెట్ట లేదు. అయితే మా పెళ్ళిళ్ల కావడంలో ఛాన్సు కూడా కలిసివచ్చింది. మంచి సంబంధాలే.

మా అక్క పెళ్లి అయిన మరో ఏడాదికి నాకు పెళ్లి అయింది. మా ఆయన నేనూ సంతోషంగా ఉన్నప్పుడల్లా నాకు లేడీ డాక్టరు గారు జ్ఞాపకం వస్తూఉంటారు. ఆవిడ చెప్పింది వాస్తవమే. ప్రేమించిన మగవాడు లేని జన్మ జన్మకాదు. జీవితానికి సంపూర్తి లేదు. డాక్టరుగా రిచ్చిన సలహా సహేతుక మైనదే. ఆవిడ జీవితం మాత్రం త్యాగమై పోయింది. ఇప్పుడు మాత్రం మాకు సరియైన వివాహాలు కావడం, మా నాన్న పెద్ద ఉద్యోగంలో ఉండడం, బాగా లంచాలు కొట్టడం కారణం? ఉన్నమాట చెప్పుకోవాలి. మిగతా ప్రపంచం: ఎలాగ బాధపడుతున్నాదో!

నేను సుఖపడుతున్నప్పుడల్లా లేడీ డాక్టరు గారి ముఖం దీనాతిదీనంగా కనబడి స్త్రీజాతికి జరుగుతున్న అన్యాయమంతా కళ్ళకి కడుతూ ఉంటుంది. పాపం లేడీ డాక్టరుగారు! చదువు కొని, సరియైన ఫాయా మొగుడు దొరక్క, అవివాహితగా ఆజన్మాంతం ఉండిపోయిన లేడీ డాక్టరుగారు!



**కిన్నెర ప్రతులను అమ్ముటకు ఏజంట్లు లేనిచోట్ల**
**ఈ క్రింది షరతులపైన ఏజంట్లు కావాలి**

*

# ఏజన్సీ షరతులు

○

1. ప్రతి ఏజెంటూ నెలకు కనీసం 6 కాపీలు తెప్పించాలి. అమ్మకం కాని కాపీలు వాపసు తీసుకోబడవు.
2. ఏజెంట్లు తమ ఏరియాలోనే 'కిన్నెర'ను అమ్మాలి.
3. సంచిక వెల ఎనిమిది అణాలు. ప్రత్యేక సంచిక వెల ఆయా ప్రకటనకాలమందు నిర్ణయించబడుతుంది.
4. ఏజెన్సీ కమీషను నూటికి 25% చొప్పున ఇవ్వబడుతుంది.
5. ప్రతినెలా ఏజెంట్లు తమకు కావలసిన కాపీలకు 10-వ తేదీలోపున అందునట్లు ఆర్డరు పంపాలి.
6. ఆర్డరుతోబాటు తమకు కావలసిన కాపీలకు కమీషను మినహాయించి సొమ్ము పంపవలెను.
7. పత్రికలు పంపడానికి పార్సెలు ఖర్చులు, పోస్టుఖర్చులు చార్జీ చేయబడవు. చెక్కులకు, మనియార్డర్లకు అయ్యే కమీషను ఏజంట్లే భరించాలి.
8. చందాదార్లను చేర్పడానికి ఏజంట్లకు అధికారంలేదు.

○

టెలిగ్రామ్స్ : "RITA" టెలిఫోన్ : 55068

మేనేజరు, కిన్నెర.

16, జోన్సువీథి, మద్రాసు-1.

అతని మనస్సుయొక్క సంపుటిని నిర్మించడములో ఈ సాంఘిక వాసనకు గల పాలు ఇంత అంత అని నిర్ణయించి కొలవలేము. మనస్సు అనే లక్షణము కేవలము వ్యక్తి స్వామ్యమే అయినా, గుంపు అనే పరిసరము ఆ మనస్సును తయారుచేయడముచేత స్వరూపములో మనస్సు కొంతవరకు సంఘము యొక్క సొత్తుకూడా అని చెప్పవచ్చునన్నట్లు నిర్మితమైవున్నది. ఇతర వ్యక్తులతో కలిసి మెలిసి ఉండడము అనే సంబంధముకంటె ఎక్కువ క్లిష్టమైన సమ్మేళన సంబంధము సంఘములో వ్యక్తికి ఉన్నది. ఈ సంబంధము ఎవరితో అనే విచారణకొరకు వ్యక్తులందరికీ భిన్నమైన ప్రత్యేక పదార్థముగా ఈ సంఘము వున్నదని భావించవలసి వస్తుందా అనే ప్రశ్న ఉన్నది. వ్యక్తులకు వినా అతీతముగా సంఘమంటూ ఒక పదార్థము ప్రత్యేకముగా వున్నట్లు అంగీకారమా అనే ఈ ప్రశ్నకు ఇక్కడ సమాధానము అప్రస్తుతము. సంఘమనేపేరూ, అధికారమూవహిస్తూ సంఘమందున్న వ్యక్తులు కొందరు ఈ సాంఘికవాసనయొక్క బలసాహాయ్యాన వ్యక్తిపై సాంఘికాభిప్రాయ సంప్రదాయాలను సులభముగా ఆరోపింపగలుగుతున్నారు. సాధారణవ్యక్తులు ఈ ఆరోపాన్ని తొలగించుకోలేక సంఘాన్ని అనుసరించ ప్రయత్నిస్తారు.

అందుచేత వ్యక్తికి సంఘముతో ఉండే సంబంధము సాహచర్యమే కాకుండా అంగాంగీ సంబంధము వంటిది. సంఘము యొక్క మొత్తపు క్షేమమును వ్యక్తులు అన్యోన్య సంబంధాల ద్వారా నిర్వహిస్తున్నట్లు భావిస్తారు. ఈ గుంపు సంబంధము చాలా చక్కగా తేనెటీగలలోను, చీమలలోను వ్యక్తమవుతుంది. అంతకంటె ఉత్కృష్ట జంతు కుటుంబమైన తోడేళ్ళలో ఈ సంబంధము మరీ ఎక్కువ స్పష్టముగా కనబడుతుంది. ఈ జంతువులలో కనబడే అన్యోన్యాశ్రయ సంబంధముకంటె ఎక్కువగా చిక్కుపడిన సంబంధము మనుష్యులలో విశదమగును. జంతువుకంటె బుద్ధిలో అనేకవిధముల ఉత్కృష్టమైన మనుజుడు జంతువుకంటె భిన్నుడై యుండునని వేరే చెప్ప నక్కరలేదు. కొన్ని విషయాలలో జంతువులకంటె మనుష్యునికి గుంపుపై ఆధారపడి యుండవలసిన ఆవశ్యకత చాలాతక్కువ. సంఘముతో విరోధపడిన మనుజ వ్యక్తి చచ్చిపో నక్కరలేదు; స్వతంత్రుడుగా జీవించ సాధ్యము. తానున్న గుంపుతో కుదరక పోయినపుడు ఆ గుంపును విడిచి వేరే మరొక గుంపుకు పోగలడు మనుజుడు. విరుద్ధపడిన మనుజ వ్యక్తిని—ఎంతో అనాగరక కుటుంబాలలో తప్ప—ఆ గుంపు సాక్షాత్తుగా చంపివేయదు. గుంపుయొక్క సాహాయ్యమును పొందుటలో కూడా చాలా తారతమ్యము ఉన్నది జంతువ్యక్తికిన్నీ, మనుజ వ్యక్తికిన్నీ. సాక్షాత్తుగా పొందే సాహాయ్యము కంటె పరోక్షముగా పొందేది ఎక్కువ మనుష్యులలో. ఒక కుటుంబములో ఉన్న వ్యక్తులలోకూడా భేదము కనబడుతుంది. పిల్లలు ఆధారపడినట్లు ఎదిగినవారు ఆధారపడరు; ఆధారపడ్డారా కేవలము ఆధారపడి యుంటారు. కాని ఈ విషయాలలో కాదు సాంఘిక వాసనకు మనుజునిపై గల ప్రభావము.

జంతువులలో శరీరసంబంధము ఎక్కువ. మనుష్యునిలో మనస్సుయొక్క నిర్మాణము

ముఖ్యము. సాంఘికాశ్రయము మనో వ్యాపారాలలో వ్యక్తమవుతుంది. తన భావనలలో సంఘమును అంగీకరించిన్నీ, భావములలో సంఘముయొక్క సంబంధాన్ని అభిలషించిన్నీ, వనలలో సంఘముయొక్క ఆమోదాన్ని కోరుతూ మనోవ్యాపారా లన్నిటినీ వ్యక్తి నడుపుతూ ఉంటాడు. నాగరక జనులు కూడా అనేక విశ్వాసములను అవి బుద్ధి తర్కములకు నిలవక పోయినా నమ్ముతూ ఉంటారు: ఇవన్నీ కూడా సాంఘిక వాసనా ఫలితములని శాస్త్రజ్ఞుల అభిప్రాయము. సంఘము సూచించే వాటిని వ్యక్తి శంకించకుండా నమ్ముతాడు; ఇవి తర్కమునకు సరిపడనపుడు, ఏవేవో సబబులు కల్పించి సరిపెట్టుకొంటాడు.

సాంఘిక నీతి, సంప్రదాయధర్మాలు సాంఘిక సూచనలే. వాటిని మన్నించాలనే బాధ్యత సాంఘిక వాసనా ప్రభావమే. పరిణామములో ఒకప్పుడు ఈ నీతి సంప్రదాయాలు గుంపు క్షేమానికి ఉపచరించినవి: ఆయా పరిస్థితులు పూర్తిగా నశించిపోయినా ఆ నీతులు మాత్రము మిగిలిఉండిపోయినవి. వాటిని గౌరవించి ఆమోదముతో మన్నించాలనే ఏ కోరిక మనుజవ్యక్తిలో ఉన్నదో అదే సాంఘికత్వము. పరిపాలక నిబంధనలను మన్నించక పోతే దండన కలుగునవే భీతి వ్యక్తి వ్యాపారాన్ని శాసిస్తుంది. అట్టి బాహ్య దండన యేదీ ఉండదు; కాని అంతకు తక్కువకాని భీతి మాత్రము వ్యవహారములో గోచరిస్తూ ఉంటుంది. ఆ భీతి పూర్తిగా మనస్సులో కలిగే భావవికారము. మన్నించకపోయి, సంతృప్తి గలవాడై వ్యక్తి ఉండలేడు. వాసనా నిర్మాణములో ఉత్తేజిస్తూ ఉండే సంచలనము ఈఅసంతుష్టికి కారణము, అందుచేత సంఘామోదము ఉంటే నీతి ప్రవర్తన, ఉండక పోతే అవినీతి అనే సూత్రము సిద్ధిస్తున్నది.

నీతి సంప్రదాయము వంటివే మర్యాదలు, లాంఛనాలు, బిరుదులు, ఆచారాలు ఈ మొదలైనవన్నీ. కాని సంప్రదాయాలనూ, ఆచారాలనూ. ఉల్లంఘించి వారియెడల చూపే అసమ్మతి అంత తీవ్రముగా ఉండదు. నీతి నియమాలను ఉల్లంఘించిన వారికి మాత్రము సంఘబహిష్కారము అనే రూపము దాల్చిన నిరసనమును సంఘము చూపి లొంగదీయ ప్రయత్నిస్తుంది. ఈ ఆమోదాది వ్యవహారాలకు కావలసిన అధికారమంతా ఈ సాంఘిక వాసనా బలమునందే సంక్రమిస్తుంది. సంఘములో కలిసిమెలిసి ఉండాలనే కోరిక గలవారూ, సంఘము పేరున నడిపే సత్కారాలు కావాలని కోరేవారూ ఈ అధికారానికి లొంగిఉంటారు.

ఇట్టిదే మత జాతి మొదలైన సంస్థల బలము. ఈ యుగములో విజృంభిస్తున్న సమాజాల దళాల (పార్టీ) బలము ఇదే. ఏ దళానికీ చెందకుండా వుండే వ్యక్తికి రాజకీయ వ్యవహారాలలో స్థానము వుండదు. స్వతంత్ర దళమనే Independent Party కూడా ఒక దళమే. ఆధ్యాత్మిక మత విషయాలలో కూడా ఈ సమాజాల బలము కనిపిస్తూ వున్నది. వీటి అన్నిటిలోను దేశాభిమానము, మాతృదేశము అనే భావనలద్వారా నడుస్తున్న ఈ గుంపు వాసన చాలా అధికారాన్ని చలాయిస్తూవున్నది. యుద్ధ దినాలలో దీని బలము ఎక్కువ. అధికసంఖ్యాకుల (మెజారిటీ) పరిపాలన సంస్థ (గవర్నమెంటు) ఈ గుంపు బలాన్నే ఉపయోగించి తమ దళానికి చేరని వ్యక్తులను, అల్పసంఖ్యాకులను బాధిస్తూ వుంటుంది. ఈ వాసన దాల్చే రూపాలు ఇన్నీ అన్నీ కావు.

అలాగని మానవ ప్రవర్తనంతా ఇట్టి సాంఘికబలముపైనే ఆధారపడియున్నదని తలచరాదు. మానవాత్మయొక్క ఔన్నత్యము పరాధీన ప్రవర్తనవలన సిద్ధించలేదు. సాంఘిక పరిసరప్రభావమునకు పూర్తిగా లొంగిపోక, తమ ఆధ్యాత్మిక గుణాలను పోషిస్తూ స్వాతంత్ర్యమును నిలుపుకొన్న వ్యక్తులు చాలా మంది వున్నారు. వారివలననే నాగరికత వర్ధిల్లినది. ఆధునిక పరిణామ స్వరూపము ఈ జంతు పరంపరాగతమై బుద్ధిరహితమైన ఈ వాసనాప్రభావమునకు లొంగక బుద్ధిస్వాతంత్ర్యాది వ్యక్తిత్వ విజృంభణమును విశదపరుస్తూ వున్నది. ఈ వ్యక్తిత్వముమాత్రము స్వవాసనా వ్యక్తీకరణముకాదా అనే ప్రశ్న లేకపోలేదు. మానవ వ్యాపారమంతా వాసనా విర్భావాలే అనే మతముప్రకారము ఈశంకకు అవకాశములేదు. మానవాత్మ స్వరూపానికి బుద్ధితర్క స్వాతంత్ర్యాదులు స్వతఃగావున్నవనే మతాపేక్ష్య ఈ శంకకు సమాధానము సిద్ధిస్తున్నది. ఈ మతాల చర్చ ఇక్కడ అప్రస్తుతము. మానవవ్యక్తికి ఈ వ్యక్తిత్వ లక్షణాన్ని అంగీకరిస్తేనేగాని వ్యక్తి మనో ఘనతను నిరూపించేవిషయాల సమన్వయము కుదరదు. కళలు. శాస్త్రపరిశోధనలు,సారస్వత సేవ, కవిసహృదయము, ఆధ్యాత్మిక తత్వ విచారణ ఈ మొదలైన విషయాలలో వ్యక్తి కనబరచే బుద్ధిశక్తి కేవలము వ్యక్తిపరమే గాని గుంపుసంబంధము ఏమీ లేనిదిగదా. ఈ విషయాలలో పనిచేసే ధీమంతులు సాంఘికత్వ గుణముతో ఏవిధమైన ప్రసక్తిలేక వ్యక్తిత్వమునే ప్రకటించేవారు. మానవపరిణామములో ఈ వ్యక్తిత్వము క్రమముగా వర్ధిల్లుతూవున్నదని స్వరాంగికారము. ఈ వ్యక్తిత్వము స్వవాసనారూపములేకుండా బుద్ధితర్కాధీనమైనది. ఈ బుద్ధితర్కములు కూడా వాసనాశక్తిలో సానపెట్టబడినవే అనే నిర్వచనము చేసే విమర్శకులు వున్నారు. ఇక్కడ విశదపరచినది ఆ వాసనా బుద్ధులకువుండే భేదము మాత్రమే. ఆవిర్భావమును పట్టి వాటి రెండింటికీవుండే సంబంధము ఇప్పుడు అప్రస్తుతము. ఈ రెండు మతాలలో ఏది సిద్ధాంతమైనా ఒక్కటిమాత్రము స్పష్టము. క్రమముగా వ్యక్తిస్వాతంత్ర్యము ఎక్కువగా మానవ వ్యాపారాలను నడుపుతూవుంది. ఇది నిశ్చయము.

## గమనిక.

ఈ పత్రిక మే సంచికలో "వేగుచుక్క" అనే శీర్షికతో ప్రకటితమయినది శ్రీ రాజమహేంద్రవర హితకారిణీ సమాజమువారు 1949 మే నెలలో జరిపిన శ్రీ కందుకూరి వీరేశలింగము పంతులుగారి వర్ధంతి సభలో శ్రీ మల్లంపల్లి సోమశేఖర శర్మగారు "శ్రీ పంతులుగారి సాహిత్య సేవ"ను గురించి చదివిన వ్యాసము.

# సౌందర్య నిరూపణలో అభిరుచి

శ్రీ తుమ్మలపల్లి సీతారామారావు

అభిరుచినిగురించి అనేకులకు భిన్నాభిప్రాయా లున్నవి. వ్యక్తుల మనస్తత్వం, పరిసరములు, సంస్కృతి మొదలైనవాటివల్ల అభిరుచి మారుతుంది. అభిరుచి కలుగడానికి పూర్వపరిచితి, అనుభవం కూడా కొంతవరకు తోడ్పడుతవి. ఒకరికి తాజ్‌మహల్ కట్టడం ఆహ్లాదం కలిగిస్తుంది. ఇంకొకరు శ్రావ్యమైన సంగీతం విని ముగ్ధులౌతారు. ఇటువంటి భిన్న అభిరుచులలోను సత్యం ఉంది. అయినప్పటికీ ఒకదానికంటె రెండవది ఎక్కువ ఆహ్లాదకరమైనదనిగాని, తక్కువ అనిగాని చెప్పడానికి వీలులేదు. శాస్త్రీయ విషయాలలోను, చారిత్రిక అంశాలలోను ఏకాభిప్రాయం కలుగడం కష్టం. ఈ అవ్యవస్థ, అభిరుచి విషయంలో కూడా కనుపిస్తుంది.

దృష్టికి గోచరించే అన్ని వస్తువులలోను కొంత మంచి, చెడు ఉంటుందని మనం అంగీకరిస్తాము. మనసుకు సంతృప్తి కలిగించే విషయాలపట్ల, వీటిల్లో చెడుగుణం వుంటుందనే అంశం మనకు ప్రధానంగా కనుపడదు. సిల్కు చొక్కాకంటె ఫ్లానల్ చొక్కా ఎక్కువ ఆహ్లాదకరంగా ఉంటుందని ఒకడు భావిస్తాడు. అతడి భావన సరైనదనిగాని, చెడు అనిగాని మనం అనలేము. సిల్కు చొక్కా కలిగించే అనుభూతి, ఊహించే మనకంటె, అనుభవించే అతడికి బాగా తెలుస్తుంది. కాని అంతమాత్రంతో ఒక అభిరుచి మంచిదనిగాని, చెడ్డదనిగాని నిర్ణయించే అధికారం మనకు లేకపోలేదు. చెడు అభిరుచిని మార్చడానికి, మంచిగుణాన్ని పెంపుచేయడానికి నిరంతరం మనం కృషిచేస్తాము. సౌందర్యం విషయంలో కూడా భిన్నమైన అభిప్రాయాలవల్ల కలిగిన అభిరుచులు గోచరిస్తవి. తార్కికవాదంతో సౌందర్యాన్ని నిరూపించలేము. కాని ఇది కూడా వివాదగ్రస్తమైన విషయం.

సౌందర్యం అంటే ఏమిటి అనే సమస్య కలుగుతూంది, ఒక అందమైన వస్తువును ఊహించినపుడు, దీనినిగురించి వినినపుడు, చూచినపుడు ఆ వస్తువును మనం గుర్తిస్తున్నాము. దృశ్యం, శబ్దం, రూపం మొదలైన అంశాలవల్ల గాకుండా మరికొందరు ఈ వస్తువుల సౌందర్యాన్ని గుర్తిస్తున్నారు. అటువంటివాళ్ళకు భిన్నమైన అభిరుచులు ఉన్నవని చెప్పడంతో మనం తృప్తిపడడంలేదు. వీరిలో ఎవరిమార్గం సరియైనది అని అన్వేషణ చేస్తున్నాము.

ఈ అన్వేషణలో మొదట కలుగుతున్న సంశయం ఇది. ఒకే నిర్వచనంతో సౌందర్యస్వరూపాన్ని నిర్వచించుకోవచ్చునా ? సాధారణాంశంలేని భిన్న అనుభవైకవేద్య వస్తువులను ఒకే పేరుతో పిలుస్తున్నాము. కొన్ని పోలికలు కలిగినంతమాత్రంతో ఇద్దరిని అన్న

ణ్యమ్మలని చెప్పడంతో మనం ఎటువంటి పొర పాటు చేస్తున్నామో. అన్ని వస్తువులు సౌంద ర్యం గలవి అన్నపుడుకూడా అటువంటి పొర పాటే జరుగుతూంది. కొన్ని ధ్వనుల పోలికల వల్ల వాటికి సౌందర్యం ఆపాదించడంలో గూడా పొరపాటువస్తుంది. రమణీయమైన గానం, మనోజ్ఞమైన చిత్తరువులు, అపూర్వ శిల్పాలు, మధుర కవితలు, అందమైన ప్రకృతి మొదలైన వాటిల్లోని అనుభూతిలో ఒక సామాన్య లక్షణం ఉంటుంది. ఈ లక్షణమే, వీటిపట్ల మనకు సౌహార్దం కలిగిస్తుంది. అపు రూపమైన వస్తువులలో సామాన్య లక్షణం వుండదు. వీటిపట్ల మనకు గల సౌహార్దమే సామాన్య లక్షణం. కొన్ని వస్తువులు సౌం దర్యంగలవి అని మనం చెప్పినపుడు, వీటి ల్లోని సౌందర్యానికి ఒక సాధారణ అంశం కారణమా లేక వీటియెడల మనకు ఉన్న సౌహార్దత కారణమా అనే విషయం నిర్ధారించ వలసియుంటుంది. సౌందర్యం గల వస్తువు లలో అందం గాకుండా, ఒకటిగాని అంతకు మించిగాని సాధారణాంశములు ఉంటవి. భిన్న వస్తువులలోని సౌందర్యం, వాటిల్లోని ప్రత్యేక సాధారణాంశములు స్ఫుటపరిచే అందంలోని అంతస్తులవల్ల తర, తమ, విభేదాలు ఏర్పడు తున్నవి. సంగీతంలోని సౌందర్యం, కవిత లోని రమ్యత వీటిలో ఏది గొప్ప అనే సమస్య కలుగుతూంది. ఈ చర్చకు అవధిలేదు. పురు షులలోను, స్త్రీలలోను మానవత్వం సామాన్య లక్షణమైనట్లు, సౌందర్యంగల అన్ని వస్తువుల లోను భిన్నమార్గాలలో సంతరించుకున్న సౌం దర్యంకూడా సామాన్య లక్షణంగా ఉంటుంది. భిన్నవస్తువుల సౌందర్యంలో కూడా తర తమ భేదాలకు ఎప్పుడూ అవకాశం ఉంది.

సౌందర్యం గల అన్ని వస్తువులలోను సౌందర్యం గాకుండా ఒకటిగాని, అంతకు మించిగాని కొన్ని సామాన్య లక్షణాలు వుండడంవల్లనే వాటిని సౌందర్యం గల సుందర వస్తువు లంటున్నాము. కొన్ని భౌతిక లక్షణముల ఉనికివల్ల నీలిరంగు ఏర్పడుతుంది. అటువంటి వస్తువును నీలిరంగు పదార్థం అని చెపుతున్నాము. సుందరమైన వస్తువులలో అందంగాక మరి ఏ ఇతర సామాన్యమైన లక్షణం లేకపోవచ్చును. కాని ఇటువంటి వస్తువులను కూడా అందమైన వస్తువు లనే చెపుతున్నాము. కొన్ని వస్తువులు అందం గలవి అని చెప్పినపుడు, అలా చెప్పేటప్పుడు వాటిల్లోని అందానికి గల సాధారణ లక్షణాన్ని మనం ఒకప్పుడు ఊహించక పోవడం కూడా కలుగుతుంది. కొన్ని వస్తువుల ఉపయోగాన్ని ఊహించి వాటని అందమైన వస్తువులు అని చెపుతాము. కొన్ని అందమైన వస్తువులలోని ప్రత్యేక గుణాన్ని, సాధారణ లక్షణాన్ని మనం గుర్తించ గలిగినప్పటికీ, లేకపోయి నప్పటికీ వాటి నన్నిటిని అందమైన వస్తువు లనే అంటున్నాము. ఈ తికమకల వల్లనే అభిరుచిని గురించి భిన్నమైన వాదాలు బయలు దేరుతున్నయి.

సౌందర్యం ఉపయోగంకాదు. ఉపయో గాన్ని ఆధారంగా జేసుకొని సౌందర్యం ప్రకాశించదు. ఉదాహరణానికి బొగ్గు ఎక్కువ ఉపయోగమైన వస్తువు; కాని ఇది అందమైన వస్తువుగాదు. ఇనుము, బొగ్గు వీటి రెంటికంటె వెండి ఎక్కువ అందమైన వస్తువు. కాని దీనికి అంత ఉపయోగం లేదు.

కళ కేవలం నిరుపయోగం అన్నాడు ఆస్కార్ వైల్డ్. ఈ మాటలు విని తేలికగా ప్రజలు నవ్వేశారు. కళకు, సౌందర్యానికి గల ఉపయోగం అతి స్వల్పం. అందమైన వస్తువులు ఉపయోగకరంగా వుండవచ్చును. అట్లాగే ఉపయోగకరమైన వస్తువులు అందంగాను ఉండవచ్చును. ఇందువల్ల ఆ వస్తువుల అందానికి ఏమీ కొరత వుండదు.

సౌందర్యం అనే పదాన్ని సాధారణంగా సందర్భశుద్ధి లేకుండా ఉపయోగిస్తున్నారు. విదానంగా పరిశీలించినపుడు ఈ ప్రయోగంలోని అసందర్భ పరిమితి వ్యక్తమౌతుంది. అందమైన పానీయం అని చెపుతాము. ఇక్కడ పానీయం అందమైనది కాదు. నాలుకకు రుచికరంగా వుండి సంతృప్తి కలిగిస్తుంది. అయినప్పటికీ అందమైన పానీయం అంటున్నాము. ఊహకు రోగ నిరూపణలో పని కల్పించి, చికిత్స సంతృప్తికరమైన ఫలితం ఇచ్చినపుడు వైద్యుడు దానిని అందమైన వ్యాధి అంటాడు. ఇక్కడ కూడా అందం అనే పదం సంతృప్తిని మాత్రమే సూచిస్తుంది. సంతృప్తి అనే పదాన్ని సౌందర్యపరంగా ఉపయోగించడంవల్ల అనేక తికమకలు కలుగుతున్నవి.

కాంభోజ నర్తకి, త్రివర్ణ చిత్రం చూచినపుడు పలువురకు పలువిధములైన ఆకర్షణ, సంతృప్తి కలుగుతవి. ఈ చిత్తరువు ప్రస్ఫుటం జేసే రచనా విధానం, రేఖా నైపుణి ఒకరికి సంతృప్తి కలిగిస్తుంది. ఆలంకారికరీత్యా ఘన వక్షోజములు, జఘనము, ముద్రాసూచితములైన విన్యాసములు ఇంకొకరికి సంతృప్తి కలిగిస్తుంది. అలంకారములు, ఆభరణములు, కేశాలంకరణము మరియొకరిని సంతృప్తి పరుస్తుంది. ఒకే చిత్తరువును చూచిన పెక్కుమంది పలుమార్గములలో సంతృప్తి పొందుతారు. తమ భిన్న అనుభవాలను కొన్నిటిని పురస్కరించుకొని ఈ చిత్తరువును అందమైన చిత్రం అంటారు కొందరు. కేవలం సంతృప్తిని కలిగించే అంశమే సౌందర్యం కాదనే విషయం ఈ దృష్టాంతరములతో నిరూపణ యౌతుంది.

కంటికి, చెవికి ఇంపైనది సౌందర్యం అని కొందరి వాదం. కాని దృశ్యమాత్రంతో సంతృప్తిని కలిగించే వస్తువులు అందమైనవి గావని ఇప్పుడే నిర్ధారణయైంది. అందంగా లేకపోయినప్పటికీ కొన్ని వస్తువులనుగురించి, సంఘటనలను గురించి మనం తెలుసుకొనడానికి, వినడానికి కుతూహలపడతాము. అట్లాగే కొన్ని సుగంధ వాసనలు, పరిమళము, సౌందర్య స్మృతులు కలిగిస్తవి. ఇలాగే కొన్ని రుచులు కూడా సౌందర్యాన్ని స్ఫోరకం జేస్తవి. కొన్ని సౌందర్యం గల వస్తువులు కంటికి, మరికొన్ని చెవికి సంతృప్తి కలిగిస్తవని అనుభవంవల్ల సంస్కరించుకోవలసి వస్తుంది.

సంతృప్తి కలిగించే కొన్ని ప్రత్యేక లక్షణములే సౌందర్యం అని భ్రమపడడం చేత, అభిరుచి వివాదగ్రస్తమౌతుంది. అభిరుచిలోని వైవిధ్యానికి ఇంకా అనేక కారణాలున్నాయి. అభిరుచికి, తుదినిర్ణయం చేయడానికి ఆయా వ్యక్తుల మనస్తత్వం, సంభావనీయత, ఆ సౌందర్యంగల వస్తువులతో వీనికి గల పూర్వ పరిచయానుభవములు విశేషించి తోడ్పడుతవి.

ప్రకృతి దృశ్యాన్ని చూచినపుడు, చిత్రాన్ని చూచినపుడు వాటిలోని ఆంతరంగిక ప్రతిభను, ప్రాశస్త్యాన్ని గ్రహించడానికి మనం ప్రయత్నిస్తాము. అందువల్లనే, చిత్రకారులు అర్థవంతమైన ఆకృతులు చిత్రణ చేయాలని మవం కోరుతాము. కాని చిత్రకారులు ఈ కోరికను మన్నించడం జరుగుటలేదు. బహుశ, అర్థరహితమైన ఆకృతులలోనే వారికి సౌందర్యం స్ఫురించవచ్చును. ప్రకృతి దృశ్యములు, వాస్తవిక వస్తు సంపద, వ్యక్తులు మొదలైన చిత్తరువులు మాత్రమే సౌందర్యాన్ని పొసగించుకుని ఆకర్షణీయంగా ఉంటవి.

వాస్తవిక పదార్థములు, కూడా, చెట్టు చిత్రించవలసినపుడు చిత్రకారునికి ఇవి ప్రేరణ కలిగించలేవు. అందువల్లనే అతడి చిత్రరచన ఊహాశక్తిమీద నాధారపడుతుంది. ప్రతి సూక్ష్మాంశం మౌలిక సంపదను అభివ్యక్తం జేస్తుంది.


ది నాగపూర్ పయినీర్ ఇన్‌ష్యూరెన్సు
కంపెనీ లిమిటెడ్.

(1921 లో స్థాపింపబడినది)

హెడ్ ఆఫీసు : నాగపూరు

ప్రిన్సిపాల్ ఆఫీసు: బొంబాయి

కీర్తిశేషులైన రావ్ బహదుర్
డి. లక్ష్మీనారాయణగారిచే
స్థాపింపబడినది

ఏజన్సీ వివరాలకు, ప్రాస్పెక్టస్‌కు వ్రాయండి :

పి. ఎస్. ఆర్. శర్మ,
బ్రాంచ్ సెక్రటరీ,
3, తంబుచెట్టి వీధి, మద్రాసు 1.

# ఏరిన ముత్యాలు

## కళకు అపకృతి

మానవజీవితం ఒక్క తిండితోనే కడతేరదన్నది ప్రసిద్ధమైన నానుడి. పొట్టకోసం ప్రాకులాట ప్రతి వ్యక్తికీ తప్పనిసరి. పొట్టనిండిన తరువాత మనిషికి కావలసిన విశేషాలెన్నో వున్నవి. సౌందర్యం కావాలి; సంగీతం కావాలి; విజ్ఞానం కావాలి; వినోదం కావాలి. ఇవేవీ అల్పమైన, అనుచితమైన కోరికలు కావు. పైపెచ్చు, విజ్ఞులైనవారు వీటిని ఇహ పర సాధనాలుగా పేర్కొన్నారు.

ఒక జాతి ఔన్నత్యంగాని, నాగరికతగాని ఆ జాతి సౌందర్యానుభూతి, కళాపాటవం, విజ్ఞానాధిక్యతలబట్టే చెప్పవలసి వుంటుంది. నాటికి నేటికి, ఏనాటికైనా శాశ్వతంగా నిలిచేవి ఈ కళావిజ్ఞానాలే గాని ధనధాన్య సంపదలు కావు.

తమతమ ప్రజలలోని ఈ కళా పిపాసను, ఈ విజ్ఞాన తృష్ణను తనియజేయడం, అశిక్షితమైన ప్రజాభిరుచిని సంస్కరించి ఉత్తమ సంప్రదాయాన్ని నెలకొల్పడం, వర్తమాన నాగరిక ప్రజాప్రభుత్వాలు నిర్వహిస్తున్న పనే.

ఈ దృష్టితో చూస్తే, బహిరంగ ప్రదేశాలలో జాతీయ నాయకుల విగ్రహ ప్రతిష్ఠాపన విషయమై ఇటీవల మద్రాసు ప్రభుత్వం చేసిన ఉత్తరువు సర్వ సమంజసమని చెప్పవచ్చు.

ప్రజాసేవకులుగాను తమ సర్వస్వం ధారపోసిన ప్రఖ్యాత దేశనాయకుల, తదితర ప్రసిద్ధ వ్యక్తుల పట్ల తమకు గల భక్త్యనురాగాలను ప్రకటించే నిమిత్తం బహిరంగ స్థలాలలో వారి విగ్రహాలను ప్రతిష్ఠించి ప్రజ లానందించడం సహజం.

ముఖ్యంగా ఆంధ్రదేశంలో ప్రధానమైన పట్టణా లన్నిటిలోను, చిన్నచిన్న బస్తీలలో కూడా గాంధి, నెహ్రూ, నేతాజీల విగ్రహాలు వందలకొద్ది వెలసినవి. ఎక్కడో ఒకటి రెండు తప్ప, ఈ విగ్రహాలలో చాలాభాగం సిమెంటు విగ్రహాలే గాని, శిలా విగ్రహాలు కావు.

ఊరూరా, వాడవాడా అసంఖ్యాకంగా వెలసి వుండే ఈ నాయకుల విగ్రహాలలో నూటికి తొంభై తొమ్మిది, వాటిని నెలకొల్పిన ప్రజల దేశభక్తికే తప్ప, వారి సౌందర్య గ్రహణశక్తికి నిదర్శనాలు కావని చెప్పడం అతిశయోక్తి కాదు.

పురాతనకాలం నుంచి శిల్పకళలో పేరుగన్నది భారతదేశం. ఇక, ఆంధ్రుల శిల్పకళా వైభవాన్ని తలపింపచేసే తార్కాణాలు అనేకంగా వున్నవి. అటువంటి మహోన్నతమైన, అతి సుకుమారమైన, విశిష్ట కళాసాంప్రదాయం కలిగిన ఆంధ్రులు తమ కారాధ్యులైన దేశనాయకుల విగ్రహాలను కళాన్వితంగా, సహజ సుందరంగా, శిల్పచాతుర్యం వుట్టిపడేట్టుగా నిర్మించుకోలేక పోవడం ప్రశంసనీయం కాదు.

విదేశస్థు లెవరైనా మన ఆంధ్రదేశం తిలకించేందుకు వచ్చారే అనుకోండి; మన అజంతా, మన అమరావతి, మన నాగార్జున కొండలను వీక్షించారే అనుకోండి; ఆ వెంటనే వారికి మన ప్రధాన

నగరాలలో, బహిరంగ వీథులలో ఏ గాంధీ, ఏ నెహ్రూ, లేక ఏ నేతాజీ సిమెంటు విగ్రహమో కంటబడిందనుకోండి: నేటి ఆంధ్రజాతి కళా కౌశలాన్ని గురించి, రసగ్రహణ పారీణతను గురించి, సౌందర్య పోషణను గురించి వారికిక వ్యాఖ్యానం అవసరమా?

కాబట్టి, సమున్నత కళాప్రమాణాలను తృప్తి చేయగల విగ్రహాలను మాత్రమే పురవీథులలోను, బహిరంగ స్థలాలలోను ప్రతిష్ఠించాలని మద్రాసు ప్రభుత్వంవారు చేసిన సూచనల ముఖ్యోద్దేశాన్ని గ్రహించి, ప్రజలు ఇకముందైనా దేశభక్తి పేరిట కళాదేవతకు అపకృతి చేయరని భావిస్తున్నాము.

జాతీయ పతాకం విషయంలో కూడ ప్రభుత్వంవా రేర్పరచిన నిబంధనలు అనుసరించడంచేత, మన గౌరవాన్ని, మన జాతి గౌరవాన్ని వృద్ధి చేసినవార మౌతాము.

—ఆంధ్రప్రభ సంపాదకీయం (21-6-50)

## నేటి స్త్రీల కర్తవ్యము :

రచన: పెద్దాడ సరస్వతీదేవి బి. ఎ. బి. టి.

ప్రపంచములోని కెల్ల భారతస్త్రీలు తమ ఉదారతకు, ఆదర్శ గృహజీవితమునకు ప్రసిద్ధిగాంచిరి. భారతస్త్రీల పూర్వ ఔన్నత్యమును తెలిసికొనినచో వారికి అన్ని రంగములలోను గొప్పస్థాన మున్నది. నైతిక ఆదర్శములలో ప్రపంచమందలి అన్ని దేశములలో ప్రఖ్యాతిగాంచినది మన భరతభూమి.

* * *

స్త్రీల బాధ్యత మునుపటికన్న ద్విగుణీకృతమైనదని తెలియనగుచున్నది. ఈ నవనాగరికతా ప్రపంచములో స్త్రీలు సర్వధర్మములను పరిస్థితి కనుకూలించువిధమున నెరవేర్చవలెను.

స్త్రీ శక్తిస్వరూపిణి—ఆదిశక్తి—పురుషుని అర్ధాంగి. ఇన్ని శక్తు లున్నను నేటిసంఘములో కారణాంతరములచే ఆమెకు సముచితస్థానము లేదు. ఏ సంఘమైనను నగభాగము అణగద్రొక్కబడి యున్నప్పుడు అభివృద్ధి గాంచదు. తల్లి అజ్ఞానురాలైన పిల్లలు తెలివిగలవారు కాజాలరు.

* * *

మహిళలు నాలుగు గోడలమధ్యనుండి బయటికి రాగలిగిననాడే భారతావనిలో సుప్రభాతమగును. వారికి గృహబాధ్యతలే కాక ఇంకను ఇతర కార్యక్రమము లున్నవి. మహిళాసంఘముల నేర్పరచినారే కాని కార్యరంగములో ప్రవేశించి పనిచేయువారు బహు స్వల్పముగా నున్నారు. వారు ఇతోధికోత్సాహముతో పనిచేసి వారి బాధ్యతలను సక్రమముగా నెరవేర్చుకొనవలయును. సంఘమున కపాయకరములైన కొన్ని దురభ్యాసములను మాన్పుటకు ప్రయత్నించవలయును. విద్యావతులైన స్త్రీలు సహితము కేవలగృహకార్యములలోనే చిక్కుకొని సంఘసేవను చేయకుండుట అనుచితము.

స్త్రీలు సమానాధికారములకొరకు పురుషులతో పోరాడి అన్నిరంగములలో ప్రవేశించవలెను. విద్యా, రాజకీయ క్షేత్రములలోను, సంఘసేవలోను, దేశసేవలోను నిమగ్న అయిననాడే స్త్రీజన్మ సార్థకమగును.

—సౌభాగ్య (జూన్ '50)

## రెండు అపూర్వ వచన రచనలు

రచన: శ్రీ నిడుదవోలు వెంకటరావు.

౧. శివరహస్యఖండము: ఈ ప్రశస్త వచన కావ్యము ముదిగొండ బ్రహ్మయలింగారాధ్యులచే రచితమై క్రీ. శ. ౧౮౫౨ లో ముద్రితమైనది. ౧౮౭౬ లో రెండవమారు ముద్రితమైనది. ఆ గ్రంథవివరణము ఈ క్రింద నీయబడినవి:

ఇది స్కాంద పురాణ శంకరసంహితయందు ౧౩౦౦౦ శ్లోకములుగల ఖండము. ఇం దేడు కాండలు (౧) సంభవ (౨) అసుర (౩) వీర

మాహేంద్ర (౪) యుద్ధ (౫) దేవ (౬) దక్ష (౭) ఉపదేశము లనునవి. తెలుగున వచనముగ వ్రాసిన గ్రంథకర్త చంపూకావ్యములవలెనే గ్రంథావతారిక ఆశ్వాసాద్యంత గద్యపద్యములు వ్రాసియున్నాడు.

* * *

శివరహస్యఖండము మంచి వచన రచన గల కృతి. శైలి సరళముగ నుండును మచ్చునకు :

విష్ణునేత్రసంజనిత అగు సౌందర్యవల్లి అమృతవలియనుకన్య లిద్దఱు నొద్దిక నద్దేవసేనాపతిని వరింపందలచి మోహంబున మన్మథశరావిద్ధచిత్తలై యాబిత్తరులు విశాఖు దఖంగతపశ్చర్యంగాని వరింపదని మనంబున నిశ్చయించి యహోరాత్రంబులాహారనిద్రల నూహింపక కుమారు దుద్భవించిన శరవణ తటాకతటంబుచేరి దుకూలవసనంబులు విసర్జించి నారచీరలు దాల్చి, మణికాంచీదామంబులు దలంపక, శరపుంజ మౌంజీ ధరితలై యాగరితలు భస్మత్రిపుండ్రంబులు రుద్రాక్షాభరణంబులు దాల్చి జటాధారిణులై షడక్షరీ మంత్రంబు జపియించుచు దహర పుండరీకంబున గుహుని నిల్పి యనేక హాయనంబులు నిరాహారులై తపంబు సేయుచున్న బాహులేయుం డాయువతుల యతిశయతపశ్చర్య జరించుటగాంచి యవార్యంబగుదయ దళుకొత్త నత్తఱిం బొడసూప వేడుక పొడమ, మణిహారావళీ విలసిత వక్షస్థలుండు, దరహాసచంద్రికావిరాజమాన ముఖచంద్రుండు నగుచు మారట మారుడో యన గుమారుండు గనబడియె. (పుట ౬౭)

శివరహస్యఖండము: టీకాతత్త్వప్రకాశిని వచన కావ్యము ముదిగొండ బ్రహ్మయలింగారాధ్య కృతము. ౧౯౬౬ లో ఎద్దనపూడి సంజీవయ్య గారిచే చెన్నపురి శశిలేఖా ముద్రాక్షరశాలలో ముద్రితమైనది. ఈ ముద్రణమున రాయలు సైజున ౪౧౬ పుటలు చిన్నసైపుతో గలవు. గ్రంథాంత్యమున గద్య యిట్లున్నది.

ఇది శ్రీమద్భ్రమరాంబా మల్లేశ్వర కరుణాకటాక్షవీక్షపాత్ర భారద్వాజసగోత్ర ముదిగొండ మల్లనారాధ్య పుత్ర సకలకవిజనానుషంగ బ్రహ్మయలింగ ప్రణీతంబైన శ్రీ స్కాందం బను మహాపురాణంబున శంకర సంహితయందు, శివరహస్యఖండంబున కర్థతత్త్వప్రకాశిని యను వచనకావ్యంబు పంచాశీతితమోధ్యాయసమన్విత ముపదేశకాండంబు సమాప్తము.

| | |
|---|---|
| సంభవకాండ | —౫౦ |
| అసుర | —౧౫ |
| వీరమాహేంద్ర | |
| యుద్ధ | —౩౫ |
| దేవ | —౮ |
| దక్ష | —౪౧ |
| ఉపదేశ | —౭౫ |

అధ్యాయములు—

ప్రతి అధ్యాయముముందును వచనభాగమును సంగ్రహముగా దెలుపు పద్యములు గలవు.

ఈ గ్రంథము శైవులకేగాక సాహితీవేత్తల కుపాదేయ మగు కృతి. ఈ వచన రచన పునర్ముద్రణము చేయదగినది.

౨. తెలుగువెలుగుముగుదకిత అను శ్రీమచ్చాంద్రకవితావేదినీవిలాసము: ఇది తిరువల్లిక్కేణి నిలయుండగు తడకమళ్ళ వెంకటకృష్ణరావుచే రచియింపబడి పిల్లలమఱ్ఱి పూర్ణయ్యసిద్ధాంతిచే బరిష్కృతమై చెన్నపురి శ్రీ నిధి ముద్రాక్షరశాలయందు ముద్రింపబడియె, ౧౮౭౯; ౧౦౨ పుటలు. చిన్న సైజు.

* * *

ఇది తెనుగుకవిత్వమునకు సంబంధించిన నవల. కల్పితము శృంగారలతికయను రాజకన్యక తుందుదను రాజకుమారుని మోహించుట, వారికి సమాగమము కాక, ఇరువురు ప్రాణములు విడిచి పిశాచ రూపములు ధరించుట, ఒక యోగివలన వారల పూర్వవృత్తాంతము తెలిసికొనుట, కిమిడియను పట్టణమున సకల కళాధురంధరుడగు రాజునకు

చంపకామోద యను కూతురు గలుగుట, ఆమెకు "తెలుంగువెలుంగు" అని యామె విద్యావిశేషముల బట్టి పండితులు పేరుపెట్టుట, ఆమె కవితాచమత్కృతులచే నందఱిని మెప్పించుట చీంబోతురాయని యుదంతము—మున్నగున వింద గలవు. అచ్చటచ్చట పద్యములు గలవు. శైలి సరళమై, సులభ గ్రాహ్యమై యున్నది.

మచ్చునకు—

"కిమిడి యను పట్టణంబున తెలుంగు వెలుంగను నొక పడుపుకత్తియ, యీ లోకంబున దనకు సరి తెలుంగుపండితులు లేరనియు, కవులు పశువులే యనియు బలుకుచు వచ్చినవారియెడ తొలుత ౧౦౦౦ వరహా లొక్కరాత్రికని తీసికొని యాపిదప నెద్దియో యొక పద్దెము వ్రాసి పంపుటయు, నతం డుత్తరం బివ్వనియెడల నతనిపై పేడనీరుబోయించి చీపురుచేటలచే గొట్టి యవమానం బొనర్చి యను పుటయు జేయుచున్నయది. దానిచే నవమతులుం ధనముం గోల్పోయినవారు ననేకులు గల రందులోన నేమను నొక్కండనయ్యు నా ధననష్టంబును నవ మానమును నోర్వజాలక యిక్కడకు వచ్చితి."

—భారతి (జూన్ 50)

## గాయకుడూ, సమిష్టి వ్యవసాయదారులు

రచన: నికొలై మోయిసీ ఏల్

ఈమధ్యనే యుజ్బెక్ స్థాన్‌లో గల కెలినిన్ జిల్లాలోని సమిష్టి వ్యవసాయక గ్రామాలలో పెద్ద పెద్ద పోస్టర్లు ప్రత్యక్షమైనాయి.

జిల్లాలో పెద్ద వ్యవసాయ క్షేత్రాలలో ఒకటైన స్టాలిన్ సమిష్టి వ్యవసాయ క్షేత్రం వద్ద జంత్ర సంగీత కచేరీ జరుగుతుందని వీటిలో ప్రకటింపబడింది. మూడుసార్లు స్టాలిన్ బహుమానం అందుకున్న సోవియట్ సంగీతవిద్వాంసుడు (కంపోజర్) రీన్‌హోల్డ్ గ్లియరీ జంత్రవాయిద్యాలకు నాయకత్వం వహిస్తాడు.

సమిష్టి వ్యవసాయ క్షేత్రాల్లోని పండ్లతోటలు సంధ్యారుణ కాంతులలో ప్రభాసమానమై ప్రకాశించే వేళప్పుడు, పనులు ముగించుకొని, ఇరుగు పొరుగు గ్రామాలనుండి అతిథులు స్టాలిన్ సమిష్టి వ్యవసాయ క్షేత్రానికి చేరుకుంటున్నారు. లెనిన్, వొరొషిలోవ్, వాటు టిన్, తదితర సమిష్టి వ్యవసాయ క్షేత్రాలనుండి పత్తి వుత్పత్తిదారులూ, కూరగాయలు, పండ్లు పండించేవారూ, గొల్ల భామలూ తమ స్వంత కారుల్లోనూ, బస్సుల్లోనూ, సైకిళ్ళమీదా, మోటారు సైకిళ్ళమీదా, గుర్రాలమీదా వచ్చారు. స్టాలిన్ సమిష్టి వ్యవసాయ క్షేత్రంలో గల పెద్ద భవనం (క్లబ్ హౌస్) కొన్ని వందల మంది పడుతుంది. కాని ఎక్కడా ఖాళీలేదు. ఇంకా ప్రజలు వస్తూనే వున్నారు.

ఆ శనివారం సాయంత్రం ఈ వ్యవసాయ క్షేత్రంలోని భవనంలో ప్రజలిలా కిటకిటలాడుతున్నారంటే కారణం, యుజ్బెక్ సమిష్టి వ్యవసాయ క్షేత్రానికి జంత్ర సంగీత సభ అనేది కొత్తదికాదు. టాష్కెంట్ పట్నంనుండి వుత్తమ సంగీత విద్వాంసులు తరుచుగా యుజ్బెక్ గ్రామాలకు అతిథులే. మాస్కో, లెనిన్‌గ్రాడ్ మొదలైన నగరాలలోని ప్రఖ్యాత సంగీత విద్వాంసులు యుజ్బెక్‌స్థాన్‌ను దర్శించినప్పుడు వ్యవసాయదారులకు తమ సంగీతాన్ని వినిపించడం తమ ప్రథమ బాధ్యతగా ఎంచుతారు.

అయితే, ఈ రీన్‌హోల్డ్ గ్లియర్ చేసే సంగీత కచేరీ ప్రజల నెందు కింత ఎక్కువగా ఆకర్షిస్తుందంటే, ఈ విద్వాంసుని సంగీతం ముఖ్యంగా యుజ్బెక్ ప్రజాసామాన్యానికి ఎంతో దగ్గరిది, సన్నిహితమైంది కాబట్టే.

సోవియట్ రిపబ్లిక్కుల్లో, సారాంశంలో సామ్యవాదమై, స్వరూపంలో జాతీయమైన కళ శ్రామిక ప్రజల సేవకై వినియోగింపబడుతూంది. ప్రజాసేవ సోవియట్ కళోపాసకులకు వుద్రేకాన్ని ప్రసాదిస్తుంది. ఈ సూత్రానికి కట్టుబడిన రీన్‌హోల్డ్

గ్లియిరీ సోవియట్ ప్రజల కళనూ, ముఖ్యంగా యుజ్‌బెక్ ప్రజల జానపద సంస్కృతిని స్పష్టంగా తరచి చూడడం కోసం, తన సృజనాత్మక కార్యాచరణలో అధిక ఆసక్తితో కృషిచేశాడు. మనోహరమైన యుజ్‌బెక్ పాటలను విశేష ప్రజ్ఞతో తన సంగీత వాహినిలో వుపయోగించేడు. ముఖ్యంగా "రెడ్ పార్టీ", "బ్రాంజి హార్స్‌మెన్"అనే బేలట్సులో (సంగీత అభినయ నృత్య సమ్మేళనం) వుపయోగించి ప్రపంచఖ్యాతి పొందేడు. ఈతని సంగీతం దేశంలో ఎంతో పేరుబడసింది.

ఈ అనుభవజ్ఞుడైన సంగీత కళానిధి యుజ్‌బెక్‌స్థాన్ వచ్చినప్పుడల్లా గ్రామీణ జిల్లాలు, పట్టణాలు దర్శిస్తాడు. ఈసారి వచ్చినప్పుడు అతని సంగీతం వినిపింపమని స్టాలిన్ సమిష్టి వ్యవసాయ క్షేత్ర సభ్యులిచ్చిన ఆహ్వానాన్ని అంగీకరించాడు.

రీన్‌హోల్డ్ గ్లియిరీ సంగీత దర్శకుని స్థానంలో నిలుచోగానే హర్షధ్వానులు మిన్నుముట్టేయి. తన కార్యక్రమంలో యుజ్‌బెక్ జానపద ఇతివృత్తాల మీద ఆధారపడ్డ తన రచనలుకూడా చేర్చేడు. వాటన్నిటినీ తన దర్శకత్వం క్రింద ప్రభుత్వ జంత్ర సమ్మేళనం మీద ప్రయోగించేడు.

"గుల్‌సరా", "లైలా అండ్ మజ్నూ" అనే యుజ్‌బెక్ ప్రజల గేయ నాటికలనుండి రాష్ట్రు కరిగించే పాటలను వినిపించేడు. గ్లియిరీ ఈ పాటలను యుజ్‌బెక్ కంపోజర్ టి. సాడికోవ్ సహాయంతో వ్రాశాడు.

కార్యక్రమంలో గ్లియిరీ వ్రాసిన "ఫెర్గానా ఫెస్టివల్" అనే పాటకూడా వుంది. 1939 లో బ్రహ్మాండమైన ఫెర్గానా కాలువ నిర్మాణంలో (దీనికి స్టాలిన్ పేరు పెట్టారు) యుజ్‌బెక్ వ్యవసాయదారుల దేశభక్తియుతమైన కృషి ఈయన నీ రచనకు వుద్రేకపరచింది. యుద్ధానికి పూర్వం మధ్య ఆసియాలో స్టాలిన్ పంచవర్ష ప్రణాళిక కింద జరిగిన పెద్ద పంటకాలువల నిర్మాణంలో ఇదొకటి. ఈ సంగీత సభకు వచ్చిన 11 సంవత్సరాల క్రితం ఈ వుద్యమంలో పాల్గొన్న 1,60,000 మంది యుజ్‌బెక్ వ్యవసాయదారుల్లో కొంతమంది వున్నారు. వీరు 45 రోజుల్లో 270 కిలోమీటర్ల పొడవుగల కాలువ తవ్వేరు. ఈనాడీ కాలువ కొన్నిలక్షల ఎకరాల భూమికి నీటినిస్తూంది. ఈ పాటకు హర్షధ్వానాలతో అభినందించారు. అతి విశాలమైన ఎడారిని సస్యశ్యామలమైన పొలాలుగా, పండ్ల తోటలుగా మార్చిన ఈ కాలువ నిర్మాణాన్ని శక్తివంతమైన తన సంగీత భాషలో పెట్టి వినిపించాడీ గాయకుడు.

ఈ సంగీత కచేరీలో చాలమంది యుజ్‌బెక్ ప్రముఖ గాయకులు కూడా పాల్గొన్నారు. వారిలో స్టాలిన్ బహుమానం పొందిన యుకరమ్‌తుర్గుంబావా, (ఇండు గ్లియిరీ పాటలకు నృత్యంచేసేడు), గాయకులు కరీమ్ జకిరోవ్, గుల్యామ్ అబ్దురాక్‌మానోవ్, ఫతీమా బొరుఖోవా వున్నారు. ఈ ప్రజా కళావేత్తలు గ్లియిరీ వ్రాసిన ప్రేమగాథలను గానం చేశారు.

కచేరీ ముగిసిన తరువాత వ్యవసాయక్షేత్ర స్త్రీ పురుషులు అతనిని అభినందించారు. తమ ప్రేమైక సంగీత విద్వాంసుని విడిచిపెట్టడానికి వారి కిష్టం లేదు.

సమిష్టి వ్యవసాయక్షేత్రంలోని భవనం, కచేరీ వినదలచుకొన్నవారందరికీ చాలదు కనుక వ్యవసాయక్షేత్రంలో వున్న రేడియోప్రసార కేంద్రం నుండి బ్రాడ్‌కాస్టు చెయ్యబడింది. పొలాల్లోనూ, కేంపులోనూ అనేకచోట్ల లౌడ్‌స్పీకర్లు ఏర్పాటు చేయబడ్డాయి. ప్రజలు వాటిచుట్టూ మూగేరు.

నగరాల్లో వున్న సంగీత కళాభిమానులు కూడా గ్లియిరీపాటను వినదలచుకున్నారు. కాబట్టి ఈ సంగీతం టాష్కెంట్ రేడియోకేంద్రంనుండి బ్రాడ్‌కాస్టు చెయ్యబడింది. పల్లెప్రజల కిచ్చిన సంగీత కచేరీ నగరవాసులకు బ్రాడ్‌కాస్టుచెయ్యడం ఇది ప్రథమపర్యాయంకాదు. సోవియట్ వ్యవస్థలో గ్రామీణప్రజల సాంస్కృతికస్థాయి అతిత్వరగా

పెరుగుతూంది. పల్లెలకూ పట్టణాలకూ మధ్య గల వ్యత్యాసం మాయమవుతూంది. సంగీతం తక్కిన అన్ని కళాస్వరూపాల్లాగే గ్రామీణజిల్లాల్లో వెల్లువలుగా వ్యాపిస్తూంది. దీనికి స్లెయిరీ సంగీతసభ ఒక ప్రబల దృష్టాంతం.

సాయంత్రం సమిష్టి వ్యవసాయదారులు ఈ కళానిధికి పెద్ద విందుచేసి గౌరవించారు. చాల రాత్రి వరకూ ఈ కంపోజర్ వ్యవసాయక స్త్రీపురుషులతో ఒక సుహృద్భావ వాతావరణంలో మనసు మనసు కలిపి మాట్లాడేడు. తన సంగీతంమీద వారి అభిప్రాయాలను జాగ్రత్తగా విన్నాడు. ముందుముందు తాను వ్రాయబోయే రచనలగూర్చి తన ప్లానులను వారికి విశదీకరించాడు.

—టాస్ (21-6-50)

## భారతీయ నాగరికతను అలవరుచుకున్న ఇండొనీషియా వ్యవస్థ

జీవితంలో ఎన్నడూ చూడని, ముక్కూ ముఖం ఎరగని అపరిచిత వ్యక్తిని మొట్టమొదటిసారి చూసీ చూడగానే పరిష్వంగం చేసుకోడం సంభవమేనా, ఇండొనీషియా రిపబ్లిక్ అధ్యక్షుడు డా॥ సుకర్నో ఢిల్లీ వచ్చినప్పుడు అది సంభవించింది. కట్టుకథల్లో చెప్పినట్టు అజ్ఞాతంలో పుట్టి పెరిగిన సహోదరుని గురించి ఆనోటా ఆనోటా విని చిరకాలానికి చూసే తరుణం వచ్చినప్పుడు ఇటువంటిది సంభవిస్తుంది.

భారత జాతీయోద్యమ కథలు, ప్రపంచ చరిత్రలోని జాతీయ స్వాతంత్ర్య సమరాల వృత్తాంతాలు రక్తాన్ని ఉడుకెత్తించగా, స్వజాతి దాస్యశృంఖలాల్ని త్రెంచుకోడానికి ఇండొనీషియా యువకులు ఉద్యమం ప్రారంభించారు. భారతదేశంలో గాంధీజీ పేరు జాతీయ చైతన్యానికి తారకమంత్ర మైనట్లుగా, ఇండొనీషియాలో సుమత్రా ద్వీపం మొదలు టైమర్ న్యూగినీ ద్వీపాలవరకూ "మర్డేకా" (స్వాతంత్ర్యం) అనే నినాదం సముద్రాంతరాలు దాటి పట్టణాల్లో పల్లెల్లో, పర్వతాల్లో, అరణ్యాల్లో ప్రతిధ్వనించింది.

ముప్ఫయ్యొక్క వందల ద్వీపాల్లో నివసిస్తూ పదిహేడు భాషలు, రెండువందల మాండలిక పరిభాషలు మాట్లాడే ఎనిమిది కోట్ల ప్రజల్లో జాతీయైక్యతాభావం ఉప్పొంగి దాస్యశృంఖలాల్ని ఛేదించింది. సర్వ సంపత్సమృద్ధ మైనప్పటికీ భారతదేశం వలెనే రాజకీయ దాస్య ఫలితంగా దుర్భరదారిద్ర్యం, జాతీయభావం లోతుగా పాతుకున్నాయి యీ ద్వీపసమూహంలో.

ఇంటింటా అరటిమొక్కలు మల్లె, పందిళ్ళు, పొగడపొదలు, మందార మొక్కలతో ఊరూరా చెరువులు, మామిడితోపులు, తాటి, తుమ్మ తోపులు, చింత, ఎర్రగన్నేరు, తంగేడు, జువ్వి మొదలైన చెట్లతో కళకళలాడే మన పూర్వ గ్రామ్యజీవనాన్నీ, నిత్యం పచ్చతోరణమై వెలసిన మన పూర్వ భారతీయ నాగరికతనీ మళ్ళీ కనులారా చూడాలంటే యవద్వీపసమూహానికీ, థాయిలెండ్‌కీ వెళ్ళవలసిందే నంటారు. మనదేశంలో ఆ పచ్చనితనం శ్రావణ భాద్రపదాలలో బంతిపూలతోపాటు ఒకసారి లీలగా కనిపించి మాయమైపోతుంది. హిందూ గ్రామజీవన మాధుర్యం ఇంకా ఇండొనీషియాలో లభిస్తుందట.

హిందూ మహమ్మదీయ సభ్యతా సమైక్యత అక్కడే సార్థకమయింది. జపాన్ సైన్యాల ఆక్రమణ, గొరిల్లా యుద్ధాలు, రిపబ్లికన్ల స్వాతంత్ర్య పోరాటాలవల్ల కొంతవరకూ ఇండొనీషియా జాతీయార్థిక పరిస్థితి క్షీణించిపోయినప్పటికీ, పల్లె జీవనంలోని శాంతి సుఖాలు, తృప్తి, పచ్చదనం మాయంకాలేదు. అనేక శతాబ్దాలై యవద్వీప సమూహంతో మన సంబంధ బాంధవ్యాలు తెగి దూరమైపోయినప్పటికీ, ఉభయజాతులకూ మధ్య సహోదరభావం ఒకటి అజ్ఞాతంగా అలానే ఉండిపోయింది. ఉభయజాతుల మధ్య కల ఈ సహోదరభావాన్ని పెంపొందింపజేసి సాక్షాత్కరింప చేసుకోడానికే మన ప్రధాని పండిట్ జవహర్లాల్ నెహ్రూ ఇండొనీషియా సంచారానికి వెళ్ళారు. వెళ్ళిన చోటెల్లా "బంగ్ నెహ్రూ"ను (సహోదరుడు నెహ్రూను) ఇండొనీషియా ప్రజలు ప్రేమాదరాలతో

సమ్మానించారు. పండిట్ నెహ్రూ పేరు చెప్పితే భారతదేశంలోనే కాదు, ఆసియా అంతటా ప్రజలు వేలు, లక్షలుగా చేరి భక్తి ప్రకటిస్తారు. గాంధీ నెహ్రూలు లోకబాంధవులైనారు.

భారతదేశానికి,ఇండొనీషియాకి అనేకవిషయాల్లో సారూప్యం ఉంది. భారతదేశంలో కాశ్మీర్, నేపాళ దేశాల మొదలు కన్యాకుమారి అగ్రంవరకూ హిందువులందరికీ రామాయణం పట్ల భక్తి ప్రేమలు అధికం. బౌద సిద్ధాంతాల పట గౌరవాదరాలు అపారం. ఇండొనీషియాలో బలిద్వీపం లోని "బ్రాహ్మణ మతస్థులకే" కాక, మహమ్మదీయు లందరికీ కూడా రామాయణం పట్లనూ, బౌద్ధమతం పట్లనూ అపారమయిన ప్రేమాదరాలున్నాయి.

ఉభయ దేశాల నాగరికతా పల్లె జీవనంలో రాణించింది. సర్వ సంపత్సమృద్ధ మయినప్పటికీ దుర్భరదారిద్ర్యం అనుభవిస్తున్నాయి. పల్లెజీవనం, పల్లెల పచ్చదనం ఉభయ దేశాల్లోనూ క్రమ క్రమంగా అంతర్ధాన మౌతున్నాయి. వడ్రంగి, కుమ్మరి, చాకలి, సాలి, కమ్మరివృత్తులు ఒకప్పు డుచ్చదశకు వచ్చి ఇప్పుడు క్షీణిస్తున్నాయి. ఆ వృత్తుల గౌరవం క్షీణించిపోతోంది. ఉభయ దేశా ల్లోనూ అనాదినుంచీ పండిత పామరులకు వినోదం చేకూర్చిన పురాణ కథా కాలక్షేపాలు, తోలుబొమ్మ లాటలు, దేవతల ఊరేగింపులు, ఉత్సవాలు, దేవతల పూనకాలు, జ్యోతిష్కులు, సోదె చెప్పేవాళ్ళు, భట్రాజులు, మంత్రగాళ్ళు, గారడీవాళ్ళు, ఇంద్ర జాలం, మూలిక వైద్యాలు, బలప్రదర్శనాలు, కోడిపందాలు, పొట్టేళ్ళ పోటీలు మొదలైనవి క్రమక్రమంగా అంతర్ధానమై ప్రజలకు ఆధునిక జీవన విధానం అలవడుతోంది. ఉభయ దేశాల్లోనూ ఎక్కడ చూసినా మహానగరాల్లో కాని, కుగ్రామా లలోకాని పూరిళ్ళు, పెంకుటిళ్ళు కానవస్తాయి. వరిచేలు, ఎద్దుల నూడ్చి కర్రనాగళ్ళతో దున్నిన భూమి, గుబురుతోటలు, మహావృక్షాలు, రెండెడ్ల బళ్ళు, ఒంటెద్దు బళ్ళు, పాడిపశువులు, సంతలు— అదే ప్రశాంత గ్రామజీవనాన్ని సాక్షాత్కరింప చేస్తాయి. పొంగుబుగ్గలూ, మెరిసే చిన్న కళ్ళూ గలిగి పొట్టిగా ఉండే ఇండొనీషియన్ పల్లెవాసులు అమాయకులు.

శైవ వైష్ణవ దేవాలయాలు, బౌద్ధ స్తూపాలు ఇండొనీషియాలో కూడా తరుచు కానవస్తాయి. శిల్పనృత్యాదికళల్లో, జానపద నృత్యగీతాదిరంగా లలో హిందువుల కళల కత్యంత సన్నిహిత బాంధవ్యం ఉంది.

ఉభయదేశాల్లోనూ కూడా రాజకీయాలంటే ప్రజ లకు జీవన సముద్ధరణ సాధకం, నాయకులకు అధికార సముపార్జన పరికరం. కాని మనదేశంలో వలె ఇంకా ఇండొనీషియాలో ప్రజల్లో వారి మూర్ఖ ఆచారాలనుంచీ, నిరర్థకమైన సమాజ నియమాల నుంచీ, పరివర్తన పొందడానికి రాజకీయ చైతన్యం కాని, సమాజస్థిత నీతిపట్ల రోతకాని బలీయం కాలేదు. అందువల్ల ఇంకా ఇండొనీషియాలో ఈ గ్రామీణ జీవనం నిరాటంకంగా కొనసాగిపోతూనే ఉంది. ప్రజల జీవన సముద్ధరణకు ఉభయదేశాల జాతీయనాయకులు ప్రాణాలొడ్డి కృషిచేస్తున్నారు. మన దేశాన్ని విచ్ఛిన్నపరచగలిగిన మతోన్మాదుల ఉద్యమం ఆ దేశంలోనూ ఉంది కాని ఆ ఉద్యమం క్రమక్రమంగా క్షీణించిపోతోంది.

ఆసియా ప్రజల స్వాతంత్ర్య చైతన్యానికి ఇండియా, ఇండొనీషియాలు పునాదులు. ఈ దేశా లకు పరదేశాల ఆక్రమణ అక్కరలేదు. పరుల సొత్తుపైన కాంక్ష లేదు. జాతీయైక్యతా సాధనా, ఆర్థిక సముద్ధరణ ప్రధాన సమస్యలు. ఈ రెండు లక్ష్యాల్ని సాధించడానికి ముఖ్య ప్రతిబంధకాలు పాశ్చాత్యులూ, కమ్యూనిస్టుల కుట్రలు. ఈ ప్రతి బంధకాల్ని గడవాలంటే ఆసియాదేశాల మధ్య సహకారం, సమైక్యతాభావం, సోదర భావం బల పడవలసిన అవసరం ఉంది. అది సాధించడానికే డా॥ సుకర్నో ఢిల్లీ వచ్చి భారత రిపబ్లిక్ ప్రతిష్ఠాప నోత్సవంలో పాల్గొని మైత్రీభావం ప్రకటించాడు. ఇప్పుడు పండిట్ జవహర్లాల్ నెహ్రూ ఇండొ

నీషియా సంచారం చేస్తున్నారు. భారతీయుల మాదిరిగానే అక్కడ కూడా ఇండొనీషియన్ ప్రజలు వేలూ, లక్షలుగా వచ్చి నెహ్రూను సన్మానిస్తున్నారు. అక్కడక్కడ డచ్చివారు, బ్రిటిష్ వారు అమెరికన్ల ప్రోద్బలంపైన జాతీయప్రభుత్వాన్నెదిరించిన క్రైస్తవుల్ని, పూర్వ సైనికుల్ని నిర్లక్ష్యపరచి, ఇండొనీషియా ప్రజానీకం యావత్తు జాతీయ ప్రభుత్వంపట్ల భక్తి విశ్వాసాలను పెంపొందించుకోడానికి పండిట్ నెహ్రూ ఇండొనీషియా యాత్ర తోడ్పడవచ్చును. ఇటువంటి ఆసియా జాతీయభావం ఆంగ్లో-అమెరికన్ వర్గానికీ, కమ్యూనిస్టు వర్గానికీ కంటగింపుగా ఉండవచ్చును. కాని పాశ్చాత్యులు ఆసియాదేశాల్ని నిర్లజ్జగా, నిర్దాక్షిణ్యంగా దోచుకుంటున్నంత కాలం ఈ ఆసియా జాతీయభావం బలపడుతూనే ఉంటుంది.

దేశాలకు, జాతులకు, వర్ణాలకు, మతాలకు అతీతమైన ఈ ఆసియా జాతీయభావానికి పండిట్ నెహ్రూ చిహ్నమైనాడు. ఆసియా వాసులకు పండిట్ నెహ్రూ నాయకత్వం పట్లనూ, భారత ప్రభుత్వ విదేశాంగ నీతిపట్లనూ ప్రబల విశ్వాసం ఏర్పడింది. ఈ విశ్వాసం మైత్రి ఉభయ దేశాల మధ్యనూ పెంపొంది స్థిరపడ గలిగినట్లయితే, ఆసియా అంతటా ఈ నూత్న జాతీయభావం బలపడగలదు. దీనితో ఆంగ్లో-అమెరికన్ వర్గం పన్నుతున్న కుట్రలు, కమ్యూనిష్టుల కుట్రలు విఫలమై ఆసియా అంతటా నూతన సమాజనీతి, రాజనీతి వ్యాప్తమై బహుళ జనోపయుక్తమైన రాజకీయ సాంఘిక ఆర్థిక వ్యవస్థా స్థాపనకు అవకాశ మేర్పడవచ్చును. ఈ నూతన చైతన్యానికి ఇండియా, ఇండొనీషియాల మైత్రి సహకారాలు పునాది కాగలవు; పండిట్ నెహ్రూ చిహ్నం కాగలడు.

—ఆంధ్ర వారపత్రిక (14-6-50)


శ్రీరంగం శ్రీనివాసరావు

గీతాల సంపుటం

# మహాప్రస్థానం

వెలువడింది

శ్రీ శ్రీ

శ్రీ శ్రీ

ప్రతులకు :
రావు & రావు
పోస్టు బాక్సు నం. 39,
మచిలీపట్టణం.

ఒక్కొక్క ప్రతి మూల్యం : రు. $3\frac{1}{2}$

శ్రీ శ్రీ



PRINTED BY P. S. VENUGOPALASWAMI NAIDU AT VINODHAN PRESS 33, JONES STREET, G. T. MADRAS 1. AND PUBLISHED BY P. MIRA BAI AT 16, JONES STREET MADRAS, 1. EDITOR : P. MALLIKARJUNA RAO